మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సర్కార్ స్కూళ్లు, హాస్టళ్లు అంటే సమస్యలేనా?

ప్రజాభిప్రాయమే దిక్సూచిగా...

కృష్ణా, గోదావరి నీటి వాటా దక్కించుకోవాలి

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 5 | ఆదివారం | 01-12-2024 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

# బాలమల్లేష్ ఆకస్మిక మృతి

ప్రజాపక్షం/హైదరాబాద్ /మేడ్చల్ ప్రతినిధి

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి, బికెఎంయు, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా బాల మల్లేష్ యాదవ్ (58) శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. రెండు రోజుల క్రితమే సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మరణించిన విషాదం నుంచి తేరుకోని సిపిఐ శ్రేణులను బాలమల్లేశ్ మరణం రూపంలో మరో విషాద వార్త మరింత దిగ్భ్రాంతికి గురి చేసింది. బాలమల్లేష్ శుక్రవారం నాడు ఖమ్మంకు వెళ్లి పోటు ప్రసాద్ అంత్యక్రియల్లో కూడా పాల్గొన్నారు. ఆయనకు భార్య వందన, కుమారుడు నిషాంత్, కుమార్తె నిఖిత ఉన్నారు. ప్రజల సందర్శనార్థం బాలమల్లేష్ భౌతికకాయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఉంచుతారు. అ నంతరం హిమాయత్‌నగర్ నుంచి యాప్రాల్ వరకు అంతిమయాత్ర ఉంటుంది. యాప్రాల్‌లో బాలమల్లేష్ అంత్యక్రియలు

తరువాయి 12లో





సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ భౌతికకాయానికి యాప్రాల్‌లోని ఆయన నివాసంలో నివాళులర్పిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, , ఎన్.బాల నరసింహా, విఎస్.బోస్ తదితరులు

డి.రాజా, నారాయణ, చాడ సహా పలువురు సంతాపం

లోపలి పేజీల్లో



# మాయలోపడి... మోసపోవద్దు



● అభివృద్ధిని అడ్డుకోవద్దు
పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటా ● ఐదేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేస్తాం ● కొడంగల్‌లో పారిశ్రామిక వాడ ఏర్పాటు తథ్యం ● రైతు పండుగ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి

కరువు కాటకాలకు వలసలకు నిలయమైన పాలమూరు జిల్లా ప్రజల దశా దిశ మార్చి రుణం తీర్చుకుంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పంతో రాష్ట్ర మంత్రివర్గాన్ని ఒప్పించి ఏడాదికి రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి జిల్లా సమగ్ర అభివృద్ధికి పాటుపడుతానన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలో రైతు పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'కెసిఆర్ కమీషన్ల కక్కుర్తి కోసం కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు తీసుకెళ్లిండు... అలాంటిది మన గడ్డ అభివృద్ధికి లక్ష కోట్లు తెచ్చుకోలేమా... వాళ్ల సోయిలో పడి మోసపోవద్దు. నాప్రాంత అభివృద్ధి కోసం, ఇక్కడి యువత కోసం కొడంగల్‌లో పారిశ్రామిక వాడ నిర్మించాలనుకుంటే లగచర్ల చిచ్చు పెట్టి అమాయక లంబాడాలను జైల్లో పెట్టించింది మీరు కాదా' అంటూ విపక్షాలపై విరుచుకుపడ్డారు. 'ఒక్క కెసిఆర్‌కే గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉంది. పారిశ్రామిక వాడ కోసం 1300 ఎకరాలు ఉండొద్దా. ఆనాడు

తరువాయి 12లో



## ఇరిగేషన్ ఎఇ అక్రమాస్తి రూ.100 కోట్లు

ఏకకాలంలో 20 చోట్ల అధికారుల తనిఖీలు

ఎసిబి సోదాల్లో దిమ్మ తిరిగే నిజాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి సస్పెషన్‌కు గురైన నీటిపారుదల శాఖ హైదరాబాద్ విభాగంలో పనిచేస్తున్న హేరూర్ నికేష్ కుమార్ ఇంటితో పాటు బంధువులు, స్నేహితులకు చెందిన 19 ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు శనివారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో ఎసిబి అధికారులకు దిమ్మ తిరిగే నిజాలు వెలుగు చూశాయి. సోదాల్లో 5 ఇళ్ల స్థలాలు, 6.5 ఎకరాల వ్యవసాయ భూమి, 6 ఫ్లాట్లు, 2 వాణిజ్య స్థలాలకు సంబంధించిన ఆస్తి పత్రాలు లభ్యమయ్యాయి. సోదాల్లో నికేష్‌కుమార్ చర, స్థిరాస్తులు రూ.. 17,73,53,500 ఉన్నట్లుగా

తరువాయి 2లో

# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత





తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక

హనుమకొండలో ఘనంగా ప్రారంభమైన ఐఎఎల్ రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత పటిష్ఠమైనదని, రాజ్యాంగ పరిరక్షణ అందరి సమిష్టి బాధ్యత అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. హనుమకొండలోని కాకతీయ హరిత హోటల్ లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర రెండవ మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వందలాది మంది ప్రతినిధులు హాజరయ్యారు. కిక్కిరిసిన మహాసభల ప్రాంగణంలో ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షులు పోట్ల మాధవరావు ఐఎఎల్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ప్రారంభమైన రాష్ట్ర మహాసభల ప్రారంభ కార్యక్రమానికి ఐఎఎల్ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వ హించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక 'భారత రాజ్యాంగం –ఉద్దేశాలు' అనే అంశంపై ప్రసంగించారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా మనకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం సిద్ధించాయని, ఎంతో మంది మహానుభావులు దేశాన్ని, రాజ్యాంగాన్ని ముందుకు నడిపించారని అన్నారు. మన దేశ రాజ్యాంగం 75 ఏళ్లు గడిచినా పటిష్ఠంగా ఉందని, సాంఘిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం లక్ష్యాలుగా నమ్మకం, విశ్వా సం, వ్యక్తి స్వేచ్ఛ మన రాజ్యాంగం గొప్పతనం అన్నారు. రాజ్యాంగం అమలులో కొన్ని వైఫల్యాలు ఉన్నప్పటికీ మెజారిటీ ప్రజల హక్కులను కాపాడుతున్నదన్నారు. రాజ్యాంగం పీఠికలో ఉన్న లక్ష్యాల అమలు, అందరికీ సమాన హక్కులు అందించడంలో సమస్యలను అధిగమిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న అనేక హక్కులు, విశ్వాసాలను గుర్తించనపుడే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటి పరిరక్షణలో న్యాయవాదులు ముందంజలో ఉండాలన్నారు. దేశ పౌరులు హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తెరగాలని సూచించారు.

### సోషల్ మీడియా ఆందోళనకరం

సోషల్ మీడియా వచ్చిన తరువాత ఏ వ్యక్తి వ్యక్తిగత జీవితం వారి చేతిలో లేకుండా పోయిందని జస్టిస్ నగేష్ ఆందోళన

తరువాయి 2లో





# ప్రజల అభ్యున్నతికి నిరంతరం పోరాటం

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

ప్రజాస్వామ్య నిబంధనలు పాటించని బిజెపి : ప్రియాంకాగాంధీ

**కోజికోడ్ :** వయనాడ్ ప్రజలకు ఎంతో చేయాలని ఆశగా ఉన్నప్పటికీ.. అధికారంలో లేకపోవడం వల్ల అంతస్థాయిలో సాధ్యం కాకపోవచ్చని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కానీ, ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామన్నారు. పారిశ్రామిక వేత్త అదానీపై అమెరికా ప్రభుత్వం అభియోగాలు మోపినప్పటికీ.. ప్రధాని మోదీ మాత్రం ఆయన్ని ప్రత్యేకంగా చూస్తున్నారని విమర్శించారు. ఇటీవల కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో ఆయన సోదరి ప్రియాంక గాంధీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం వయనాడ్‌కు విచ్చేశారు. కోజికోడ్‌లోని ముక్కంలో నిర్వహించిన బహిరంగ సభకు ఆమెతో కలిసి రాహుల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయనాడ్ ప్రజలపై ప్రధాని మోదీ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. మీడియా, సిబిఐ, ఇడి, ఆదాయపన్నుశాఖలను మోదీ తన అధీనంలో ఉంచుకున్నారని, అవేవీ తమ వద్ద లేవని, అందుకే ప్రజల తరఫున ప్రభుత్వంతో కొట్లాడాలని ఈ లోక్‌సభ ఎంపి, నా సోదరి ప్రియాంకకు, యుడిఎఫ్ కూటమి

తరువాయి 2లో

## టిజిపిఎస్‌సి చైర్మన్‌గా బుర్రా వెంకటేశం




ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) చైర్మన్‌గా విద్యాశాఖ, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం నియమితులు కానున్నారు. ఈ మేరకు చైర్మన్ నియామక దస్త్రంపైన గవర్నర్ జిష్టుదేవ్ వర్మ సంతకం చేసినట్టు తెలిసిం ది. సీనియర్ ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం తన ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేయనున్నారు. చైర్మన్ నియామకానికి సంబంధించి ఒకటి, రెండ్రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నాయి. ప్రస్తుత టిజిపిఎస్‌సి చైర్మన్ మహేందర్‌రెడ్డి పదవీ కాలం డిసెంబర్ 3న ముగియనుంది. ఈ క్రమంలో కొత్త చైర్మన్ నియామకానికి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించగా రిటైర్డ్ ఐఎఎస్‌లు, వివిధ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు సుమారు

తరువాయి 2లో

# తమిళనాడు, పుదుచ్చేరిలను కుదిపేసిన 'ఫెంగల్'



● భారీ వర్షాలతో పలుజిల్లాలు అతలాకుతలం ● చెన్నై వీధులు జలమయం : రెడ్ అలెర్ట్ ● మీనంబాకం విమానాశ్రయం మూసివేత ● పార్కింగ్ ఏరియాగా మారిన ఫ్లైఓవర్లు



**చెన్నై :** తమిళనాడు, పుదుచ్చేరిలకు ఫెంగల్ తుఫాను ప్రమాదం ముంచుకొచ్చింది. తమిళనాడులోని అన్ని జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడు–పుదుచ్చేరి మధ్య చెన్నై సమీపం మహాబలిపురం ప్రాంతంలోనే శనివారం పొద్దుపోయాక ఈ 'ఫెంగల్' తుఫాను తీరాన్ని దాటుతుందని వాతావరణశాఖ తెలియజేసింది. ఈ రెండు చోట్లా భారీగా ఈదురు గాలులు వీస్తున్నాయి. చెన్నై లో అనేక ప్రాంతాలు నీట మునిగాయి. పలుచోట్ల ఇళ్ళు, ఆసుపత్రుల్లోకి నీరు ప్రవేశించింది. బలమైన ఈదురుగాలుల కారణంగా మౌంట్ రోడ్, అన్నాసేలై సహా పలుచోట్ల రోడ్లమీద అనేకచోట్ల పోలీసులు పెట్టిన బ్యారికేడ్లు అడ్డదిడ్డంగా పడిపోయాయి. శ్రీపెరంబుదూర్‌లో ట్రాఫిక్‌లైట్లు పగిలి కిం దపడిపోయాయి. కరత్తూర్, వేలచ్చేరి, మదిపక్కమ్, కొడుంగైయూర్ తదితర ప్రాంతాలో కూడా రోడ్లు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వ రవాణావ్యవస్థను ఆపేశారు. దీంతో 2015లో చెన్నైలో వచ్చిన వరదపరిస్థితుల బాధల నుండి తప్పించుకునేందుకు ఖాళీగా ఉన్న ఫ్లయ్ ఓవర్లపై వాహనాలను పార్కింగ్ చేసి ఉంచారు. దీంతో ఫ్లయ్ ఓవర్లు పార్కింగ్ ప్రదేశాలుగా మారిపోయాయి. భారీ వర్షాలకారణంగా రిజర్వాయర్లు నిండిపోయి పొంగిపొర్లుతున్నాయి. పూర్తిగా నిండిపోయిన చంబరంబాక్కం రిజర్వాయరు సముద్రంలా కనిపిస్తున్నది. చెన్నై

తరువాయి 2లో

# 5న 'మహా' సిఎం ప్రమాణం

ముఖ్యమంత్రి అభ్యర్థిపై కొనసాగుతున్న తర్జనభర్జన



**ముంబయి:** మహారాష్ట్ర సిఎం ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. డిసెంబర్ 5న సిఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని బిజెపి వెల్లడించింది. ముంబయిలోని ఆజాద్ మైదానంలో సిఎంతోపాటు పలువురు మంత్రులు ప్రమాణం చేయనున్నారు. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. మహారాష్ట్ర

తరువాయి 2లో

# జార్జియాలో ఆగని అల్లర్లు 107 మంది అరెస్టు

పోలీసులు, జర్నలిస్టులకు గాయాలు



**తిబ్లిసి (జార్జియా) :** యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం విషయంపై శుక్రవారం మొదలైన అల్లర్లు, నరసన ప్రదర్శనలు రెండోరోజు కూడా కొనసాగాయి. యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకునేందుకు అధికార డ్రీమ్‌పార్టీ వ్యతిరేకిస్తున్నది. ఈ కారణంతో అల్లర్లకు పాల్పడుతున్న 107 మందిని అరెస్టు చేసినట్లు జార్జియా పోలీసులు చెప్పారు. ప్రదర్శకులు రెండోరోజు కూడా రాత్రంతా తిబ్లిసిలోని పార్లమెంటు భవనం వెలుపల జాగారం చేశారని, పోలీసులపై ఖాళీ సీసాలు, మెటల్ వస్తువులు, రాళ్ళు ఆగకుండా విసురుతూనే ఉన్నారని పోలీసులు చెప్పారు. వారిపై లాఠీఛార్జీ జరిగింది. గురువారంనాడు ప్రదర్శకుల దాడుల్లో 32 మంది పోలీసులు గాయపడ్డారు. కొందరు జర్నలిస్టులు కూడా తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా 43 మందిని కూడా అరెస్టు చేశారు. యూరోయిన్ యూనియన్ అనుకూల ప్రతిపక్షాలు పార్లమెంటు సమావేశాలను బహిష్కరించాయి. డ్రీమ్‌పార్టీని అధికారం నుండి కూలదోసేందుకు యూరప్‌నుండి తీవ్ర ఒత్తిడి వస్తున్నది. జార్జియదేశం యూరోపియన్ యూనియన్ సభ్యత్వం తీసుకునేందుకు సంబంధించిన సంప్రదింపులు బహిష్కరిస్తున్నట్లు ఆ దేశ ప్రధానమంత్రి ఇరక్లి కొబఖిడ్జే ప్రకటించడంతో నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. యూరోపియన్ యూనియన్‌కు బడ్జెట్ కేటాయింపులను 2028 వరకూ వాయిదా వేస్తున్నట్లు జార్జియా ప్రధానమంత్రి ఇరాక్లీ కొబఖిడ్జే ప్రకటించడంతో యూరోపియన్ యూనియన్ కూడా తీవ్రంగా స్పందించింది. నల్లసముద్రం వద్ద ఉన్న కాకాసస్ ప్రాంతదేశం జార్జియాలో 12 ఏళ్ళుగా దేశంలో అధికారంలో కొనసాగుతున్న డ్రీమ్ పార్టీ మొదటి నుండీ రష్యాకు అనుకూలంగా ఉందని యూరోపియన్ యూనియన్ ఆరోపిస్తున్నది. డ్రీమ్‌పార్టీ ఈ ఏడాది అక్టోబరు 26 న పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో తిరిగి తన అధికారాన్ని నిలబెట్టుకుంది. ఐతే ప్రతిపక్షాలు మాత్రం రష్యా ప్రభావంతో ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి డ్రీమ్‌పార్టీ గెలిచిందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ లేజిస్లేటర్స్ కూడా గతనెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని తీవ్ర ఆరోపణలు చేసింది. నిర్ణీత ప్రకారం డిసెంబరు 14వ తేదీన అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహిస్తామని డ్రీమ్‌పార్టీ ప్రకటించింది. ఆ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా ప్రముఖ ఫుట్‌బాల్ ప్లేయర్ (మాజీ) మైఖేల్ కవిలాష్విలి (53) పోటీకి దిగారు. కవిలాష్విలిని ఎన్నుకోవడానికి ఎలాంటి ఆటంకాలూ లేవు. ఎందుకంటే పార్లమెంటులో అధికార డ్రీమ్‌పార్టీకి పూర్తి మెజారిటీ ఉంది. పార్లమెంటులో ఉన్న 300 మంది ఎంపీలు అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటారు. 2017లో ఈ మేరకు రాజ్యాంగానికి సవరణ చేసిన తర్వాత మొదటిసారి ఈ పద్ధతిలో వచ్చేనెల అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత జార్జియా దేశాధ్యక్షురాలు సలోమ్ జౌరాబిచ్‌విలి కూడా డ్రీమ్‌పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారు.

# ఉక్రేన్‌కు 'నాటో' కాపలా ఉంటే.. యుద్ధం విరమిస్తా

## రష్యా ఆక్రమిత ప్రాంతాన్ని కలిపి నాటోలో సభ్యత్వం ఇవ్వాలి



**కీవ్ :** ఉక్రేన్ భూభాగానికి నాటో కూటమి గనుక కాపలా ఉంటే, పూర్తి భద్రతకు భరోసా ఇస్తే తాను రష్యాతో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నానని ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ అన్నారు. 'స్కై న్యూస్' కు ఆయన సుదీర్ఘమైన ఇంటర్వ్యూ ఇస్తూ, తాను చేసిన ఈ ప్రతిపాదనను నాటో కూటమి పరిశీలిస్తుందా? అనే విషయం సందేహాస్పదమేనని, అందుకు భరోసా లేదని అన్నారు. ప్రస్తుతం ఉక్రేన్ అధీనంలో ఉన్న భూభాగానికి మాత్రమే కాకుండా, రష్యా స్వాధీనం చేసుకున్న ఉక్రేన్ భూభాగాలను కూడా కలిపి నాటో కూటమిలో ఉక్రేన్‌కు గుర్తింపు సభ్యత్వం ఇవ్వాలని ఆ ఇంటర్వ్యూలో జెలెన్స్కీ కోరారు. ఉక్రేన్‌కు ఎలాంటి హామీలూ ఇవ్వకుండా ఊరికే నాటో సభ్యత్వం ఇచ్చినంతమాత్రాన సరిపోదని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ కాల్పుల విరమణ గురించి మాట్లాడుతున్నారనీ, కానీ రష్యా మళ్ళీ మళ్ళీ ఉక్రేన్‌పై దాడి చేయదన్న భరోసా ఎవ్వరూ ఇవ్వడంలేదని, అలాంటి భరోసా లేని కాల్పుల విరమణ ఒప్పందం అత్యంత ప్రమాదరకమైన విషయమని ఆయన అన్నారు.

ఉక్రేన్‌ను నాటో ఛత్రఛాయలో ఉంచుకోవాలని, అలాచేస్తే తమ దేశానికి పూర్తి భద్రత ఉంటుందని, వెంటనే తాను యుద్ధం విరమిస్తానని అన్నారు. రష్యా ఆక్రమించిన ఉక్రేన్ ప్రాంతాలను మినహాయించి మిగిలిన ఉక్రేన్‌కు నాటో కూటమి సభ్యత్వం ఇవ్వడం ఏమాత్రం సమజంజసం కాదన్నారు. నాటో కూటమి గనుక ఉక్రేన్‌ను తన స్వాధీనంలోకి తీసుకుని రక్షణ కల్పిస్తే నాటో సభ్యత్వం తీసుకోవడానికి తాను సిద్ధమని అన్నారు. నాటో భద్రత ఉంటే రష్యా అధీనంలో ఉన్న భూభాగాలను కూడా భవిష్యత్‌లో దౌత్యమార్గాలద్వారా కలుపుకోవడానికి అవకాశాలు వస్తాయని, పూర్వపు అంతర్జాతీయ సరిహద్దులతో ఒకేదేశంగా నాటో కూటమి ఉక్రేన్‌ను గుర్తించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. రష్యా ఆక్రమించిన భూభాగాలు లేకుండా ఉక్రేన్‌ను తాను ఊహించలేదనని, నాటో కూటమిలో ఆ విధంగా తాను సభ్యత్వం తీసుకోలేనని అన్నారు.

## అదే జరిగితే రష్యాను ఆపటం కష్టం

ఎం-16 హెచ్చరిక



ప్రపంచం

**లండన్ :** ప్రపంచం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉందని బ్రిటన్ ఎం 16 అధిపతి సర్ రిచర్డ్ మూర్ హెచ్చరించారు. ప్రపంచం గడచిన 40 ఏళ్ళలో ఎన్నడూలేనంత పెద్ద ప్రమాదంలో పడిందని బ్రిటన్‌కు చెందిన సీక్రెట్ ఇంటిలిజన్స్ సర్వీసెస్ (ఎం–16) అధిపతి ఆందోళన వ్యక్తం చేశారు. సీక్రెట్ సర్వీసెస్ అధిపతిగా తన 37 ఏళ్ళ అనుభవంలో ఇంతవరకూ ఇలాంటి ప్రమాదకర ప్రపంచ పరిస్థితులను తాను చూడలేదని అన్నారు. ప్రస్తుతం ఉక్రేన్–రష్యా మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల, పశ్చిమ ఆసియాలో రోజు రోజుకూ పెరుగుతున్న భయాలవల్ల యూరప్ ఖండానికి పెద్ద ప్రమాదం ముంచుకువచ్చిందని ఆయన హెచ్చరించారు. ఇది తీవ్రమైన విషయమని అన్నారు. యూరప్‌కు ద్రోహం చేసేవిధంగా ఉక్రేన్‌కు ఎలాంటి మద్దతూ దొరక్కుండా చేసేందుకు రష్యా చాలా దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఒక శక్తిమంతమైన దేశానికి బానిసగా, అణగిమణగి ఉండే దేశంగా గనుక ఉక్రేన్‌ను రష్యా మార్చేస్తే రష్యాను ఇక అంతటితో ఆపటం చాలా కష్టమైపోతుందని ఆయన అన్నారు. యూరప్ భద్రత సంకటంలో, అపాయంలో పడుతుందని అన్నారు. పైగా పుతిన్ తరచు ఖండాంతర అణుక్షిపణులను ప్రయోగిస్తానని భయపెడుతున్నారని అన్నారు.

# రష్యా మద్దతుతో సిరియా తిరుగుబాటుదారుల హతం

అలెప్పో స్వాధీనం



**అలెప్పో :** సిరియాలో నాలుగు రోజుల క్రితం తిరుగుబాటుదారుల చేతులో చావు దెబ్బతిన్న ప్రభుత్వదళాలు పుంజుకున్నాయి. తిరుగుబాటుదారులతో మళ్ళీ పోరాటం ఉద్ధృతరూపం దాల్చింది. తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకున్న అలెప్పోలోని అధికభాగాన్ని ప్రభుత్వ దళాలు తిరిగి చేజిక్కించుకున్నాయి. సిరియా ప్రభుత్వ దళాలకు రష్యా అండగా ఉంది. అలెప్పో నగరంపై పట్టు నిలబెట్టుకునేందుకు రష్యా, ఇరాన్‌లు సిరియా ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయి. సిరియా అతి పెద్ద నగరం అలెప్పోలో ఎనిమిది సంవత్సరాల తర్వాత ప్రభుత్వ దళాలు రష్యా మద్దతుతో దాడులు చేశాయి. శనివారంనాడు రష్యా యుద్ధ విమానాల మద్దతుతో తిరుగుబాటుదారులపై దాడులు జరిగాయి. రష్యా రక్షణమంత్రిత్వశాఖ అధికారిఓలెగ్ ఇగ్నాస్నుక్‌ను ఉటంకిస్తూ రష్యా ప్రభుత్వ వార్తాసంస్థ 'టాస్' వెలురించిన కథనం ప్రకారం, రష్యా యుద్ధ విమానాలు తిరుగుబాటుదారులు, ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. శుక్రవారంనుండీ పెద్దస్థాయిలో విరుచుకుపడుతున్న 200 మంది ఉగ్రవాదులను యుద్ధ విమానాలు మట్టుపెట్టాయి. అలెప్పో నగరశివారు సమీపంలోని ఇడ్లిబ్, అలెప్పో ప్రాంతాలలో సైనికులు, తిరుగుబాటుదారులమధ్య పోరు కొనసాగుతున్నది. శనివారంనాడు అలెప్పోలో స్కూళ్ళు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. ప్రజలు ఇళ్ళల్లోనే ఉండిపోయారని ప్రభుత్వ అనుకూల షామ్ ఎఫ్ ఎం రేడియో తెలియజేసింది. మరోవైపు తిరుగుబాటుదారులు కూడా పాతనగర కేంద్రంలో, అలెప్పో సిటడెల్, మధ్యయుగాల నాటి భవంగి ఇతర ప్రాంతాల వెలుపల తీయించుకున్న ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. సిరియాలో ప్రతిపక్షాలకు టర్కీ మద్దతుగా ఉంది. ఐనాగానీ సిరియా ప్రభుత్వ దాడులను దౌత్యమార్గాల్లో అడ్డుకోవడంలో టర్కీ విఫలమైంది. ప్రభుత్వ దాడులు 2019లో రష్యా మద్దతుతో జరిగిన ఒప్పందానికి విరుద్ధమని టర్కీ పేర్కొంది. 2015 నుండీ సిరియా ప్రభుత్వ దళాలకు లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఇరాన్ అనుకూల హిజ్బొల్లా ఉగ్రవాదులు మద్దతుగా ఉన్నారు. లెబనాన్‌లో 60 రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన రోజునే గడచిన బుధవారంనాడు సిరియా ప్రతిపక్షాలు ఎదురుదాడికి సిద్ధమయ్యాయి. గడచిన 70 రోజులుగా సిరియాలో ఇజ్రాయెల్ కూడా హిజ్బొల్లాకు వ్యతిరేకంగా తన దాడులు పెంచింది.

ప్రభుత్వ అనుకూల "అల్–వతన్' పత్రిక తాజా కథనం ప్రకారం, తిరుగుబాటుదారులకు మద్దతుగా ఉన్న వివిధ సరఫరా కేంద్రాలపై యుద్ధవిమానాలు గగనతల దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో 200 మంది తిరుగుబాటుదారులు మరణించారు. అంతకుముందు, జీహదిస్టు హయత్ తహరిన్ అల్ సామ్ (హెచ్‌టిఎస్) వారి మిత్రులైన తిరుగుబాటుగ్రూపులు కలిసి గడచిన బుధవారంనాడు దిగ్భ్రాంతి కలిగించేరీతిలో అలెప్పోప్రాంతంలో సైన్యంపై దాడులు చేశాయి. దీంతో 132కు పైగా సైనికులు మరణించారు. 60కి పైగా గ్రామాలను రెబల్స్ తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. అలెప్పో ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకున్నారు. ఆర్మీ స్వాధీనంలో ఉన్న అలెప్పోరాష్ట్రంలోని ప్రాంతాలను తిరుగుబాటుదారులు తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న మానవహక్కుల సిరియన్ అబ్జర్వేటరీ ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ యుద్ధ పరిస్థితులను, జరుగుతున్న పరిణామాలను సిరియన్ అబ్జర్వేటరీ నిశితంగా పరిశీలిస్తున్నది.

## బరువు పెరిగి, సైన్యంలో చేరకుండా...

మళ్ళీ జైలుకెళ్ళిన దక్షిణ కొరియా పౌరుడు

**సియోల్ :** సైన్యంలో చేరేందుకు ఇష్టంలేక ఉద్దేశపూర్వకంగా 20 కేజీలు బరువు పెరిగిన దక్షిణ కొరియా పౌరుణ్ణి గుర్తించిన ప్రభుత్వం అతడిని జైలుకు తరలించింది. రెండు సంవత్సరాలు శిక్ష విధించింది. దక్షిణ కొరియాకు ప్రధానంగా ఉత్తర కొరియానుండే యుద్ధ ప్రమాదం పొంచిఉంటుంది. అందుకోసం పౌరులను ముఖ్యంగా మగవారిని సైన్యంలోకి ఎంపిక చేసేందుకు దక్షిణ కొరియాలో కఠిన నిబంధనలు ఉంటాయి. వయసు బరువును బట్టి సైన్యంలోకి ఎంపిక చేస్తారు. కానీ సైన్యంలోకి ఎంపికలు చేసేందుకు పిలిచిన ప్రతిసారీ పరీక్షలకు ముందు విపరీతంగా మంచినీళ్ళు తాగి, భారీగా రెంట్టింపు తిండి తింటూ 105 కేజీలు బరువు పెరిగిన ఒక వ్యక్తి చేస్తున్న తతంగాన్ని ప్రభుత్వం గుర్తించి జైలుశిక్ష విధించింది. ఇప్పటికి మూడుసార్లు ఈ విధంగా ఈ వ్యక్తి తప్పించుకున్నాడు. ఎక్కువ బరువు ఉన్నవారిని సోషల్ సర్వీస్‌కు ఉపయోగించుకుంటారు. రోగాలు ఉన్న వారిని పూర్తిగా వదిలేస్తారు. సైన్యంలో రోగం బారినపడేవారికి చాలా శ్రద్ధగా చికిత్సలు చేస్తారు. ఇటీవలికాలంలో ప్రతి సంవత్సరం 50 లేదా 60 మంది ఈ విధంగా సైన్యం నుండి తప్పించుకుంటున్న కేసులు పెరుగుతున్నాయి. ఐదు అడుగుల ఆరు అంగుళాలు ఎత్తుగల ఈ వ్యక్తి 83 కేజీలు బరువు ఉండటంతో సైన్యానికి సరిపోతాడని భావించారు. కానీ అతగాడు తన బరువును రెట్టింపు తిండితో విపరీతంగా పెంచేసుకున్నాడు.

## పాకిస్థాన్‌లో హెలికాప్టర్ దాడులు

17 మంది ఉగ్రవాదులు కాల్చివేత

పెషావర్ : వాయువ్య పాకిస్థాన్‌లో హెలికాప్టర్ గన్‌షిప్స్ ద్వారా 17 మంది ఉగ్రవాదులను కాల్చి చంపారు. పాకిస్థానీ భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో రెండు వేరువేరు ఘటనల్లో ఏడుగురు ఉగ్రవాదులు మరణించారు. హెలికాప్టర్లద్వారా పాకిస్థాన్ భద్రతా బలగాలు ఉగ్రవాద రహస్య శిబిరాలపై కాల్పులు జరిపాయి. బన్ను, ఉత్తర వజిరిస్థాన్ జిల్లాలలో గూఢచారి సమాచారం మేరకు ఈ హెలికాప్టర్ దాడులు చేశారు. బన్ను జిల్లా బాకాఖేల్ ప్రాంతంలో హాఫీజ్ గుల్‌బహదూర్ గ్రూపునకు చెందిన 12 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఉత్తర వజిరిస్థాన్ మిర్ అలీ హాస్సో ఖేల్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో మరో ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. భారీమొత్తంలో ఆయుధాలను, ఆయుధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలో భద్రతా దళాలపై ఉగ్రవాదులు వరుస దాడులు చేస్తూ ఉండటంతో ఈ ప్రత్యేక ఆపరేషన్స్‌ను ప్రభుత్వ దళాలు నిర్వహించాయి.

## 5న 'మహా' సిఎం ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన మహాయుతి కూటమి ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం డిసెంబర్ 5న జరగనుంది అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మహారాష్ట్రలో మొత్తం 288 సీట్లు వుండగా.. మహాయుతి కూటమి 233 స్థానాల్లో విజయం సాధించింది. అటు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 51 చోట్ల గెలుపొందింది. బిజెపి 132 స్థానాలను గెలుచుకొని అతిపెద్ద పార్టీగా అవతరించింది. శివసేన (శిందే) 57, ఎన్‌సిపి (అజిత్ పవార్) 41 స్థానాల్లో జయకేతనం ఎగురవేశాయి. ఇకపోతే, శివసేన (ఉద్ధవ్) పార్టీ 20 చోట్ల విజయం సాధించగా.. కాంగ్రెస్ 16, ఎన్‌సిపి (ఎస్‌పి) 10 స్థానాలు గెలుచుకున్నాయి. మహాయుతి కూటమి స్పష్టమైన ఆధిక్యత ప్రదర్శించినప్పటికీ.. ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. తొలుత షిండే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని వార్తలు వచ్చినప్పటికీ.. బిజెపి నుంచి డిప్యూటీ సిఎం ఫడణవీస్ పేరు తెరమీదికి వచ్చింది. బిజెపి అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉంటారని అందరూ భావిస్తున్నారు. ఫలితాల తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా అందుకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మంత్రి వర్గంలోకి సగం మందిని భాజపా నుంచి మిగతా సగం శివసేన, ఎన్‌సిపి నుంచి తీసుకుంటారన్న ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో శివసేనకు 12 మంత్రి పదవులిచ్చి, అందులో మూడు కీలక శాఖలు కేటాయిస్తారన్న వార్తలు వచ్చాయి. తాజాగా మహారాష్ట్ర సీఎం రేసులో కొత్తగా మురళీధర్ మోహోల్ పేరు తెరపైకి వచ్చింది. బిజెపి పుణె ఎంపి అయిన మురళీధర్ ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. గతంలో పుణె మేయర్‌గా పనిచేశారు. రాజకీయ వర్గాల్లో పెద్దగా ప్రచారంలో లేని మురళీధర్‌ను బిజెపి అగ్రనాయకత్వం మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి సూచిస్తున్నట్లు సమాచారం. సిఎం పదవికి పోటీపడుతున్న దేవేంద్ర ఫడణవీస్‌కు బిజెపి జాతీయ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో మహాయుతి కూటమి అధిష్ఠానం మహారాష్ట్ర సిఎంగా ఎవరిని నియమిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

## ప్రజల అభివృద్ధికి నిరంతరం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

నేతలకు చెబుతున్నానన్నారు. వయనాడ్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు అంద రం పోరాడుదామని, అదానీ సంస్థలకు రూ. వేల కోట్ల ప్రయోజనం కలిగించిన మోదీ.. వయనాడ్ ప్రజలను మాత్రం చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధికి అడ్డుపడుతున్నారని అని రాహుల్ విమర్శించారు. అంతకు ముందు వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి రాహుల్, ప్రియాంక శ్రద్ధాంజలి ఘటించారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ వయనాడ్ ఎంపిగా ఎన్నికైనందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజల కోసం పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, శక్తి వంచన లేకుండా పని చేస్తానని చెప్పారు. వయనాడ్ ప్రజల గొంతునై.. ఇక్కడి సమస్యలను పార్లమెంట్ వేదికగా వినిపిస్తానన్నారు. ప్రజాస్వామ్య విధానాలకు తూట్లు పొడుస్తున్న బిజెపి ఎంత ప్రయత్నించినా.. ప్రజలు అండగా నిలవడంతో ఇక్కడ కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేక పోయిందన్నారు. కనీసం రాజకీయ యుద్ధంలో కూడా సాధారణ ప్రజాస్వామ్య నిబంధనలను పాటించడంలేదన్నారు. వయనాడ్‌లో బీభత్సం సృష్టించిన కొండచరియల ఘటనలతో బిజెపి ప్రవర్తనను పోల్చారు. ప్రకృతి వైపరీత్యాల మాదిరిగానే కాషాయ పార్టీకి ఎలాంటి నియమాలు తెలియవని, రాజకీయ పోరాటాలలో సాధారణంగా పాటించే ప్రజాస్వామ్య నిబంధనలను అనుసరించదని మండిపడ్డారు. కొండచరిల వలే నేడు మన అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్నామన్నారు. ఎలాంటి నిబంధనలూలేవని, వివరణలు అంతకన్నా లేవని ఆమె పేర్కొన్నారు. వయనాడ్ ఉపఎన్నికలో ప్రియాంక గాంధీ 4,10,931 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే.

## కుదిపేసిన 'ఫెంగల్'

(మొదటి పేజీ తరువాయి)

నగరపాలకసంస్థ సహా అనేకజిల్లాల్లో మున్సిపాలిటీలు యుద్ధ ప్రాతిపదికపై సహాయ చర్యలు చేపడుతున్నాయి. ఈ తుఫాను శుక్రవారం నుండే తమిళనాడుపై ప్రభావం చూపించడం ప్రారంభించింది. దీంతో చెన్నై మీనంబాకం విమానాశ్రయాన్ని మూసివేశారు. 50 విమానాలను రద్దు చేశారు. విమానాల రాకపోకలు స్తంభించడంతో ప్ర యాణికులు సమస్యల్లో పడ్డారు. చెన్నై సమీపంలోనే ఫెంగల్ తుఫాను తీరం దాటుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు చేసినప్పటికీ కూడా ప్రఖ్యాత చారిత్రక వారసత్వ, పర్యాటక ప్రాంతం మహాబలిపురం సముద్రతీర ప్రాంతంలో ముఖ్యంగా యువతీ యువకులు వారాంతపు విహారాల నిమిత్తం భారీగా గుమికూడడం ఆశ్చర్యం కలిగించింది. మరక్కణం, విల్లుపురం తీరప్రాంత జిల్లాలలో సముద్ర అలలు ఎగిరెగిరి పడుతున్నాయి.

అసలే అతి సున్నితమైన చెన్నై నగరంలో తుఫాను ప్రభావం వల్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. వీధులన్నీ జలమయమయ్యాయి. ప్రజలు ముందుజాగ్రత్తగా ఇళ్లల్లోనే ఉంటున్నారు. తమిళనాడులోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా హెచ్చరికలు జారీ చేసింది. పల్లపు ప్రాంతాలు ఉన్నచోట్ల ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు కూడా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. పెనుగాలుల కారణంగా చెట్లు కూలుతున్నాయి. బారికేడ్లు కొట్టుకుపోతున్నాయి. ప్రజలు రక్షణకోసం ఉపయోగించే ఛత్రాలన్నీ ఈదురుగాలులకు వ్యతిరేకదిశలోకి తిరిగి విరిగిపోతున్నాయి. ఎక్కడికక్కడే నీరు నిలిచిపోయింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం అన్ని మునిసిపాలిటీలు, నగరపాలకసంస్థ ప్రాంతాలలో ఎప్పటికప్పుడు రోడ్ల పరిశుభ్రత, క్లీనింగ్ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. అదనపు సిబ్బందిని మోహరించింది. పల్లపు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా వారికి ముందస్తు ఏర్పాట్లకు రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జిసిసి) అధికారుల సమాచారం ప్రకారం, ఇంజనీర్లు, అధికారులతోసహా 22,000 మంది పారిశుధ్య కార్మికులను అత్యవసర విధుల్లో నియమించారు. అనేక ప్రాంతాలలో నీటిని తోడి పోయడానికి వీలుగా 1,686 మోటారు పంపులను రంగంలోకి దింపారు. ఇవన్నీ 25 రెండి 100 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసేవే. వీటిని పలు ప్రాంతాలకు తరలించడానికి 484 ట్రాక్టర్లను ఉపయోగించారు.

చెన్నై క్రోమ్‌పేటలో ఉన్న జనరల్ ఆసుపత్రి, థొరాసిక్ ఆసుపత్రి రెండు ప్రభుత్వ ఆసుపత్రుల ప్రాంగణాలు నీటితో నిండిపోయాయి. కాలిమడమలు మునిగిపోయేస్థాయిలో వర్షపు నీళ్ళు లోపల నిలిచిపోయాయి. దీంతో రోగులు, వైద్యులు కూడా తీవ్ర అసౌకర్యంతో, ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలోకి నీరు రాకుండా పోలీసులు, స్థానికులు ప్రవేశద్వారాలవద్ద అడ్డంగా ఇసుక బస్తాలు వేశారు. సబర్బన్ ప్రాంతాలలో ఉన్న ఇళ్ళలోకి నీరు ప్రవేశించింది. హస్తినాపురం, తిరుమలైనగర్ ప్రాంతాలలో ఇళ్ళలోకి నీరు చేరింది. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి వస్తువులు పాడైపోకుండా నివాసితులు మంచాలపైకి ఎక్కించారు. అదేవిధంగా ఒక వలసకూలీ ఎటిఎం నుండి డబ్బు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నం చేయగా ఆ యంత్రం నీట తడిసిపోవడంవల్ల విద్యుదాఘాతానికి గురయ్యాడు.

**12 లక్షలమంది పుదుచ్చేరి ప్రజలకు ప్రభుత్వం ఎలర్ట్ ఎస్ఎంఎస్‌లు**

పుదుచ్చేరిని ఫెంగల్ తుఫాను అతలాకుతలం చేస్తున్నది. దీంతో ప్రభుత్వం రాష్ట్ర ప్రజలందరికీ ఎస్ఎంఎస్‌ల ద్వారా ఎలర్ట్‌గా ఉండాలని సందేశాలు పంపిస్తున్నది. అవసరమైన మార్గదర్శకాలను జారీ చేస్తున్నది. పుదుచ్చేరిలోనే ఫెంగల్ తుఫాను తీరం దాటుతుందని సమాచారం అందడంతో మొత్తం 12 లక్షలమంది ప్రజలకు ప్రభుత్వం ముందుగానే అప్రమత్తంగా ఉండాలంటూ పలు విధాల సమాచారంతో ఎలర్ట్ మెసేజ్‌లను పంపించింది. శనివారంనాడు పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.నంగస్వామి వర్షబాధిత ప్రాంతాలలో పర్యటించారు. ప్రకృతి వైపరీత్యాల విభాగాధికారులు చేపట్టిన చర్యలను ఆయన సమీక్షించారు. ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీచేయించి వారికి ఎక్కడ సదుపాయం ఇచ్చారు? ఎలాంటి సౌకర్యాలు కల్పించారన్న విషయాలను ఆయన ఆరాతీశారు. నివాసితుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులు గమనిస్తూ ప్రజలకు సమాచారాన్ని తెలియజేయాలని ఆదేశించారు. "పల్లపు ప్రాంతాల నుండి ప్రజలను ఖాళీచేయించాం, పలుచోట్ల షెల్టర్లు వారికోసం సిద్ధం చేశాం, ఆహార పొట్లాలు కూడా సరఫరా చేస్తాం'' అని చెరప్పారు.

## టిజిపిఎస్‌సి ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం

(మొదటి పేజీ తరువాయి)

45 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా ప్రభుత్వం బుర్రా వెంకటే శ్ పేరును సిఫార్సు చేస్తూ రాజ్‌భవన్‌కు పంపించగా, ఆ దస్త్రంపైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేసినట్టు సమాచారం. గత బిఆర్‌ఎస్ హయాంలో ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడం, పరీక్షలు వాయిదా పడటంతో నిరుద్యోగుల నుం చి తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వ్యక్తమయ్యా యి. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత టిజిపిఎస్‌సి ఛైర్మన్‌గా జనార్ధన్ రెడ్డి రాజీనామా చేశారు. అనంతరం మాజీ డిజిపి మహేందర్ రెడ్డిని ఛైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఆయన పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ఈసారి సీనియర్ ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశంను ఛైర్మన్‌గా నియమించనున్నారు.

**రెసిడెన్షియల్ నుంచి టిజిపిఎస్‌సి ఛైర్మన్ వరకు**

బుర్రా వెంకటేశం 1968 ఏప్రిల్ 10న ప్రస్తుత జనగామ జిల్లాలో జన్మించారు. ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సర్వేల్ రెసిడెన్షియల్లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు.1995 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన బుర్రా వెంకటేశం సర్వీస్ 2028 ఏప్రిల్ 10 వరకు ఉన్నది. అయితే ఆయన టిజిపిఎస్‌సి ఛైర్మన్‌గా గరిష్ఠంగా 2030 ఏప్రిల్ 10 వరకు కొనసాగే అవకాశం ఉంది.

## ఎఇ అక్రమాస్తి రూ.100 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ సుమారు రూ.100 కోట్లకుకైగా ఉంటుందని అంచనా. 2013 లో ఉద్యోగం పొందిన ఆయన వివిధ ప్రాంతాల్లో పని చేశారు. నీటిపారుదల శాఖలో ఎఇగా పనిచేస్తున్న నిఖేశ్ కుమార్ బఫర్‌జోన్ పరిధిలోని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని విచారణలో తేలింది. పదేళ్ల కాలంలోనే అక్రమంగా ఆస్తులు సంపాదించాడని ఎసిబి అధికారుల విచారణలో తేలింది.ఇక నికేష్‌కుమార్‌కు చెందిన బ్యాంక్ లాకర్లను కూడా అధికారులు తెరిచి పరిశీలించారు. కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు సైతం లభ్యం అయినట్లు తెలుస్తుంది.భవన నిర్మాణం కోసం ఎన్ఓసి జారీ చేసేందుకు నికేష్ కుమార్ ఓ వ్యక్తి నుంచి లంచం డబ్బులు తీసుకుంటుండగా ఈ ఏడాది మే 30 తేదీన ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. తాజాగా అతని అక్రమాస్తులపై నిఘా పెట్టిన ఎసిబి అధికారులు వరుస దాడులు చేశారు. కేసు ఇంకా దర్యాప్తులో ఉందని ఎసిబి అధికారులు తెలిపారు.

## ఎపిపై గెలిచి బంగారు పతకం దక్కించుకున్న టిజి..

ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీల్లో ఐజి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి జట్టుకు బంగారు పతకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ డిపార్ట్మెంట్ పారా మిలిటరీ ఫోర్సెస్ సిఐఎస్ఎఫ్ నిర్వహించిన ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీలో మల్టీ జోన్ II ఐజిపిఎస్.చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలోని జట్టు బంగారు పతకాన్ని గెలుచుకుంది. బెంగళూరులోని కెఎస్ఎల్‌టిఏ స్టేడియంలో ఈ నెల 26 నుండి 30 వరకు ఈ పోటీలు జరిగాయి. ఈ క్రమంలో ఫైనల్ మ్యాచ్‌లో ఐజిపిఎస్ .చంద్రశేఖర్ రెడ్డి, అడిషనల్ ఎస్‌పి (నారాయణపేట్) ఎండి రియాజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డిఎస్‌పిలు రామ్ కుమార్, సత్యనారాయణ జట్టుపై రియాజ్ (నారాయణపేట ఏఆర్) జట్టు 9 6 స్కోరుతో విజయం సాధించింది.

## ఐఎఎస్ అధికారికి కెటిఆర్ బేషరతుగా క్షమాపణ

భవిష్యత్‌లో అధికారులపై దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు : లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ, దాడులకు, దూషణలకు దిగడం ప్రజాస్వామ్యంలో మంచిపద్ధతికాదని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. సిరిసిల్లా కలెక్టర్‌పై బిఆర్‌ఎస్ ఎంఎల్ఎ కెటి.రామారావు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే చట్టం తమకు కల్పించిన హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అధికారులపైన దాడులు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. హైదరాబాద్‌లోని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో తెలంగాణరాష్ట్ర తహశీల్దార్స్అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధతో కలిసి లచ్చిరెడ్డి మాట్లాడుతూ పాలకులు మారినప్పటికీ అధికారులు మాత్రం ప్రజా సంక్షేమం, చట్టం పరిధిలోనే పనిచేస్తారని, అలాంటి అధికారులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడినా, దూషణలు చేసినా అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితువుపలికారు ఇటీవల లగచర్ల, నిర్మల్ ఆర్‌డిఓపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఎస్.రాములు మాట్లాడుతూ అధికారులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని హితువుపలికారు. రాజకీయాల్లోకి అధికారులను లాగొద్దన్నారు. రాధా మాట్లాడుతూ దాడులకు పాల్పడడం అనాగరీక చర్యగా అభివర్ణించారు. గతంలో ఇలా ఎప్పుడు దాడులకు దిగలేదని ఇది మంచి సాంప్రదాయం కాదని తెలిపారు.

## రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఎవరు ఎవరి గురించి ఏదైనా మాట్లాడవచ్చుననే స్థాయికి భావ ప్రకటన స్వేచ్ఛ చేరుకుందన్నారు. ప్రజలు తమ హక్కులనే గుర్తిస్తున్నారు కాని, బాధ్యతలను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి వారు ఏమిచ్చారోనని ఆలోచించకుండా దేశం తనకేం ఇచ్చిందని ఆశిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో రాజ్యాంగం పరిరక్షణకు, ప్రజల హక్కుల రక్షణ కోసం న్యాయవాదులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. మహాసభలలో తెలంగాణ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఏ. నరసింహారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎల్) ప్రతిష్టాత్మక సంస్థ అని, ఎంతోమంది పోరాటాల ఫలితంగా ఏర్పడిందని, ఈ మహాసభలలో న్యాయవాదుల సమస్యల పై చర్చించి తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి రాష్ట్ర బార్ కౌన్సిల్ కృషి చేస్తుందని అన్నారు . ఈ సందర్భంగా ఆలిండియా లాయర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ మహాసభలలో సౌహార్ద సందేశం ఇస్తూ న్యాయవాదుల సమస్యల పై రానున్న రోజుల్లో కలిసి ముందుకు సాగుతామన్నారు. మహాసభల్లో ఐఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ మురళీధర, రాష్ట్ర అధ్యక్షులు పోట్ల మాధవరావు, రిసెప్షన్ కమిటీ ఛైర్మన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, ఐఎల్ రాష్ట్ర నాయకులు ఎ.వి. క్రిష్ణారావు, కె.వి.ఎల్. ఉదయ్ భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి బీమనాథ్ శ్రీనివాస్, బొమ్మ గాని శ్రీనివాస్, హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. రమేష్ బాబు, జీవన్ గౌడ్, ఐఎల్ నాయకులు ఎం. ఆది రెడ్డి, జయ శ్రీనివాస్, ఓరుగంటి శేషగిరిరావు, మాధవరావు, లతీఫ్, రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభలలో ఇటీవల ఏఐబీఈ పరీక్షలలో ముందంజలో నిలిచిన ఐదుగురిని జస్టిస్ నగేష్ బీమపాక శాలువాతో సత్కరించి క్రిమినల్ లా పుస్తకాలను అందజేశారు. కాగా, ప్రారంభ సభ అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో ప్రధాన కార్యదర్శి నివేదికను బొమ్మగాని ప్రభాకర్ ప్రవేశపెట్టారు.



# నిరుద్యోగులకు ప్రతినెలా ఐదువేల ఉద్యోగాలు

## రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖామంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంవత్సర కాలంలో 50వేల ఉద్యోగాలను టిఎస్‌పిఎస్‌సి ద్వారా నియామకాలు చేపట్టడం జరిగిందని, ఇకనుండి ప్రతి నెల ఐదు వేల ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పించడంతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ పరిశ్రమల శాఖ,జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.

శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలతోపాటు కందుకూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (యుఎఫ్ఐడిసి) ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ కిచన్నగారి లక్ష్మారెడ్డిలతో జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శంకుస్థాపనలు చేశారు. ముందుగా జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఆర్‌సిఐ రోడ్డు ప్రక్కన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో రూ.1.43లక్షల వ్యయంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, బడంగ్‌పేట్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, తుక్కుగూడలో 1.43లక్షల వ్యయంతో మరొక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఒక కోటి 50 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కందుకూరు మండలంలోని నెదునగల్ జెడ్.పి రోడ్ నుండి మద్దెలకుంట తండా వరకు 8 కోట్లు వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని అందులో భాగంగా పట్టణ ప్రాంతాలలో సదుపాయాలు కల్పనలో భాగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్త రోడ్లకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు 18వేల కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని, సన్న బియ్యానికి ప్రోత్సాహకంగా 500 రూపాయలు అదనంగా చెల్లించడం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెల 5000 ఉద్యోగాలు నిరుద్యోగులను కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరకాలంలో 50వేల ఉద్యోగాలను టిఎస్‌పిఎస్‌సి ద్వారా నియామకాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తిచేయటం జరుగుతుంది అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మున్సిపల్ మేయర్ పారిజాతరెడ్డి, కార్పొరేటర్లు, ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ అనంత రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర రావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కృష్ణా, గోదావరి నీటి వాటా దక్కించుకోవాలి

## సమీక్షా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి
## నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని, ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. నీటి వినియోగం విషయంలో జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రయోజనాలకు వీసమెత్తు నష్టం వాటిల్లకుండా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని,అందుకు అవసరమైన సాక్ష్యాధారాలు, రికార్డులు, ఉత్తర్వులు సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను, న్యాయ నిపుణులను సిఎం అప్రమత్తం చేశారు.

నీటిపారుదల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సాగునీటి పరిస్థితి,కృష్ణా గోదావరి జలాలపై ఉన్న అంతరాష్ట్ర వివాదాలు, నీటి వాటాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నీటి ప్రాజెక్టులు, జలాల విషయంలోని పలు ముఖ్యమైన అం శాలను అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర పునర్వ్యవస్తీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల నీటి వాటాలు, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయించాల్సి ఉంది. ట్రిబ్యునల్ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభిప్రాయాలను, ఆధారాలను మాత్రమే సేకరించింది. త్వరలోనే ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాల్సి ఉంటుందని, ఆ తర్వాత ట్రిబ్యునల్ నిర్ణయం వెలువడుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

కృష్ణా పరివాహక ప్రాంతానికి సంబంధించి ఇప్పటివరకు ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులు, ఏయే ప్రాజెక్టులకు సంబంధించిన డిపిఆర్‌లను ఇప్పటికే ట్రిబ్యునల్‌కు సమర్పించారు. జలశక్తి మంత్రిత్వ శాఖకు ఇచ్చిన నివేదికలన్నింటినీ వరుస క్రమంలో సిద్ధంగా ఉంచుకోవాలని, వాటి ఆధారంగా ట్రిబ్యునల్ ఎదుట పకడ్బందీగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారుల ను ఆదేశించారు. అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం నదీ పరివాహక ప్రాంతాన్ని బట్టి అదే దామాషా ప్రకారం నీటి కేటాయింపులుండాలి. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70శాతం ఉండ గా.. ఎపిలో కేవలం 30 శాతం ఉంది. అదే వాదనల ప్రకారం 1005 టిఎంసిల్లో 70 శాతం నీటి వాటా తెలంగాణకు దక్కేలా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి, అధికారులను



ఆదేశించారు. పోలవరం ద్వారా 80 టిఎంసిల గోదావరి జలాలను ఎపి కృష్ణా డెల్టాకు వినియోగిస్తున్నందున, వాటికి బదులుగా నాగార్జునసాగర్ ఎగువన 45 టిఎంసిలు తెలంగాణకు నీటి కేటాయింపులు ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆ నీటి వాటాను ఎగువన ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకునే ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

**'బ్రిజేష్‌కుమార్' ట్రిబ్యునల్ వాటాలనే పూర్తి చేయలేదు**

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ ఇప్పటి వరకు పూర్తి చేయలేదని,కెఆర్ఎంబి, జిఆర్ఎంబిల నిర్ణయాలను ఎందుకు పట్టించుకోవాలని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ పూర్తయ్యేవరకు గోదావరి, కృష్ణా బోర్డుల జోక్యం ఉండకూడదని సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

**నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా లెక్కించాలి**

వివిధ ప్రాజెక్టుల ద్వారా కృష్ణా జలాల్లో కోటాకు మించి ఎక్కువ నీటిని ఎపి తరలిస్తోందని చర్చ జరిగిన నేపథ్యంలో నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా లెక్కించే టెలీ మెట్రీ విధానంతో అడ్డుకట్ట వేసేందుకు వీలుందని అధికారులు సీఎంకు వివరించారు. టెలీ మెట్రీ పరికరాలకు రూ.12 కోట్ల ఖర్చులో రెండు రాష్ట్రాలు చెరి సగం చెల్లించాల్సి ఉంటుందని అధికారులు సిఎంకు వివరించారు. ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ అవసరమైతే మొత్తం డబ్బులు ముందుగా భరించి, టెలీమెట్రీని అమలులోనికి తీసుకురావాలని, ఎపి ఇచ్చినప్పుడు రీయింబర్స్ చేసుకోవాలని ఆయన సూచించారు. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులన్నింటి ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటుందో లెక్కలు తీయాలని ఆదేశించారు. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, బంకంచెర్ల హెడ్ రెగ్యులేటరీ, తెలుగు గంగ, కెసి కెనాల్, హంద్రీ నివా, గాలేరు నగరి, వెలుగోడు ప్రాజెక్టుల నుంచి ఎంత నీటిని తరలిస్తున్నారనే వివరాలన్నీ రికార్డు చేయాలన్నారు. సీతారామ ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీకి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు అవసరమైన పనులన్నీ తొందరగా చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్ర నివేదిక రూపొందించండి**

ప్రాజెక్టులు, నీటి వాటాలకు సంబంధించి సమర్థంగా వాదనలు వినిపించేందుకు 2014 నుంచి ఇప్పటి వరకు ఉన్న జిఒలు, తీర్పులతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జిఒలు,మెమోలు, ప్రాజెక్టుల డిపిఆర్‌లను,అప్పటి నుంచి నీటి వాటాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. వీటి ఆధారంగా అన్ని వేదికలపైన తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేలా సమర్థమైన వాదనలు వినిపించాలని సిఎం సూచించారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కౌన్సిల్ వైద్యనాథన్, ఎజి సుదర్శన్ రెడ్డి, అడిషనల్ ఎజి రజనీకాంత్ రెడ్డి, ప్రభుత్వం తరఫు న్యాయవాది ఖుష్‌వోరా, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సిఎం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, సిఎం కార్యదర్శి మాణిక్రాజ్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, నీటిపారుదల కార్యదర్శి ప్రశాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు పోలింగ్ బూత్‌కువెళ్లి మార్పుకోసం ఓటేశాడు : రేవంత్‌రెడ్డి ట్వీట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** "ఏడాదిక్రితం సరిగ్గా ఇదే రోజు పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు పోలింగ్ బూత్‌కు వెళ్లి మార్పుకోసం ఓటేశాడు. ఆ ఓటు అభయ హస్తమై రైతు చరిత్రను తిరగరాసింది" అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది నవంబర్ 30వ తేదీన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సందర్భాన్ని గుర్తుచేస్తూ సిఎం రేవంత్‌రెడ్డి శనివారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ,రూ.7,625 కోట్ల రైతు భరోసా, ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500బోనస్, రూ.10,444 కోట్ల ఉచిత విద్యుత్, రూ.1433 కోట్ల రైతుబీమా, రూ.95కోట్ల పంట నష్టపరిహారం, రూ.10,547కోట్ల ధాన్యం కొనుగోళ్లు తదితర కార్యక్రమాలతో ఒక్క ఏడాదిలో రూ.54 వేల కోట్లతో రైతుల జీవితాల్లో పండగ తెచ్చామని, ఇది నెంబర్ కాదని, రైతులు మాపై పెట్టుకున్న నమ్మకమని రేవంత్‌రెడ్డి తన ట్విట్‌లో వివరించారు.

# బాలమల్లేష్ మృతి దిగ్భ్రాంతికరం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ రెడ్ గార్డుగా పనిచేసి, అంచెలంచెలుగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎదిగ బాలమల్లేష్ ఎదిగరన్నారు. పార్టీలో ఎఐఎస్ఎఫ్ నాయకుడుగా ఆ తర్వాత పార్టీలో వివిధ పదవుల నుండి జీవితం మొత్తాన్ని బాలమల్లేష్ పార్టీకే అంకితం చేశారని కొనియడారు. ఆయన మామ ఏ.ఆర్. దేవరాజ్ పార్టీలో రాష్ట్ర నాయకుడిగా పని చేశాడని గుర్తు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీకి కొంత సంక్షోభం వచ్చిన కాలంలో జిల్లా పార్టీని నిలబెట్టడానికి తక్కువ వయసులోనే బాలమల్లేష్ కృషి చేశాడన్నారు. పార్టీలో ఏ పని అప్పచెప్పినా వీర సైనికుడిగా పనిని స్వీకరించి, పూర్తి చేసేవాడన్నారు. ఇటీవలనే సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. హనుమకొండలో జరిగిన రాష్ట్ర నిర్మాణ సమితి సమావేశంలో సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారని కూనంనేని గుర్తు చేశారు. బికెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బిసి హక్కుల సాధన సమితికి ప్రధాన కార్యదర్శిగా బాలమల్లేష్ పని చేస్తున్నారని చెప్పారు. అన్ని వామపక్ష పార్టీలను, మేధావులను, సామాజిక కార్యకర్తలను సమన్వయం చేసే విషయంలో అలుపెరగకుండా అందరి తలలో నాలుకలాగా ఉండేవాడన్నారు. మేడ్చల్ జిల్లా, వికారాబాద్ జిల్లాలకు పార్టీ నుండి నిర్మాణ బాధ్యుడిగా కూడా ఉన్నారన్నారు. ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శి పోటు ప్రసాద్ అంతిమయాత్రలో ఆరోగ్యం బాగోలేదు అంటూనే పాల్గొన్నాడని గుర్తు చేశారు. బాలమల్లేష్ మృతికి సిపిఐ రాష్ట్ర సమితికి తీరని లోటన్నారు. బాలమల్లేష్ మృతికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**స్నేహశీలి బాలమల్లేష్: సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, జి.ఓబులేసు**

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని సిపిఐ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి కె. రామకృష్ణ, ఎఐటియుసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు అన్నారు. బాలమల్లేష్ విద్యార్థి దశ నుండి సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో రెడ్ గార్డుగా, విద్యార్థి, యువజన సమాఖ్యల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, అంచెలంచెలుగా రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శిగా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా ఎదిగారన్నారు. బాలమల్లేష్ స్నేహశీలి, సౌమ్యుడన్నారు. పార్టీ నాయకులతో, కార్యకర్తలతో ఎంతో వినమ్రతతో ఉండేవాడని వారు గుర్తు చేసుకున్నారు. బాలమల్లేష్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర పార్టీకి సానుభూతిని తెలిపారు. అలాగే ప్రముఖ నీటిపాదరుల రంగ నిపుణులు టి.లక్ష్మి నారాయణ, ఎపి రైతు సంఘం గౌరవాధ్యక్షులు సి.రామచంద్ర కూడా బాలమల్లేష్ మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశా రు.

**తీవ్రంగా కలచి వేసింది..చాడ వెంకట రెడ్డిః** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు ఎన్. బాలమల్లేష్ మృతి పట్ల సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన మృతి తీవ్రంగా కలచి వేసిందన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ రాష్ట్ర నాయకుడిగా ఎదిగారన్నారు. విద్యార్థి, యువజన నాయకుడిగా రాష్ట్రస్థాయిలో అనేక పోరాటాలు ఉద్యమాలు చేశారన్నారు. వ్యవసాయ కూలీ ల హక్కుల కోసం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉద్యమాలు నిర్వహిస్తున్న బాల మల్లేష్ ఇంత చిన్న వయసులో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని చాడ వెంకటరెడ్డి తెలిపారు.



**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి :** ఎన్. బాలమల్లేష్ మృతి పట్ల ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పుట్ట మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మ ణ్‌లు సంతాపం తెలిపారు. చిన్నతనం నుండి విద్యార్థి ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసిన బాలమల్లేష్ మరణం పార్టీకి, ప్రజాసంఘాలకు తీరని లోటన్నారు.

**ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి :** ఎన్. బాలమల్లేష్ మృతి పట్ల ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలి ఉల్లాఖాద్రీ, కె.ధర్మేంద్ర ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**తెలంగాణ గిరిజన సమాఖ్య సంతాపం :** ఎన్. బాలమల్లేష్ మృతి పట్ల తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ సంతాపం వ్యక్తం చేశారు. తామిద్దరం కలిసే పోటు ప్రసాద్ అంతిమ యాత్రలో పాల్గొనేందుకు ఖమ్మంకు వెళ్లామని రాత్రి తిరిగి హైదరాబాద్ చేరు కున్నా మని, మరుసటి రోజే ఈ విషాదకర వార్త వినడం దిగ్భ్రాంతికి గురిచేసిందని అంజయ్య నాయక్ అన్నారు.ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘంః** ఎన్.బాలమల్లేష్ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం కలిసి సయుక్త కిసాన్ మోర్చాలో ఇటీవలికాలంలో పనిచేస్తున్నామని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సహాయక కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో అకాల మరణం అత్యంత విషాదకరమన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపా రు.

**ప్రియ మిత్రుడు బాల మల్లేష్ : జల్లి విల్సన్**

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి తన ప్రియ మిత్రుడు బాల మల్లేష్ ఆకస్మికంగా మరణ వార్త విని తాను దిగ్భ్రాంతి చెందినట్లు సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడుగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో పేద ప్రజల ఉద్యమాలకి ఆయన అండగా నిలిచారని పేర్కొన్నారు. 2003లో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు అన్ని విధాల పూర్తి తోడ్పాటు అందించారని గుర్తు చేసుకున్నారు.

రెండువేలు దశకంలో రంగారెడ్డి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన భూపోరాటంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టడమే కాకుండా ఇళ్ల స్థలాలు ఇప్పించటంలో చురుకైన పోరాట నాయకుడుగా ఉన్నాడని కొనియాడారు.

**గోదా శ్రీరాములు, పల్లా నరసింహారెడ్డి సంతాపం :** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ ఆకస్మిక మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ప్రగాఢ సంతాపం తెలిపారు. చిన్ననాటి నుండి పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసి, కింది స్థాయి నుండి పైస్థాయికి ఎదిగారన్నారు.

### వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు : డాక్టర్ కె. నారాయణ

బాలమల్లేష్ మరణం అత్యంత బాధారమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలమల్లేష్ మృతి వామపక్ష ఉద్యమాలకు, సిపిఐకి తీరని లోటన్నారు. అమెరికాలో ఉన్న నారాయణ తన సంతాప సందేశాన్ని పంపించారు. బాలమల్లేష్ సిపిఐ తెలంగాణ సహాయ కార్యదర్శిగా, జాతీయ సమితి సభ్యులుగా పనిచేస్తున్నారన్నారు. విద్యార్థి దశ నుంచే అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష, ఎఐఎస్ఎఫ్, కమ్యూనిస్టు పార్టీలో నిబద్ధతతో పనిచేస్తున్న వ్యక్తి అని అన్నారు. కమ్యూనిస్టు, ప్రజా సంఘాలు, వ్యవసాయ కార్మికసంఘం కోసం అలుపెరగని కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ అంతగా అనారోగ్యంతో బాధపడలేదన్నారు. ఉత్సాహంగా ఉన్న బాలమల్లేష్ చనిపోవడం అత్యంత విషాదకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, భార్య, పిల్లలు తనకు అత్యంత సన్నిహితులని తెలిపారు. బాలమల్లేష్ తనకు ఆప్తుడన్నారు. ఆయన మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. నిన్నగాక మొన్న ఖమ్మం జిల్లా సిపిఐ కార్యదర్శిగా చురుకైన పాత్ర వహించిన పోటు ప్రసాద్‌ను పోగొట్టుకున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ దుఃఖసాగరంలో ఉండగానే, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్‌ను పోగొట్టుకోవటంతో సిపిఐ దుఖసాగరంలో మునిగిపోయిందన్నారు. బాలమల్లేష్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని నారాయణ తెలిపారు.

# కళ్యాణి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా

## మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్‌లోని ఈజ్గాంలో పులి దాడి ఘటనలో మరణించిన గన్నారంమండల వాసి కళ్యాణి కుటుంబానికి ప్రభుత్వం తరపున మంత్రి కొండా సురేఖ రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. పత్తి సేకరణకు వెళ్లిన కళ్యాణి పులి దాడిలో మరణించడం తనను ఎంతో వేదనకు గురి చేసిందని పేర్కొన్నారు. శాఖాపరంగా అటవీ శాఖ అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ ఈ దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. నష్టపరిహారంతో పాటు వారి కుటుంబ అవసరాల మేరకు తగిన విధంగా సహాయ, సహకారాలను అందిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. శనివారం సిర్పూర్ (టి) మండలంలోని దుబ్బగూడెంలో సురేష్ అనే రైతుపై మరో దాడి ఘటన జరగడంతో మంత్రి సురేఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ జిల్లా డీఎఫ్ఓ నీరజ్ రైతు పరిస్థితిపై ఆరా తీశారు. ప్రాథమిక చికిత్స అనంతరం రైతు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, మెరుగైన చికిత్సకోసం మంచిర్యాల జిల్లా హాస్పిటల్‌కు సురేష్‌ను తరలిస్తున్నట్టు డిఎఫ్ఒ మంత్రికి వివరించారు. ప్రస్తుతం పులి కదలికలపై సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మహారాష్ట్ర వైపు పులి కదలికలను గుర్తించినట్టుగా డిస్టిక్ ఫారేస్ట్ ఆఫీసర్ (డిఎఫ్ఓ)మంత్రికి తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల పశువులపై కూడా పులి దాడి ఘటనలు నమోదైన నేపథ్యం లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పిసిసిఎఫ్‌ను ఆదేశించారు. వ్యవసాయ పనులకు వెళ్లేవా రు, పశువులను మేతకు తీసుకొని పోయేవారు జాగ్రత్తగా ఉండాలనీ, అటవీ శాఖ సూచనలను పాటించాలని మంత్రి సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పులి సంచారానికి సంబంధించిన జాడలు కనిపించడం, పులిని చూసినట్లుగా ఎవరైనా సమాచారం అందించిన పక్షంలో సమీప ప్రాంతాల ప్రజలను వెంటనే అప్రమత్తం చేయాలని అటవీ అధికారులకు సూచించారు.



ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా కట్టుదిట్టమైన కార్యాచరణ ను అమలు చేయా లని అటవీ అధికారులను నిర్దేశించారు. రాకపోకల సందర్భంగా పులి నుంచి ప్రమాదం పొంచి ఉందని భావించిన పరిస్థితుల్లో పులిదాడి నుంచి బయటపడడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సురేఖ అటవీ అధికారులకు స్పష్టం చేశారు.

# ఫార్మా విలేజి రద్దు స్వాగతిస్తున్నాం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లగచర్లలో ఫార్మా విలేజి ప్రతిపాదనను రద్దు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్వాగతించారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవటం హర్షనీయమని శనివారం విడుదల చేసిన ఒక పేర్కొన్నారు. ఫార్మా విలేజికి బదులుగా మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఇందు లో భాగంగా రైతుల నుంచి పంట భూముల తక్కువ సేకరించటడంతో పాటు, సహాయ, పునరావాస ప్యాకేజీలో భూమికి భూమి ఇవ్వాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించి సామాజిక సర్వే చేయాలని, ఉపాధి కల్పించాలని, సరైన పరిహారమివ్వాలని కోరారు. తాము పారిశ్రామికాభివృద్ధి జరగాలని కోరుకుంటున్నామని, స్థానికులకు ఉపాధి, ఆ ప్రాంతంలో ఆర్థికాభివృద్ధి జరగాలని అభిలషిస్తున్నామని కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఇందుకు రైతుల నుంచి బలవంతంగా, బెదిరించి భూములు స్వీకరించవద్దన్నారు. ప్రభుత్వ, బంజరు భూములు తీసుకున్న తరువాత తప్పనిసరైతే రైతుల నుంచి భూమిని సేకరించాలని సూచించారు. వాటికి సరైన పరిహారం, పునరావాస ప్యాకేజీ కల్పించాలని కూనంనేని ప్రభుత్వాన్ని కోరారు.

**నారాయణ హర్షం :** మంచినిర్ణయం , ఫార్మా సిటీ ప్రతిపాదన విరమించుకోవడం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ హర్షం వ్యక్తం చేశారు. కాలుష్యరహిత పరిశ్రమల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను స్వాగతించారు. రైతుల భూమి స్వాధీనం చేసుకోవడంలోప్రభుత్వం రైతులను సంతృప్తి పరచాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వ ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జిఒ 317కు సంబంధించిన ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులకు అనుగుణంగా మెడికల్, స్పౌస్, మ్యూచువల్ మూడు కేటగిరీలకు సంబంధించిన బదిలీలకు ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం జిఒ ఎం.ఎస్ 243,244,245 మూడు వేర్వేరు ఉత్తర్వులను విడుదల చేశారు. ఖాళీలకు లోబడి స్థానిక కేడర్‌లో మార్పులు, బదిలీలకు ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. ఈ ప్రక్రియలో ప్రస్తుతం ఆయా స్థానాల్లో ఉన్న ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. మ్యూచువల్ బదిలీలలో ఉదాహరణకు స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) మరో ప్రాంతానికి చెందిన పాఠశాలో బదిలీ కావాలంటే, ఆ పాఠశాలలో కూడా మ్యాథ్స్ బోధించే స్కూల్ అసిస్టెంట్ అంగీకరించాల్సి ఉంటుంది.ఒకే సబ్జెక్ట్‌కు సంబంధించిన వారికి మాత్రమే బదిలీలకు అవకాశాలు ఇస్తారు. మెడికల్ గ్రౌండ్‌లో క్యాన్సర్, న్యూరోసర్జరీ, కిడ్నీ,లీవర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒపెన్ హార్ట్ సర్జరీ తదితరవాటిని మార్గదర్శకాల్లో పొందుపరిచారు. కాగా 317 జిఒకు సంబంధించిన సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఆయా శాఖ హెచ్ఒడిలు, ఉన్నతాధికారులతో సమావేశమైంది. బాధిత ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, వారి నుంచి విజ్ఞప్తులను స్వీకరించింది. పలు సిఫారసులతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

# తహసీల్దార్ల సమస్యలు పరిష్కరించాలి

## ప్రభుత్వానికి టిజిటిఎ సమావేశం విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టిజిటిఎ)రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రాములు, కార్యదర్శి రమేశ్ పాక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిజిటిఎ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లోని సిసిఎల్ ఏ కార్యాలయ ప్రాంగణంలోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బదిలీలు చేసిన తహసీల్దార్లను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. రెవె న్యూ అధికారులపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. చార్మినార్ జోన్లలో ఆగిన పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని, ఎస్‌జిడిసి నుంచి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులు, సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతి కల్పించడం పట్ల సిఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్‌ఎ నవీన్ మిట్టల్‌కు సమావేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. ఈ సమావేశంలో అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఫూల్సింగ్ చౌహాన్, కోశాధికారి శ్రీనివాస్ శంకరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధతో పాటు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.





**టిజిటిఎ హర్షం :** ఏకకాలంలో 100 మంది సీనియర్ అసిస్టెంట్లకు నయాబ్ తహశీల్దార్లుగా పదోన్నతి లభించడం పట్ల టిజిటిఎ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ హర్షం వ్యక్తం చేశారు. వ్యవస్థను బలోపేతం చేయడానికి టిజిటిఎ కృషి చేస్తున్నదని, ఇందులో భాగంగానే ఈ పదోన్నతులు లభించాయని తెలిపారు.

# 'టి-కన్సల్ట్'సదస్సులో 117 ఒప్పందాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆవిష్కర్తలతో పెట్టుబడుదారులను కలిపే సహకార సదస్సు 2024 లో 117 ఒప్పందాలు కుదరడం అభినందనీయమని ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశంచారు. టి కన్సల్ట్ అనే సంస్థ గచ్చిబౌలిలోని టి హబ్‌లో ఏర్పాటు చేసిన రెండురోజుల సదస్సును శనివారం ప్రారంభించారు. ఆవిష్కర్తలతో పెట్టుబడిదారులతో కలిపే ఈ కార్యక్రమం అభివృద్ధికి నూతన మార్గాలను అన్వేషిండంలో సహాయపడుతుందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు అన్నారు. కొత్త ఒప్పందాల వల్ల రాష్ట్రం ఆవిష్కరణల్లో, పారిశ్రామిక ప్రగతిలో ముందు వెళ్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. సదస్సులో అన్ ట్యాప్డ్ ఇన్ వెస్టర్ ప్రోగ్రాం, టి కన్సల్ట్ హెల్త్, డాక్టర్స్ పూల్, టేల్ కనెక్ట్, ఎంఎస్ఎంఇ పాలసీపై చర్చల వల్ల నూతన ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులతో సంప్రదింపులు జరిపే అవకాశం ఏర్పడిందని చెప్పారు. ఐటి రంగంలో పనిచేస్తున్న ప్రతిభావంతులకు 63దేశాల్లోని సంస్థలతో అనుసంధానం చేయ దం గొప్ప కార్యక్రమమని ప్రశంసించారు. ఉద్యోగులను కంపెనీలతో కలపడం, ఇతర దేశాల్లో అదే రంగంలో ఉన్న ఉద్యోగులతో కనెక్ట్ చేయడం ఈ సదస్సు వల్ల సాధ్యమైందని శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించడం టి కనెక్ట్ సదస్సు ఎంతో ఉపయోగ పడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బిఐసిసిఐ) వ్యవస్థాపక అవార్డుల ప్రదానం జరిగింది. ఈ సదస్సులో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, బండ ప్రకాశ్, మధ్యప్రదేశ్ పబ్లిక్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.నరహరి, పరిశ్రమలశాఖ జాయింట్ డైరెక్టర్ సురేశ్ సం గా తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# క్రీడ

## గవాస్కర్ బార్డర్ ట్రోఫీ టెస్ట్ సిరీస్

| | సంవత్సరం | ఆతిథ్య దేశం | గెలిచిన జట్టు |
|---|---|---|---|
| 1 | 1996–97 | భారత్ | భారత్ |
| 2 | 1997–98 | భారత్ | భారత్ |
| 3 | 1999–00 | ఆస్ట్రేలియా | ఆస్ట్రేలియా |
| 4 | 2000–01 | భారత్ | భారత్ |
| 5 | 2003–04 | ఆస్ట్రేలియా | డ్రా |
| 6 | 2004–05 | భారత్ | ఆస్ట్రేలియా |
| 7 | 2007–08 | ఆస్ట్రేలియా | ఆస్ట్రేలియా |
| 8 | 2008–09 | భారత్ | భారత్ |
| 9 | 2010–11 | భారత్ | భారత్ |
| 10 | 2011–12 | ఆస్ట్రేలియా | ఆస్ట్రేలియా |
| 11 | 2012–13 | భారత్ | భారత్ |
| 12 | 2014–15 | ఆస్ట్రేలియా | ఆస్ట్రేలియా |
| 13 | 2016–17 | భారత్ | భారత్ |
| 14 | 2018–19 | ఆస్ట్రేలియా | భారత్ |
| 15 | 2020–21 | ఆస్ట్రేలియా | భారత్ |
| 16 | 2022–23 | భారత్ | భారత్ |
| 17 | 2024–25 | ఆస్ట్రేలియా | సిరీస్ పూర్తి కాలేదు |

# టీమిండియాలో 'ఫుల్ జోష్'



ఆస్ట్రేలియా గడ్డపై ఆస్ట్రేలియా జట్టుతో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా పెర్త్‌లో జరిగిన మొదటి మ్యాచ్ ని 295 పరుగుల తేడాతో గెల్చుకొని 1–0 ఆధిక్యాన్ని సంపాదించిన టీమిండియా, డిసెంబర్ 6 నుంచి 10 మధ్య జరిగే రెండో టెస్టుకు రెట్టించిన ఉత్సాహంతో సిద్ధంగా ఉంది. ఆస్ట్రేలియాలో అతిపెద్ద టెస్టు సిరీస్ విజయాల్లో పెర్త్ గెలుపు రెండోది. అంతకు ముందు, 1978లో సిడ్నీ వేదికగా జరిగిన టెస్టులో భారత్ ఇన్నింగ్స్ రెండు పరుగుల తేడాతో గెలుపొందింది. 1977లో మెల్బోర్న్ మైదానంలో 222 పరుగుల ఆధిక్యంతో విజయాన్ని నమోదు చేసింది. అదే వేదికపై 2010లో 137 పరుగుల తేడాతో టెస్టును కైవసం చేసుకుంది. ప్రస్తుత సిరీస్‌లో భారీ విజయాన్ని అందుకున్న భారత్, రెండో టెస్టును అడెలైడ్‌లో ఆడుతుంది. ఈ సిరీస్ ప్రారంభంలోనే అద్భుత విజయాన్ని ఖాతాలో వేసుకున్న టీమిండియా, సిరీస్‌పై కన్నేసింది. బలమైన ప్రత్యర్థి ఆస్ట్రేలియాను, ఆస్ట్రేలియాలోనే ఓడించడాన్ని మించిన ఆనం దం ఏ జట్టుకూ ఉండదనేది నిజం. ప్రత్యర్థులు మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే 'స్లెడ్జింగ్'కు మారుపేరమైన ఆస్ట్రేలియా జట్టును వారి స్వదేశంలోనే ఓడించడం అనుకున్నంత సులభం కాదు. అయితే, మొదటి టెస్టుతో భారత ఆటగాళ్ల ఫామ్ నిరూపితమైంది. ఇదే జోష్‌ను కొనసాగిస్తే, సిరీస్‌ను దక్కించుకోవడం సులభమవుతుంది. కాగా, మూడో టెస్టు బ్రిస్బేన్‌లో డిసెంబర్ 14 నుంచి 18 వరకూ ఉంటుంది. నాలుగో టెస్టు మెల్బోర్న్ వేదికగా డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకూ జరుగుతుంది. ఆస్ట్రేలియా జట్టు డిసెంబర్ 26న (బాక్సింగ్ డే) మొదలయ్యే టెస్టు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుంది. ప్రత్యర్థి జట్టు ఏదైనప్పటికీ, ఈ టెస్టులో గెలవడమే లక్ష్యంగా ఎంచుకుంటుంది. ఈసారి భారత్‌ను ఎంత వరకూ నిలువరిస్తుందో చూడాలి. కాగా, చివరిదైన ఐదో టెస్టు జనవరి 3 నుంచి 7వ తేదీ వరకూ సిడ్నీలో జరుగుతుంది. స్థూలంగా చూస్తే భారత్, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటి వరకూ 108 టెస్టుల్లో తలపడ్డాయి. భారత్ 33, ఆస్ట్రేలియా 45 విజయాలు సాధించాయి. 29 టెస్టులు డ్రాగా ముగిశాయి. స్వదేశంలో భారత్ 23 పర్యాయాలు, ఆస్ట్రేలియా 14 పర్యాయాలు గెలుపొందాయి. ఒక టెస్టు 'టై'గా ముగిసింది.

### భారత, ఆస్ట్రేలియా మధ్య ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక స్కోర్లు..'టాప్ 10'

705/ 7 డిక్లేర్డ్ (సిడ్నీలో భారత్, 2004 జనవరి 2)
674 (అడెలైడ్‌లో ఆస్ట్రేలియా, 23 జనవరి 1948)
659/ 4 డిక్లేర్డ్ (సిడ్నీలో ఆస్ట్రేలియా, 3 జనవరి 2012)
657/ 7 డిక్లేర్డ్ (కోల్‌కతాలో భారత్, 11 మార్చి 2001)
633/ 5 డిక్లేర్డ్ (కోల్‌కతాలో భారత్, 18 మార్చి, 1998)
622/ 7 డిక్లేర్డ్ (సిడ్నీలో భారత్, 1 జనవరి, 2019)
613/ 7 డిక్లేర్డ్ (పెర్త్‌లో భారత్, 29 అక్టోబర్, 2008)
604/ 7 డిక్లేర్డ్ (అడెలైడ్‌లో ఆస్ట్రేలియా, 24 జనవరి, 2012)
603/ 9 డిక్లేర్డ్ (రాంచీలో భారత్, 16 మార్చి, 2017)
600/ 4 డిక్లేర్డ్ (సిడ్నీలో భారత్, 2 జనవరి, 198

### భారత, ఆస్ట్రేలియా మధ్య ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యల్ప స్కోర్లు (100 కంటే తక్కువ)

36 (అడెలైడ్‌లో భారత్, 17 డిసెంబర్ 2020)
58 (బ్రిస్బేన్‌లో భారత్, 28 నవంబర్, 1947)
67 (మెల్బోర్న్‌లో భారత్, 6 ఫిబ్రవరి, 1948)
83 (మెల్బోర్న్‌లో స్ట్రేలియా, 7 ఫిబ్రవరి 1981)
91 (నాగపూర్‌లో స్ట్రేలియా, 9 ఫిబ్రవరి, 2023)
93 (ముంబయిలో స్ట్రేలియా, 1 నవంబర్, 2004)
98 (బ్రిస్బేన్‌లో భారత్, 28 నవంబర్, 1947).

### అత్యధిక పరుగులు.. 'టాప్ 10'

సచిన్ తెండూల్కర్ (భారత్) 39 మ్యాచ్‌ల్లో 3,630
రికీ పాంటింగ్ (ఆస్ట్రేలియా) 29 మ్యాచ్‌ల్లో 2,555
వివిఎస్ లక్ష్మణ్ (భారత్) 29 మ్యాచ్‌ల్లో 2,434
విరాట్ కోహ్లీ (భారత్) 26 మ్యాచ్‌ల్లో 2,143
రాహుల్ ద్రవిడ్ (భారత్) 32 మ్యాచ్‌ల్లో 2,143
చటేశ్వర్ పుజారా (భారత్) 25 మ్యాచ్‌ల్లో 2,074
స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా) 39 మ్యాచ్‌ల్లో 2,074
మైఖేల్ క్లార్క్ (ఆస్ట్రేలియా) 22 మ్యాచ్‌ల్లో 2,049
మాథ్యూ హేడెన్ (ఆస్ట్రేలియా) 18 మ్యాచ్‌ల్లో 1,888
వీరేంద్ర సెవాగ్ (భారత్) 22 మ్యాచ్‌ల్లో 1,738.



### సెంచరీ వీరులు

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య టెస్టు ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన ఘనత భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ తెండూల్కర్‌కు దక్కుతుంది. అతను ఆసీస్‌పై 11 సెంచరీలు చేశాడు. స్టీవ్ స్మిత్, విరాట్ కోహ్లీ చెరి 9 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నారు. అయితే, ప్రస్తుత సిరీస్‌లో కోహ్లీ సభ్యుడు కాబట్టి, మిగతా 4 టెస్టులు లేదా 8 ఇన్నింగ్స్‌లో అతను సచిన్ రికార్డును సమం చేసే లేదా అధిగమించే అవకాశాలు ఉన్నాయి. కాగా, సునీల్ గవాస్కర్, రికీ పాంటింగ్ చెరి 8 సెంచరీలతో ఈ జాబితాలో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.



### వికెట్ల శతకాలు..

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య టెస్టు ఫార్మాట్‌లో ముగ్గురు బౌలర్లు వందకుపైగా వికెట్లు సాధించారు. వారిలో నాథన్ లియాన్ (ఆస్ట్రేలియా) 123 పరుగులతో నెంబర్ వన్ స్థానంలో నిలిచాడు. రవిచంద్రన్ అశ్విన్ (భారత్) 114, మరో భారత బౌలర్ అనీల్ కుంబ్లే 111 చొప్పున వికెట్లు కూల్చారు.

## బాస్కెట్‌బాల్ ఆయన ప్రాణం



బాస్కెట్‌బాల్ సృష్టికర్త డాక్టర్ జేమ్స్ నైస్మిత్, 1928లో తన భార్య మాడీ ఇ. షెర్మన్‌తో కలిసి ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం. తన కలల పంటగా ఆవిర్భవించిన బాస్కెట్‌బాల్ అంటే ఆయనకు తగని మక్కువ. అమెరికాలోని మసచూసెట్స్ రాష్ట్రం స్ప్రింగ్‌ఫీల్డ్‌లోని ఇంటర్నేషనల్ వైఎంసిఎ ట్రైనింగ్ స్కూల్‌లో ఆయన తొలుత ఈ క్రీడను ప్రవేశపెట్టాడు. శీతాకాలంలో విద్యార్థులను చురుగ్గా ఉంచడం కోసం 1891లో ఆయన బాస్కెట్‌బాల్‌ను పరిచయం చేశాడు. తొలి రోజుల్లో ఒక వెదురుబుట్ట, సాకర్ బాల్‌తో, సాధారణ ఇండోర్ గేమ్‌గా ఈ ఆట మొదలైంది. క్రమంగా ఆదరణ పొంది, నేడు ప్రపంచ క్రీడగా ఎదిగింది. 1928 నాటికి ఈ క్రీడ అమెరికా వ్యాప్తంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో ఆడడం మొదలైంది. అప్పటికే ప్రజాదరణ పొందడంతో, ఈ క్రీడకు కోచ్‌గా వ్యవహరించే బాధ్యత నుంచి వైదొలిగాడు. అయితే, బాస్కెట్‌బాల్‌తో తనకు ఉన్న మక్కువను వదులుకోలేకపోయాడు. అందుకే, అవకాశం దొరికినప్పుడు బాస్కెట్‌బాల్ ఆడేవాడు. 1861 నవంబర్ 6న జన్మించిన నైస్మిత్ 1939 నవంబర్ 28న తదిశ్వాస విడిచాడు. చివరి క్షణం వరకూ అతను బాస్కెట్‌బాల్ అభివృద్ధిని ఆకాంక్షించాడు. శారీరక విద్యకు కొత్త రూపాన్ని ఇవ్వడానికి, బాస్కెట్‌బాల్‌ను అభివృద్ధి చేయడానికి ఆయన తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి, న్యాయవాదిగా కొనసాగాడ. ఆ వృత్తిలో ఎక్కువ సమయం లభిస్తుంది కాబట్టి, బాస్కెట్‌బాల్ అభివృద్ధికి కృషి చేయవచ్చన్నది అతని ఆలోచన. తాను సృష్టించిన క్రీడ అంచలంచెలుగా ఎదిగి, అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ పొందడాన్ని స్వయంగా చూడగలిగిన నైస్మిత్ ధన్యుడు.

## ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?



### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ల శరత్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** విద్యాశాఖను ముఖ్యమంత్రి దగ్గర పెట్టుకొని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం సరికాదని, విద్యార్థుల ప్రాణాలు పోతున్న పట్టించుకోరా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదళ్ల శరత్ అన్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్‌లో భాగంగా శనివారం కరీమాబాద్ బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లేకుండా సంవత్సరం పాలనా కొనసాగించారని, విద్యావ్యవస్థపై సమీక్షా ఏదని, గురుకుల, సంక్షేమ హాస్టల్స్, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ ఫాయిజన్ తో అస్వస్థకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి విద్యా ర్థుల కు మెరుగైన వైద్యం అందించాలని, అలాగే నాణ్యమైన బోధన భోజనాన్ని అందించాలని అన్నారు. ప్రభుత్వం స్పందిం చకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్సాంపల్లి సాగర్, నాయకులు శివ, అభిరామ్, శ్రీధర్ తదితరులుపాల్గొన్నారు

## వంద సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర సిపిఐది



### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య

**ప్రజాపక్షం/మణుగూరు :** వంద సంవతరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని పార్టీ శతజయంతి ఉత్స వాలు ఘనంగా వాడవాడలా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి మణుగూరు మున్సిపాలిటీలో కాళీమాత ఏరియాలో జక్కుల రాజ బాబు అధ్యక్షతన జరిగిన సమా వేశంలో ముఖ్యఅతిథిగా బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ పార్టీ పుట్టి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామాల్లో సిపిఐ పార్టీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, దీనికోసం పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని, ఇప్పటికే నాలుగు గ్యారెంటీ అమలు చేశారని, మిగిలిన సంక్షేమ పథకాలు కూడా అమలు చేస్తారన్నారు. తెల్ల రేషన్ కార్డు లేని వారు అనేకమంది ఉన్నారని వారందరికీ కూడా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని, అసలైన నిరుపేదలకు, ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వాలన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల సంక్షేమం కోసం సిపిఐ పార్టీ ఎల్లప్పుడు వారికి అండగా పనిచేస్తుందని అందుకోసం పార్టీని ఆదరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, జక్కుల రాజబాబు, కార్యవర్గ సభ్యులు ఆదర్ల రాములు, పెద్ద ఎత్తున, ప్రజలు హాజరై నారు. అనంతరం కాళీమాత ఏరియా నూతన కమిటీలు ఎన్నుకున్నారు.

## సమస్యలు పరిష్కరించే దిశగా చర్చలు

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఎఐటియుసి గుర్తింపు సంఘం గెలవడంతో అనేక పెండింగ్ కార్మిక సమస్యలకు స్ట్రక్చర్ మీటింగ్‌లో చర్చించినట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొము రయ్య భవన్లో భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ పాల్గొని మాట్లా డుతూ, సింగరేణి వ్యాప్తంగా నవంబర్ 28న జరిగిన స్ట్రక్చర్ మీటింగ్లో పది రకాల డిమాండ్లపై యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. కార్మికులకు రావలసిన అలవెన్స్‌లు, ఈపి ఆపరేటర్ సమస్యలు, డిస్మిస్ కార్మి కులు, మారు పేర్లు వన్ టైం సెటిల్మెంట్ కోసం అట్లాగే మెరిట్ స్కాలర్షిప్ గురించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సింగరేణిలో ఇంతకుముందు గతంలో ప్రోత్సాహక బహుమతులు ఉండేవని వాటిని ఇంకొంచెం మెరుగైన పద్ధతిలో కొనసాగించాలని, దాంతో ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని, అన్ని మైన్స్ లో ఉన్న క్యాంటీన్ల ప్రైవేటు కాంట్రాక్టర్లు కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతూ నాణ్యతలేని ఆహార పదార్థాలను అందజేస్తున్నారని వాటిని యాజమాన్యమే కార్మికులతో నడపడపాలని కోరినట్లు తెలిపారు. అందులో భాగంగా భూపాలపల్లి ఏరియాలో కేటీకే ఓసి2 పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెడతారని ఆ తర్వాత సింగరేణి వ్యాప్తంగా అమలు చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, బ్రాం చ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, గంగసరపు శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచ్ కమిటీ నాయకులు నూకల చంద్రమౌళి, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, హైమద్, సత్యనారాయణ, సదానందం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

### శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవి పల్లి:** లక్ష్మీ దేవిపల్లి మం డలంలోని రేగళ్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా నిర్వహి స్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాం బశివరావు ప్రారంభిం చా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులకు ప్రభుత్వం సన్న రకం ధాన్యంకు బోనస్ ఇస్తుందని, రైతు పండుగ సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులు రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు నిర్వహించాలని, రైతులకు సన్నరకం ధాన్యానికి బోనస్ ఇస్తుందని, అందుకు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, ఏవో రాకేష్, సొసైటీ డైరెక్టర్ చం ద్రగిరి శ్రీనివాసరావు, కంటెం సత్యనారాయణ, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, ఏఈవో లత, మానిటరింగ్ ఆఫీసర్ జయశ్రీ, మాజీ ఎంపిపి భూక్యా సోనా, బాదావత్ రాంకోటి, తూము చౌదరి, సంఘ సెక్రటరీ పండ్ల సారయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హమాలీల శ్రమను దోచుకుంటున్న 'ఆర్‌టిసి'

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా టిఎస్ ఆర్‌టిసి కార్గోలో హామాలీ కూలీలుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ ఎఐటియుసిజిల్లా కార్యాలయంలో వడ్లూరి పోచయ్య అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని 92 టిఎస్ ఆర్టీసీ బస్సు డిపోలలో కార్గో సర్వీస్ పాయింట్ వద్ద హమాలీ కూలీలుగా రాష్ట్రవ్యాప్తంగా 3 వేలపైన కార్మికులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవడం జరుగుతోందన్నారు. వీరు గత 20 సంవత్సరాల నుంచి ఆర్టీసీని నమ్ముకుని కూలీలుగా ఇస్తున్న కూలీ రేట్లను తగ్గించి తక్కువ కూలీ ఇస్తూ ఆర్టీసీ యాజమాన్యం శ్రమ దోపిడీ చేస్తు ఒదని విమర్శించారు. వారికి గతంలో రెండు కిలోల నుంచి ఐదు కిలోల లోపు ఉన్నదానికి పది రూపాయలు ఇస్తే ప్రస్తుతం మూడు రూపాయలు తగ్గించి ఏడు రూపాయలు ఇవ్వడం జరుగుతోందన్నారు.ప్రజలు తెచ్చే వస్తువుల తూకంలో అనేక మోసాలు జరుగుతున్నాయని,గతంలో ఇచ్చిన కూలీ రేటును ఇవ్వా లని డిమాండ్ చేశారు. కూలీలకు ఇన్సూరెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.కూలీల కుటుంబాలకు బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని, విశ్రాంతి గదిని ఏర్పాటు చేసి కార్మికుల లైసెన్స్ రెన్యువల్‌ను ప్రతి యేడాది యథావిధిగా చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఐక్యం చేసి ఉద్యమిస్తామన్నారు. టిఎస్ ఆర్‌టిసి రీజియన్ కార్యదర్శి కాళిదాస్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఎఐటియుసి శాఖ కార్యదర్శి పిట్టల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బొజ్జా సాయిలు, కొమురయ్య, కరీంనగర్ రీజియన్ హమాలీ నాయకులు వడ్లూరు పోషయ్య, ఉమా శంకర్, నాగరాజులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రిని నియమించాలి : విద్యార్థి సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఎఐఎస్‌ఎఫ్ ఎస్‌ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పా ఠశాలల బంద్ విజయవంతంగా ముగిసిందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త వామపక్ష విద్యార్థి సం ఘాల పిలుపుమేరకు విద్యా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బంద్ నిర్వహించినట్లు తెలిపారు. అన ంతరం వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా కార్యదర్శిలు నేరెళ్ల జోసెఫ్, కుమ్మరి రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకుకనీస మౌలికసదుపాయాలు , పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 942 మంది అస్తవ్యస్తతతో హాస్పటల్లో ఉన్నారని, ఇప్పుడు పా యిజన్ తాగిన విద్యార్థులు పరిస్థితి కూడా బాగా లేదన్నారు. పభుత్వం వెంటనే వారిని ఆదుకోవాలని ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ డిమాండ్ చేశాయి.విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సాధించాలని విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు అందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

## విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం




### ఫుడ్ పాయిజన్ ఘటనలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి

### వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తే సహించేది లేదని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించారు. అనంతరం పెవిలియన్ మైదానం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వ హించారు. ఈసందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వెంకటేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా విద్యారంగం పట్ల ద్వంధ వైఖ రిని ప్రదర్శిస్తుందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా, విద్యారంగంపై సమీక్ష నిర్వహించకుండా ప్రభుత్వ విద్యను ఎలా బలోపేతం చేస్తారని వారు ప్రశ్నించారు. పాఠశాలలు, సంక్షేమ గురు కులాల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థ తకు గురై మరణిస్తున్నారన్నారు. పలు పాఠశాలల్లో నీళ్ల చారు, పురుగుల అన్నం పెడుతున్నట్లు వారు ఆరోపించారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వామ పక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రసాద్, నాగరాజు, బాలాజీ, గోపి, లక్ష్మణ్, యశ్వంత్, సాధిక్, సందీప్, , రాజు, సంగీత్, మనోజ్, త్రినాథ్, భాను, కిరణ్, అభి, సతీష్, సాగర్, రవికుమార్ పాల్గొన్నారు.

## సంభాల్‌లో బయటి వ్యక్తుల
# ప్రవేశంపై నిషేధం పొడిగింపు

### డిసెంబరు 10వరకూ అనుమతిలేకుండా ఎవ్వరూ అడుగుపెట్టొదని జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాలు



**లక్నో / సంభాల్ :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సంభాల్‌లోకి బయటి వ్యక్తుల ప్రవేశం నిషేధం విధింపును జిల్లా అధికార యంత్రాంగం డిసెంబరు వరకు పొడిగించిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో మరింత టెన్షన్ నెలకొంది.శనివారం నాడు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) సంభాల్ ఎంపి సహా ముగ్గురు సమాజ్‌వాదీ పార్లమెంటేరియన్లు కూడా ప్రవేశించకుండా నిలిపివేశారు. డిసెంబరు 10వ తేదీ వరకూ శాంతి సామరస్యాన్ని నెలకొల్పడానికి కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు క్రమంలో ఈ నిర్ణయం తీసుకుంది. సంభాల్‌లోకి బయటి వ్యక్తుల ప్రవేశం శనివారంతో (నవంబరు 30)తో ముగియనున్నది. 'ఆదివారంతో గడువు ముగియనున్న భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 (అత్యవసరమైన ఉపద్రవం, ప్రమాదానికి సంబంధించిన అత్యవసర కేసులలో ఆదేశం జారీచేసే అధికారం)కింద ఉన్న ఆంక్షలు డిసెంబరు 31వరకు పొడిగించబడ్డాయి. సంబంధిత అధికార యంత్రాంగం అనుమతి లేకుండా డిసెంబరు 10వరకూ హింసాత్మక సంభాల్ జిల్లాలోకి బయటి వ్యక్తులు, ఏ సామాజిక సంస్థ లేదా, ఏ ప్రజాప్రతినిధి ప్రవేశించకూడదు' అని సంభాల్ జిల్లా మెజిస్ట్రేట్ రాజేంద్ర పెన్సియా ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. షాహీ జామా మసీదుపై కోర్టు ఆదేశించిన సర్వేపై చెలరేగిన హింసకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు 15మంది సభ్యుల ప్రతినిధి బృందం సంభాల్ జిల్లాకు రానున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ గతంలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ ముజఫర్‌నగర్ ఎంపి హరేంద్ర మాలిక్ కైరానా ఎంపి, సంభాల్ ఎంపిలతో కలిసి ఘజియాబాద్ నుంచి సంభాల్‌లోకి ప్రవేశిస్తుండగా శనివారం వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై ఆక్షేపణ తెలియజేసిన ఎంపి హరేంద్ర మాలిక్ మాట్లాడుతూ 'మమ్ములను ఎందుకు ఆపివేశారనేది నాకు ఏమీ అర్థం కావడం లేదు. ప్రతిపక్ష నాయకులు, ఎంపిలు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే వారని వారి ఉద్దేశమా. రాష్ట్రం పరిధిలో వారు ముందుకు కదిలేందుకు అనుమతించరా?' అని ప్రశ్నించారు. మొఘల్‌ల కాలంనాటి షాహీ జామా మసీదులోగతంలో హరిహర దేవాలయం ఉండేదన్న వాదనల నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సర్వే హిస్తుండగా నవంబరు 19వ తేదీ నుంచి సంభాల్‌లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొని హింసాకాండ చెలరేగిన విషయం తెలిసిందే. నవంబరు 24న రెండవ సర్వే సందర్భంగా కూడా హింస చెలరేగింది. నిరసనకారులు మసీదు దగ్గర గుమిగూడి భద్రతా సిబ్బందితో ఘర్షపడ్డారు. ఈ ఘర్షణ సందర్భంగా రాళ్ల దాడి చోటుచేసుకుంది. నలుగురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు.ఆందోళనకారులపై కాల్పులు జరిపారన్న ఆరోపణలను పోలీసులు కొట్టిపారేశారు. కేసు విచారణను, దాని సర్వేను నిలిపివేయాలని సంభాల్ కోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. 'మా ప్రతినిధి బృందంలో ఎంపిలు జియాఉర్‌రెహమాన్ బార్క్ (సంభాల్), ఇక్రా హసన్ (కైరానా) కూడా ఉన్నారు. మేం ఏమి చేయగలం. ప్రభుత్వం నిరంకుశ ధోరణిని ప్రదర్శిస్తోంది' అని మాలిక్ అన్నారు. నవంబరు 24 హింసాకాండకు సంబంధించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారని సంభాల్ ఎంపి జియాఉర్‌రెహమాన్ బార్క్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలాఉంటే మొరాదాబాద్‌లోని సమాజ్‌వాదీ పార్టీ ఎంపి రుచివీరా సంభాల్‌కు వెళ్లకుండా పోలీసులు ఆమె నివాసాన్ని చుట్టుముట్టారు. ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించాల్సిన ఉత్తరప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్షనాయకుడు మాతా ప్రదేశ్ పాండే తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ హోం సెక్రటరీ సంజయ్ ప్రసాద్ తనకు ఫోన్‌కాల్ చేసి సంభాల్‌ను సందర్శించవద్దని అభ్యర్థించారని చెప్పారు. ప్రతిపక్షనాయకుడు పాండే లక్నోలో ధర్నాకు కూర్చున్నారు.శుక్రవారం నుంచి పాండే నివాసం వెలుపల భారీ భద్రతను మోహరింపజేశారు. న్యాయమైన విచారణ గురించి పోలీస్ డైరెక్టర్ జనరల్ హామీ ఇవ్వడంతో సమాజ్‌వాదీ పార్టీ ముందస్తు పర్యటనను వాయిదా వేసుకుంది. ఇదిలాఉంటే ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ స్టేట్ చీఫ్ అజయ్ రాయ్ 'పిటిఐ' తో మాట్లాడుతూ పార్టీ ప్రతినిధి బృందం డిసెంబరు 2న సంభాల్‌ను సందర్శించనున్నట్లు చెప్పారు.

## నిరాశ్రయ మణిపురి మహిళల
# 'ఆర్థిక ఆపన్నహస్తం' మోనిష్‌కరమ్

### అల్లికబొమ్మల తయారీ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ విక్రయ సహకారం



**ఇంఫాల్ :** హింసాత్మక ఈశాన్యరాష్ట్రంలోని మణిపురి మహిళలలకు స్థిరమైన జీవనోపాధిని అందించడం, ఆర్థికస్వావలంబనను ప్రోత్సహించే లక్ష్యంతో సహాయక శిబిరాలలో నివసిస్తున్న నిరాశ్రయులకు చేయూతనిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు సింగపూర్‌కు చెందిన మణిపురి పారిశ్రామికవేత్త మోనిష్‌కరమ్. దీనిలో భాగంగా నిరాశ్రయులకు గ్లోబల్ మార్కెట్ విక్రయాల కోసం అల్లికలతో బొమ్మల తయారీకి సహాయపడుతున్నారు. సింగపూర్‌లో టెక్ సంస్థను నడుపుతున్న మోనిష్‌కరమ్ ఫోన్‌లో 'పిటిఐ' తో మాట్లాడుతూ 'గత ఏడాది మేలో అకస్మాత్తుగా వివాదం, హింస చెలరేగి వేలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఆదాయవనరులు లేకుండా బాధిత నిరాశ్రయులంతా సహాయక శిబిరాలలోనే తలదాచుకుంటున్నారని మేం గమనించాం. అది మమ్మల్ని తీవ్రంగా కలిచివేసింది. మేం బాధితుల కోసం ఏదైనా చేయాలని అనుకున్నాం. దీనిపై అనేకసార్లు తర్జనభర్జనలు చేశాం. చాలా ఆలోచనాత్మక సమావేశాల అనంతరం స్థానభ్రంశం చెందిన వారికి నైపుణ్యాల ఆధారిత కార్యక్రమం నిర్వహించడం ఉత్తమమైనదని భావించాం.శిబిరాలలో తలదాచుకుంటున్న అలాంటి నిరాశ్రయులు దీర్ఘకాలంలో స్థిరమైన జీవనోపాధి పొందడంలో వ్యక్తులు కొంతమంది వారికి సహాయపడతారు' అని తెలిపారు. సాంప్రదాయకంగా మణిపురి మహిళలకు హస్తకళలు, చేనేత వస్తువులను ఉత్పత్తి చేయడంలో నైపుణ్యాలను కలిగిఉన్నారు. 'నాకుమర్తె అరచేతిలో అల్లికతో కూడిన బొమ్మను నేను చూడటం జరిగింది. ఆ అల్లిక బొమ్మను చూసి నేను ప్రేరణ పొందాను. బాధిత మహిళలు తమ జీవనోపాధికి ఇలాంటి బొమ్మల తయారీ ఎంతగానో ఉపయోగపడుతుంది' అని నేను భావించానని సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్‌గా పట్టా పొందిన మోనిష్ కరమ్ అన్నారు. అయితే మేం సాధారణమైన, సాపేక్షంగా ప్రపంచవ్యాప్తంగా ఆకర్షణ కలిగిన బొమ్మల పాత్రలపై దృష్టి పెట్టాలనుకున్నాం. తద్వారా శిబిరాలలో తలదాచుకున్న నిరాశ్రయులు తయారుచేసిన అల్లికల బొమ్మలను మణిపూర్ వెలుపల విక్రయించవచ్చు. తద్వారా వచ్చిన డబ్బును స్థానభ్రంశం చెందిన బాధిత మహిళలు, వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఉపయోగించవచ్చు' అని మోనిష్ కరమ్ వివరించారు.కొవ్వొత్తులు, అగరుబత్తీలు, వాషింగ్ పౌడర్లను తయారు చేయడంలో నిరాశ్రయులైన స్త్రీలు నిమగ్నమైనారని ,పూర్తి ఉత్పత్తులను విక్రయించడంలో మాత్రమే వారు ఎంతో కష్టపడుతున్నారని, ఈ నేపథ్యంలో డాల్ మేకింగ్ ప్రాజెక్ట్‌ను మరింత సులభతరం చేయాలని తాము భావించినట్లు కరమ్ చెప్పారు. సహాయక 'శిబిరాలలోనే ఉండిపోయిన వారు కొవ్వొత్తులు, ధూపాలను తయారు చేయడం, వాటి ఉత్పత్తులను విక్రయించడానికి వీధులలోకి రావడం చాలామంది చూశారు. ఈ నేపథ్యంలో బాధిత మహిళలకు హోల్ మేకింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి, అమ్మకం ప్రక్రియలో ఉన్న సంక్లిష్టతలను జాగ్రత్తగా చూసుకోవాలని మేం నిర్ణయించుకున్నాం. అమ్మకాలు వంటి బొమ్మలకు మద్దతు,బ్రాండింగ్, మార్కెటింగ్, సహకారం, కేవలం మహిళల బొమ్మలపై మాత్రమే దృష్టి పెట్టండని కోరాం' అని కరమ్ చెప్పారు.'ఈ బొమ్మలు కేవలం బొమ్మలు మాత్రమే కావు. అవి ఆశలకు ప్రతీక. కథాసాహిత్యానికి సంబంధించిన పాత్రలు అని మేం నమ్ముతున్నాం' అని మోనిష్‌కరమ్ తెలిపారు.ఈ మొత్తం ప్రాజెక్ట్, 'ప్రాజెక్ట్ స్టిచింగ్ హోప్' పేరుతో మోనిష్ కరమ్ యాజమాన్యంలోని టెక్ సంస్థ ఉపసమూహం'1 మిలియన్ హీరోస్' (ఐఎంహెచ్) కింద నిర్వహించబడుతోంది అని ఆయన చెప్పారు.ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక మహిళ భారతీయ మహిళా అధికారి భార్య ఈ బొమ్మలను పెద్దయెత్తున తన సర్కిల్‌లో విక్రయిస్తున్నప్పుడు బాధిత మణిపూర్ మహిళలు తయారు చేసిన ప్రత్యేకమైన వస్తువుగా వాటిని ప్రదర్శిస్తున్నప్పుడు మోనిష్‌కరమ్ ఎంతగా హత్తుకున్నాడో అనే విషయాన్ని పంచుకున్నాడు. 'వాటి అమ్మకాల తర్వాత వచ్చిన డబ్బును ఆమె మాకు పంపించింది. స్థానభ్రంశం చెందిన మహిళలకు తిరిగి ఇంటికి బదిలీ చేయబడింది. ఆమె సహాయం చేయాలని అనుకున్నందువల్లే అలా చేసింది' అని మోనిష్‌కరమ్ ఆమెకు చేతులు జోడించి నమస్కరించారు.


# ఏటా 50వేలకుపైగా పాముకాటు మరణాలు

### రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులకు కేంద్ర ప్రభుత్వం లేఖ

**న్యూఢిల్లీ :** క్రిస్టియన్ మైఖెల్‌ను ప్రపంచవ్యాప్తంగా మరణాలకు క్యాన్సర్, గుండెజబ్బులు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. అయితే, మరికొన్ని సమస్యలతోనే ఏటా మిలియన్ల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో ఒకటి పాముకాటు మరణాలు. ప్రపంచవ్యాప్తంగా పాముకాటు కారణంగా సంభవిస్తున్న మరణాల రేటులో భారత్‌లో అత్యధికంగా ఉన్నది. ఓ అంచనా ప్రకారం ఏటా 45,900 నుంచి 58వేల మంది వరకు పాముకాటు కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య కార్యదర్శులకు లేఖ రాశారు. పాముకాటు కేసులు, మరణాలను 'నోటిఫై చేయదగిన వ్యాధి'గా మార్చాలని సూచించారు. దాంతో దాంతో ఒకపై పాముకాటు మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి రానున్నది. 2030 నాటికి పాముకాటు మరణాలను సగానికి తగ్గించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2030 నాటికి పాముకాటు మరణాల నివారణ కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఎపిఎస్‌ఇ)ను ప్రారంభించింది. పాముకాటుతో మరణంతో పాటు వైకల్యానికి దారి తీస్తుందని కార్యదర్శి పేర్కొన్నారు. రైతులు, గిరిజనులు ఎక్కువగా ప్రమాదంలో ఉన్నారని తెలిపారు. పాముకాటు కేసులు, మరణాలను నిఘాను పెంచడమే ప్రణాళిక ప్రధాన లక్ష్యమని చెప్పారు. పాముకాటు వ్యాధులు, మరణాలను ప్రజారోగ్య చట్టం.. ఇతర వర్తించే చట్టం ప్రకారం.. 'నోటిఫై చేయదగిన వ్యాధులు'గా మార్చాలని అభ్యర్థించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య సౌకర్యాలు (మెడికల్ కాలేజీలతో సహా) పాముకాటు కేసులు, మరణాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.

## ఎన్నికల యంత్రాంగం నియంత్రణకు
# అధికార దుర్వినియోగం

### మహాయుతి తీరుపై ఎన్‌సిపి (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ విమర్శలు



**పుణె :** ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో అధికార మహాయుతి తీరుపై ఎన్‌సిపి (ఎస్పీ) అధినేత శరద్ పవార్ విమర్శలు గుప్పించారు. దేశంలో ఇంతకు ముందెన్నడూ చూడనివిధంగా మహారా ష్ట్ర ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందన్నారు. కొందరు నేతలు, మీడియా వర్గాలను తమ కు అనుకూలంగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభు త్వం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెట్టిందని ఆరోపించారు. పార్లమెంటు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడూ ఇలా జరగలేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఇవిఎంల వినియోగంలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ నిరసనకు దిగిన సామాజిక కార్యకర్త బాబా అధవ్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. బాబా అధవ్... సంఘ సంస్కర్త జ్యోతిబా పూలే నివాసమైన పూలే వాడలో మూడు రోజులు నిరసన చేపట్టారని, కాని ఇది మాత్రమే చాలదని పవార్ అన్నారు. ప్రజల్లో తిరుగుబాటు రాకపోతే ప్రజాస్వామ్యం నాశనమవుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఇవిఎంలలో అవకతవకలు జరిగినట్లు ప్రతిపక్ష మహావికాస్ అఘాడి (ఎంవిఎ) నేతలు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈవిషయంపై పవార్ మాట్లాడుతూ.. దేశ పగ్గాలు తమ చేతుల్లో ఉన్నవారు ఎన్నికల్లో జరుగుతున్న అవకతవకలను పట్టించుకోవడం లేదన్నారు. వారికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకొని చట్టాలు రూపొందించుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇవిఎంలలో జరుగుతున్న అవకతవకల విషయంలో దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చలు జరుగుతున్నా.. విపక్షాలు పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తడానికి ప్రయత్నిస్తున్నా కేంద్రం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అంశాలపై పార్లమెంటులో మాట్లాడడానికి ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నా.. అవకాశం ఇవ్వట్లేదని.. ఈవిధంగా వారు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. నవంబర్ 20న జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో శివసేన, బిజెపి, ఎన్‌సిపిలతో కూడిన మహాయుతి 288 అసెంబ్లీ స్థానాల్లో 230 స్థానాల్లో విజయం సాధించగా, ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కేవలం 46 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ ఫలితాలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల నిర్వహణకు ఇవిఎంలు వద్దని.. బ్యాలెట్ పేపర్లే తాము కోరుకుంటున్నామన్నారు.

# అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి ప్రయత్నం..!



న్యూఢిల్లీ : క్రిస్టియన్ మైఖెల్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఢిల్లీలోని గ్రేటర్ కైలాష్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి ఆయనపై దాడికి యత్నించగా.. ఆయన తృటిలో తప్పించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. గ్రేటర్ కైలాష్ ప్రాంతంలో పాదయాత్ర నిర్వహిస్తున్న సమయంలో కేజ్రీవాల్‌పై బాటిల్‌లోని లిక్విడ్‌ను పోసేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించారు. దాంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అడ్డుకున్నారు. పాదయాత్రలో అరవింద్ కేజ్రీవాల్ మద్దతుదారుల మధ్య నడుచుకుంటూ వస్తున్నారు. ఒక్కసారిగా గుంపులో నుంచి వచ్చిన వ్యక్తి బాటిల్‌ను తీసి.. అందులో ఉన్న ఉన్న ద్రవాన్ని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రిపై పోసేందుకు ప్రయత్నించాడు. కేజ్రీవాల్‌తో పాటు అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది వేగంగా స్పందించి ఆ వ్యక్తిని అడ్డుకున్నారు. అయితే, సీసాలో కేవలం నీరు మాత్రమే ఉందని.. ప్రమాదకరమైన లిక్విడ్స్ ఏమీ లేవని తెలుస్తున్నది. సదరు వ్యక్తిని అశోక్ ఝాగా గుర్తించారు. అయితే, గతంలోనూ కేజ్రీవాల్‌పై ఇదే తరహాలోనూ ఇంక్ పోసిన సందర్భాలు ఉన్నాయి. కేజ్రీవాల్‌పై లిక్విడ్ పోసిన వ్యక్తిని కేజ్రీవాల్ మద్దతుదారులు పట్టుకొని చితకబాదారు. ఆ తర్వాత పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడి వెనుక బీజేపీ హస్తం ఉందని ఆప్ నేత సౌరభ్ భరద్వాస్ ఆరోపించారు. ఢిల్లీలో శాంతిభద్రతలు కుప్పకూలాయని.. కేంద్ర ప్రభుత్వం, హోంశాఖ మంత్రి ఏం చేయడం లేదంటూ విమర్శించారు.

## కాంగ్రెస్ అనుమానాలను నివృత్తి చేస్తాం : ఇసి




**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే. ఎన్నికల్లో తీవ్ర అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సహా అగ్ర నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇక ఈ అంశంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇసికి లేఖ రాశారు. ఇవిఎంలను ట్యాంపరింగ్ చేశారంటూ పోలింగ్ డేటాలోనూ తేడాలున్నాయని లేఖలో ప్రస్తావించారు. వ్యక్తిగతంగా హాజరై తమ అనుమానాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ రాసిన లేఖపై ఈసీ తాజాగా స్పందించింది. ఎన్నికలు ప్రతి దశలోనూ పారదర్శకంగా జరిగాయని తెలిపింది. కాంగ్రెస్ నేతల చట్టపరమైన ఆందోళనను తాము పరిశీలిస్తామని హామీ ఇచ్చింది. వారికి ఫలితాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తామని తెలిపింది. ఈమేరకు డిసెంబర్ 3న కాంగ్రెస్ ప్రతినిధులు రావాలని ఆహ్వానించింది. ప్రతినిధుల బృందం అనుమానాలు విన్న తర్వాతే రాతపూర్వకంగా సమాధానం ఇస్తామని ఇసి స్పష్టం చేసింది.

**హర్యానా ఎన్నికల్లోనూ అవకతవకలు: కెసి వేణుగోపాల్**

హర్యానా అసెంబ్లీ ఫలితాలను ఎన్నికల్లో జరిగిన అవకతవకలు ప్రభావితం చేసినట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మీడియా సమావేశంలో ఆరోపించారు. అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చినట్టు సిడబ్ల్యుసి గుర్తించిందన్నారు. మహారాష్ట్ర ఫలితాలు కూడా దిగ్భ్రాంతికి గురిచేశాయనే అభిప్రాయం సిడబ్ల్యుసిలో వ్యక్తమయిందని, చాలా స్పష్టంగా అవకతవకలు జరిగినట్టు అవగతమవుతోందని అన్నారు. అధికారికంగా పోలింగ్ సమయం పూర్తయిన తర్వాత ఓటింగ్ శాతం 7.83 శాతం ఎలా పెరిగిందో తాము తెలుసుకోవాలని అనుకుంటున్నట్టు మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటేల్ ఇసికి లేఖ సైతం రాశారు. కాగా, ఇటీవలే వెల్లడైన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విపక్ష మహా వికాస్ అఘాడీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసింది. కూటమిలోని బిజెపికి132, షిండే సేనకు 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపికి 41 సీట్లు దక్కాయి. విపక్ష కూటమిలోని కాంగ్రెస్‌కు 16, శివసేన (యూబీటీ) 20, ఎన్సీపీ (ఎస్‌పీ) 10 స్థానాల్లో మాత్రమే గెలుపొందాయి.

## బాబా సిద్దిఖ్ హత్యకేసులో...
# 26మందిపై కఠిన 'ఎంసిఓసి యాక్ట్'

### ఇంకా పరారీలోనే...అనుమానిత కుట్రదారులు శుభమ్‌లోంకర్, జిషాద్ మహ్మద్‌అక్తర్


### ఈ హత్యకేసులో ప్రధానషూటర్ శివకుమార్ గౌతమ్ నేపాల్‌కు పారిపోతుండగా అరెస్ట్



**ముంబయి :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నేత, మాజీ మంత్రి బాబా సిద్దిఖ్ హత్యకేసులో ఇప్పటి వరకు అరెస్ట్ అయిన 26మంది నిందితులపై ముంబయి పోలీసులు కఠినమైన మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ (ఎంసిఓసి) చట్టాన్ని ప్రయోగించారు. శనివారం ఈ విషయాన్ని అధికారులు తెలియజేశారు. ఎంసిఓసిఎ లో పోలీసులు చేసిన ఒప్పుకోలు కోర్టులో సాక్ష్యంగా అంగీకరించబడుతుందని గమనించడం ముఖ్యం. ఈ చట్టం కింద బెయిల్ పొందడం చాలా కష్టం అనే చెప్పవచ్చు.బాబా సిద్దిఖ్ హత్య కేసులో కఠినమైన ఎంసిఓసి చట్టానికి సంబంధించిన నిబంధనలు ఉపయోగించబడ్డాయని ముంబై పోలీస్ అధికారి వాటి వివరాల లోతులలోకి వెళ్లకుండా చెప్పారు. మహారాష్ట్ర మాజీ మంత్రి సిద్దిఖ్ (66) అక్టోబరు 12న ముంబయిలోని బాంద్రా ఈస్ట్‌లోని ఆయన కుమారుడు ఎమ్మెల్యే జీషక్ సిద్దిఖ్ కార్యాలయం వెలుపల ముగ్గురు దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ హత్యకేసులో అనుమానిత ప్రధాన షూటర్ శివకుమార్ గౌతమ్‌తో సహా మొత్తం 26మందిని పోలీసులు ఇప్పటి వరకూ అరెస్ట్ చేశారు. ఈ హత్యలో అనుమానిత కుట్రదారులు శుభమ్ లోంకర్, జిషాద్ మహ్మద్‌అక్తర్ అనే ఇద్దరు నిందితులు ఇంకా పరారీలోనే ఉన్నారని పోలీసులు తెలియజేశారు.జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్మోల్ సిద్దిఖ్ హత్య, ప్రముఖ బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ముంబయి నివాసంపై కాల్పులు జరిపిన కేసులో అతని పాత్ర ఉందన్న కేసులో అతడిని అమెరికాలో అరెస్ట్ చేశారు. ముంబయి పోలీసులు, ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) నవంబరు నెలలో బ్రహ్రైచ్ జిల్లాకు చెందిన శివకుమార్ గౌతమ్ నేపాల్‌కు పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అరెస్ట్ చేశారు. శుభమ్ లోంకర్ లారెన్స్ బిష్ణోయ్ దగ్గర పనిచేస్తున్నాడని, అతడికి (గౌతమ్)అన్మోల్ బిష్ణోయ్‌కి మధ్య అనేకసార్లు స్నాప్ చాట్ ద్వారా కమ్యూనికేషన్ అందించాడని గౌతమ్ పోలీసులకు చెప్పాడు. సిద్దిఖ్‌ను చంపినందుకు రూ10లక్షలు ఇస్తానని గౌతమ్ వాగ్దానం చేసినట్లు ఉత్తరప్రదేశ్ పోలీసులు చెప్పారు.

# మోసపూరితంగా పెన్షన్లు పొందితే కఠినచర్యలు

### వడ్డీతోసహా డబ్బు వాపసు తీసుకుంటాం:కేరళ సిఎం విజయన్



తిరువనంతపురం : బలహీనవర్గాల సామాజిక భద్రతకోసం ఉద్దేశించిన ప్రభుత్వ సంక్షేమ పెన్షన్లను మోసపూరిత పద్ధతులలో అనుభవించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హెచ్చరించారు. సంక్షేమ పథకాల కింద బలహీన వర్గాలకోసమే పెన్షన్లు ఇస్తున్నామని, అది వారికోసమే ఉద్దేశించినవని అన్నారు. 1,500 మంది ప్రభుత్వ ఉద్యోగులు బలహీనవర్గాలకు ఉద్దేశించిన సంక్షేమ పెన్షన్లను మోసపూరిత పద్ధతులలో అనుభవిస్తున్న విషయం వెలుగులోకి రావడంతో ముఖ్యమంత్రి పైవిధంగా హెచ్చరిక చేశారు. ఈ విధంగా పెన్షన్లు పొందుతున్నవారిలో ఉద్యోగులతోపాటు గెజిటెడ్ ఆఫీసర్లు, కాలేజీ ప్రొఫెసర్లుకూడా ఉండటం ఆశ్చర్యకరం. ఇలా అక్రమంగా, మోసపూరితంగా వ్యవహరించే ఉద్యోగులపై శాఖాపరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈ బెడదను తొలగించేందుకు ముఖ్యమంత్రి శనివారంనాడు నిర్వహించిన ఒక ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విధంగా అక్రమాలు చేసిన ఉద్యోగులు దోచుకున్న సంక్షేమ నిధులను వాపసు తీసుకునేందుకు తగిన చర్యలు చేపడతామని చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇందుకు బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మరణించినవారి పేరుతో పెన్షన్లు పొందుతున్నందువల్ల అలాంటి పేర్లను తక్షణం సంక్షేమ పెన్షనర్ల జాబితా నుండి తొలగించాలని ఆదేశాలు వెళ్ళాయి. వీటిపై తిరిగి సమగ్ర తనిఖీ చర్యలుంటాయి. ఈ విధంగా సంక్షేమ పథకాలు పొందేవారు ప్రతి ఏడాదీ వ్యక్తిగత హాజరు వేయించుకోవాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. పెన్షన్లు పొందేవారి మొఖాలను డిజిటల్ పద్ధతులలో ప్రతి ఏడాదీ నమోదు చేస్తారు. ఈ విషయంలో ఆదాయ ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డుల తనిఖీలు తప్పనిసరిగా ఉంటాయి. తొలుత ఈ సమాచారాన్ని సేకరించేందుకు కేరళ ఇన్ఫర్మేషన్ మిషన్ తనిఖీ చర్యలు తీసుకుంది. స్థానిక సంస్థల ద్వారా సంబంధిత సమాచారాన్ని డిజిటలైజేషన్ చేశారు. ఈ తనిఖీలలో 1,458 మంది ప్రభుత్వ ఉద్యోగులు అక్రమంగా సామాజిక భద్రతా పెన్షన్లు పొందుతున్నట్లు ధృవీకరించడంతో ముఖ్యమంత్రి దాకా ఈ విషయం వెళ్ళింది. ఈ విషయం వెలుగులోకి రావడంతో తప్పు చేసిన ఉద్యోగులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వ సర్వీసులో చేరిన తర్వాత ఈ విధంగా సంక్షేమ ప్రయోజనాలు పొందటం ఎంతమాత్రం సమ్మతంకాదన్నారు. అర్హులైన పెన్షనర్లు ఎవరో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ముఖ్యమంత్రి కూడా ఆదేశించారు. ఆర్థికమంత్రి బాలగోపాల్, ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్, ఆర్థికశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఎ.జయంథిలాక్, ముఖ్యమంత్రి దగ్గర పనిచేసే ప్రధాన ముఖ్యకార్యదర్శి కె.ఎం.అబ్రహాం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# సవతి కూతురుపై అత్యాచారం.. కేసులో నిందితుడికి 141 ఏళ్లు జైలు శిక్ష



**తిరువనంతపురం:** ఒక వ్యక్తి సవతి కూతురుపై పలు ఏళ్లుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. విచారణ జరిపిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు నిందితుడికి 141 ఏళ్లు జైలు శిక్ష విధించింది. కేరళలోని మలప్పురం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తమిళనాడుకు చెందిన కుటుంబం పని కోసం కేరళకు వలస వచ్చింది. అయితే 2017 నుంచి 2020 వరకు సవతి తండ్రి సవతి కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె తల్లి ఇంట్లో లేనప్పుడు ఆ బాలికపై అత్యాచారం చేసేవాడు. కాగా, బాధిత బాలిక ఈ విషయాన్ని తన స్నేహితురాలికి చెప్పింది. ఆమె సూచనతో సవతి తండ్రి అకృత్యాలను తల్లికి వివరించింది. దీంతో 2021లో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సవతి తండ్రిని అరెస్ట్ చేశారు. పోక్సో చట్టంతోపాటు, ఐపిఎస్, జువెనైల్ జస్టిస్ చట్టాల్లోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. 2022లో బెయిల్‌పై విడుదలైన ఆ వ్యక్తి సవతి కుమార్తెపై మళ్లీ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదుతో అతడిపై మరో కేసు నమోదైంది. మరోవైపు మంజేరి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఈ రెండు కేసులపై విచారణ జరిపింది. నవంబర్ 29న జడ్జి అష్రఫ్ ఎఎం తీర్పు ఇచ్చారు. సవతి కుమార్తెపై ఏళ్లుగా అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని దోషిగా నిర్ధారించారు. పోక్సో, జువెనైల్ జస్టిస్ చట్టాల తోపాటు ఐపిసిలోని పలు సెక్షన్ల ప్రకారం రెండు కేసుల్లో మొత్తం 141 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు. కాగా, అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని కోర్టు పేర్కొంది. దీంతో ఆ వ్యక్తి గరిష్ఠంగా 40 ఏళ్లు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అలాగే దోషికి రూ.7.85 లక్షల జరిమానా కూడా కోర్టు విధించింది. బాధితురాలికి ఈ నష్టపరిహారం అందించాలని ఆదేశించింది.


Indian Bank

మల్లాపురం బ్రాంచ్
హైదరాబాద్ జోన్, డి.నం. 4-42-3, ఇఎస్‌ఐ హాస్పిటల్, నాచారం మెయిన్ రోడ్డు, హైదరాబాద్-500076, ఫోన్: 040-27172988, 040-27177890

**అనుబంధం-4 [నిబంధన-8(1)]**

**స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)**

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 8&9తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి **ఇండియన్ బ్యాంక్** అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు, రుణగ్రహీత/లు: **1.శ్రీమతి అడుపుల రమాదేవి భర్త ఎ.ఇంద్రసేనారెడ్డి, 2. శ్రీ ఎ. ఇంద్రసేనారెడ్డి** లకు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసు పేర్కొన్నట్లుగా మా మల్లాపురం బ్రాంచికి బకాయి పడిన రుణ మొత్తం **రూ. 15,23,101/- (పదిహేను లక్షల ఇరవైమూడువేల నూట ఒక్క రూపాయలు మాత్రమే)** తిరిగి చెల్లించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ **22/08/2024** న డిమాండ్ నోటీసు జారీ చేయ డమైనది. రుణగ్రహీత బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 8 మరియు 9 తో చదివే సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు **తేదీ: 28 నవంబరు, 2024** న స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు యివ్వడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా 1 భవిష్యత్ వడ్డీ , వ్యయం మరియు దానిపై చార్జీలతో 27/11/2024 నాటికి **రూ. 13,99,105/-** (పదమూడు లక్షల తొంభైతొమ్మిది వేల నూట ఐదు రూపాయలు మాత్రమే) లు మరియు దానిపై వడ్డీ కొరకు ఇండియన్ బ్యాంక్ చార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది. "రుణగ్రహీత ద్వారా హామీగా పెట్టిన ఆస్తులను విడిపించుకునే సమయానికి సంబంధించి సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13(8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా కోరడమైనది."

**స్థిర ఆస్తి యొక్క వివరాలు**

హైదరాబాద్, బడంగ్‌పేట్ పంచాయతీ కింద రంగారెడ్డి జిల్లా , సరూర్‌నగర్ రెవిన్యూ మండలం, బడాంగ్‌పేట్ గ్రామంలో ఉన్న 250 చదరపు గజాలు లేదా 209 చదరపు మీటర్ల కొలతతో, సర్వే నం.169లో ప్లాట్ నం: 452 తూర్పు భాగం భూమి యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: ఉత్తరం: 25' వెడల్పు రోడ్డు, తూర్పు: ప్లాట్ నం: 453, దక్షిణం: ప్లాట్ నం:5, పడమర: ప్లాట్ నం: 452 పడమర భాగం.

**తేదీ: 28-11-2024,**
ప్రదేశం: హైదరాబాద్

సం/-అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్

# పాప్‌కార్న్

## నామమాత్రపు సంస్థలు ఎందుకు?




కేంద్ర ప్రభుత్వం నిత్యం ఏదో ఒక సంస్థను లేదా ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చి హంగామా చేస్తునే ఉంది. వీటిలో చాలావరకూ నిస్తేజంగా, నిర్వీర్యంగా, నిరాశాజనకంగా పనిచేస్తున్నాయి. అలాంటి నామమాత్రపు సంస్థల్లో బీహార్‌లోని నేషనల్ డాల్ఫిన్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌డిఆర్‌సి)ఒకటి. దేశంలో అంతరిస్తున్న డాల్ఫిన్లను పరిరక్షించడమే ఈ ప్రాజె క్టు లక్ష్యం. కానీ, ఇది నిష్క్రియంగా మారడంతో, డాల్ఫిన్ల మనుగడ మరింత ప్రమాదంలో పడింది. వాటి పరిరక్షణ బాధ్యత తీసుకున్న సంస్థ ఇప్పటి వరకూ చర్యలు మొదలుపెట్టకపోతే, ఇతర వ్యవస్థలు ఎందుకు దృష్టి సారిస్తాయన్నది ప్రశ్న. ఈ ఏడాది మార్చి నెలలో ఎన్‌డిఆర్‌సిని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అట్టహాసంగా ప్రారంభించారు. డాల్ఫిన్ల పరిరక్షణకు, ప్రత్యేకించి గంగానదిలో వీటి సంఖ్య తగ్గిపోవడానికి కారణాలను గుర్తించి వాటిని సంరక్షించడానికి ఈ సంస్థ ఏర్పాటైంది. పరిశోధనల కోసం 4,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. అంతవరకూ బాగానే ఉన్నప్పటికీ, ఈ సంస్థ ఇప్పటి వరకూ పనులు మొదలుపెట్టకపోవడంతో, ప్రాజెక్టు లక్ష్యాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ప్రాజెక్టు ప్రతిపాదన సుమారు 15 సంవత్సరాల క్రితమే తెరపైకి వచ్చింది. డాల్ఫిన్ల పరిరక్షణతోపాటు పరిశోధనకోసం పరికరాలు, సిబ్బంది ఆవశ్యకతను ప్రముఖ డాల్ఫిన్ నిపుణుడు ఆర్‌కె సిన్హా నొక్కి చెప్పారు. జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన గోపాల్ శర్మ ఈ ప్రతిపాదనను సమర్థించారు. కానీ, అనేకానేక కారణాలతో ఎన్‌డిఆర్‌సి ఏర్పాటు వాయిదా పడుతూ వచ్చింది. చివరికి ఈ ఏడాది మార్చిలో ప్రారంభంకాగా, బీహార్ ఈఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ పికె గుప్తా దీనిని ఒక అసాధారణమైన, అద్భుతమైన పరిణామంగా అభివర్ణించారు. గంగానదిలో డాల్ఫిన్ల పరిస్థితి మెరుగుపడుతుందని, అవి చనిపోయే ప్రమాదం తగ్గుతుందని అంతా అనుకున్నారు. కానీ, ఆ ఆనందం ఆవిరైంది. ప్రారంభమై ఎనిమిది నెలలు దాటినప్పటికీ, ఇంకా పనులే చేపట్టలేదు. గంగానది డాల్ఫిన్ జాతి అంతరించిపోతున్నట్టు నిపుణులు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నారు. ప్రకృతి పరిరక్షణకు కృషి చేస్తున్న 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్' సైతం గంగానది డాల్ఫిన్లను అంతరిస్తున్న జాతి జాబితాలో చేర్చింది. కానీ, అటు కేంద్ర ప్రభుత్వానికిగానీ, ఇటు బిజెపి మద్దతుతో పాలన కొనసాగిస్తున్న జెడియుకుగానీ పరిస్థితి తీవ్రత అర్థం కావడం లేదు... లేదా అర్థంకానట్టు నటిస్తున్నాయి.



## కోరల్లేని ఐసిసి



క్రీడల గురించి ఏమాత్రం ఆసక్తి ఉన్నవారికైనా ఐసిసి అంటే 'ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్' గుర్తుకొస్తుంది. కానీ, ఇటీవల కాలంలో ఐసిసి అంటే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అని కూడా తెలుస్తున్నది. ఉక్రేన్‌పై యుద్ధానికి దిగినందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై అరెస్టు వారెంటును జారీ చేసి, అందరి దృష్టినీ ఆకర్షించింది. తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి యొయేవ్ గాలంట్, హమాస్ నాయకుడు మహమ్మద్ డైఫ్‌పై ఈ అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. వీరిలో డైఫ్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది. ఘోరమైన నేరాలు, ఘోరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదుచేసి, విచారించడం ఐసిసి విధుల్లో ప్రధానమైనది. రోమ్ తీర్మానం ఆధారంగా 1998, జులై 17న ఐసిసిని నెలకొల్పారు. రోమ్ తీర్మానం ఈ కోర్టు అధికార పరిధిని, నిర్మాణ విధానాన్ని, విధులను నిర్దేశిస్తున్నది. అన్ని లాంఛనాలు పూర్తి చేసుకున్న తర్వాత, 2002 జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. నెదర్లాండ్స్‌లోని హేగ్ నగరంలో ఉన్న ఈ కోర్టు అంతర్జాతీయ సమాజానికి ఆందోళన కలిగించే తీవ్రమైన నేరాలు, అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై విచారణను కొనసాగిస్తున్నది. 123దేశాలు రోమ్ శాసనానికి అనుకూలంగా స్పందించాయి. అధికారాన్ని గుర్తించాయి. అయితే అమెరికా, రష్యా, చైనా, ఇజ్రాయెల్, భారత్ ఇప్పటి వరకూ గుర్తించకపోవడంతో, ఐసిసి ఉనికి నామమాత్రంగా మారింది. ఈ కోర్టు నిర్వహణకు వివిధ దేశాల ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, కార్పొరేషన్లు, ఇతర సంస్థలు, వ్యక్తులు స్వచ్ఛందంగా విరాళా లు అందచేస్తున్నారు. వారి సాయంతోనే కోర్టు మనుగడ సాగిస్తున్నది. ఇందులో 18మంది న్యాయమూర్తులు ఉన్నారు. వీరంతా వివిధ దేశాల నుంచి ఎంపికవుతారు. ఐసిసి న్యాయమూర్తి పదవీకాలం 9 సంవత్సరాలు. ఈ న్యాయమూర్తుల నుంచి ఒక అధ్యక్షుడిని, ఇద్దరు ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ప్రీట్రయల్ డివిజన్, ట్రయల్ డివిజన్, అప్పీల్స్ డివిజన్ అనే మూడు విభాగాలు ఇందులో ఉంటాయి. వివిధ నేరాలపై 'ఆఫీస్ ఆఫ్ ది ప్రాసిక్యూషన్' (ఒటిపి) సమాచారాన్ని స్వీకరిస్తుంది. పరిశీలిస్తుంది. కోర్టు ముందు ప్రాసిక్యూషన్‌లను నిర్వహిస్తుంది. వివిధ దేశాల మధ్య తలెత్తిన వివాదాలను పరిశీలించే అంతర్జాతీయ న్యాయస్థానం (ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్) మాదిరికాకుండా, ఐసిసి అనేది వ్యక్తులపై వచ్చిన అభియోగాలను మాత్రమే విచారిస్తుంది. నిర్మాణం, నిర్వహణ ఎలావున్నప్పటికీ, కీలక దేశాల గుర్తింపు లేకపోవడంతో ఐసిసి కోరల్లేని పులిలా మారింది. ఈ కోర్టు తీసుకునే నిర్ణయాలను ఎవరూ పాటిస్తున్న దాఖలాలు లేవు. ఆదేశాలపై స్పందన ఉండదు. ఒక వ్యక్తిని వివిధ కేసుల్లో విచారించడం, దోషిగా తేల్చడం మినహా ఐసిసి చేస్తున్నదిగానీ, చేయగలిగిందిగానీ ఏమీ లేదు.

## సంక్షోభంలో సూడాన్



ఆర్థికంగా, రాజకీయంగా సూడాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య యుద్ధానికి తక్షణమే తెరపడాలని, అవసరాల్లో ఉన్న లక్షలాది మందికి మానవతా సా యం అందించాలన్న ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని భద్రతా మండలి తీర్మానాన్ని రష్యా వీటో చేయడంతో, ఈ సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. సూడాన్‌లో సైన్యం, పారామిలటరీ దళాల మధ్య ఆధిపత్య పోరాటం కొత్తకాదు. అయితే, 2023లో ఈ ఘర్షణ తారాస్థాయికి చేరింది. దేశ రాజధాని ఖర్టూమ్ భయంతో బిక్కుబిక్కుమంటున్నది. సూడాన్ సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2003లో అత్యంత భయానకమైన అంతర్యుద్ధం కారణంగా పశ్చిమ డార్ఫర్‌తోసహా అనేక ప్రాంతాలు భారీగా నష్టపోయాయి. ఈశాన్య ఆఫ్రికాలోని ఈ దేశానికి ఉత్తరాన ఈజిప్టు, ఈశాన్యంలో ఎర్ర సముద్రం, తూర్పున ఎరిఅటియా, ఇథియోపియా, దక్షిణాన దక్షిణ సూడాన్, నైరుతిలో సెంట్రల్ ఆఫికన్ రిపబ్లిక్, పశ్చిమాన చాద్, వాయవ్యదిశలో లిబియా సరిహద్దు దేశాలుగా ఉన్నాయి. 2011లో సూడాన్ నుంచి దక్షిణ సూడాన్ వడిపోయింది. కాగా, సుడాన్ 1899 నుండి 1956లో స్వాతంత్ర్యం పొందే వరకు ఈజిప్టు, బ్రిటన్ సంయుక్త పాలన కింద ఉండేది. 1956లో స్వాతంత్ర్యం పొందినప్పటికీ, అత్యధిక కాలం సైనిక పాలన కిందే ఉంటున్నది. సుడాన్ రెండు సుదీర్ఘ అంతర్యుద్ధాలను ఎదుర్కొంది, మొదటిది 1955– 1972 మధ్యకాలంలో, రెండవది 1983–2005 మధ్యకాలంలో చోటు చేసుకున్నాయి. వ్యవసాయం, పశువులు, చమురు, ఖనిజాలపై ఈ దేశ ఆర్థిక మూలా లు ఆధారపడి ఉన్నాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం చాలాఎక్కువ. ప్రధాన భాష అరబిక్. అయితే, అనేక స్థానిక భాషలు కూడా మాట్లాడతారు. ఇస్లాం ఆధిపత్య మతం. క్రైస్తవ మతం కూడా కొన్ని ప్రాంతాల్లో బలంగా ఉంది. దేశీయ మత విశ్వాసాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం పొందినకాలం నుంచే సూడాన్ అనేక రకాలుగా సమస్యల ఊబిలో చిక్కుకుంది. అయితే, 2003లో జరిగిన డార్ఫర్ యుద్ధం (దీనిని ల్యాండ్ క్యూయిజర్ వార్ అని కూడా పిలుస్తారు) అనేకానేక రూపాలు సంతరించుకొని, ఇప్పటికీ కొనసాగుతునే ఉంది. డార్ఫర్ ప్రాంతంలో జరిగిన సాయుధ పోరాటం అది. సూడాన్ ప్రభుత్వానికి, తిరుగుబాటు గ్రూపులకు మధ్య పోరాటం ఆ దేశాన్ని కష్టాలపాలు చేసింది. అరబ్‌యేతర ప్రజలను అణచివేస్తున్నారన్న ఆరోపణలతో తొలుత ఘర్షణ మొదలైంది. ఈ అంతర్యుద్ధంలో వేలాదిమంది పౌరులు మరణించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) సూడాన్ అధ్యక్షుడు ఒమర్ అల్‌బషీర్‌పై పలు నేరారోపణలు చేసింది. కానీ, చర్య తీసుకునే అవకాశం లేకపోవడంతో, ఐసిసి ఆరోపణలకు, తీర్మానాలకు ఎలాంటి ప్రాధాన్యం లేకుండాపోయింది. నాడు అరబ్‌యేతరుల నిరసనల నుంచి ఇప్పుడు మిలటరీ, పారామిలటరీ ఘర్షణల వరకూ సూడాన్‌లో నిత్య మారణ హోమం జరుగుతునే ఉంది. ఈ పరిస్థితులు సూడాన్‌ను సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి.

### భద్రతా మండలికి 'వీటో' చిక్కు

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని అత్యంత శక్తివంతమైన భద్రతామండలి (సెక్యూరిటీ కౌన్సిల్) అధికారాలను, నిర్ణయాలను ఐదు దేశాలకు ఉన్న 'వీటో' హక్కు నిర్వీర్యం చేస్తున్నది. రష్యా, చైనా, అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్ దేశాలకు వీటో హక్కు ఉంది. ఎలాంటి ప్రతిపాదననైనా ఈ హక్కుతో పూర్తిగా తోసిపుచ్చవచ్చు. వీటో చేసిన తర్వత సదరు ప్రతిపాదనపై చర్చగానీ, తీర్మానంగానీ ఉండవు. యుకె 1989 నుంచి 2024 మార్చివరకూ ఒక్కసారి కూడా వీటో హక్కును వినియోగించుకోలేదు. కాగా, అత్యధికంగా ఈ హక్కును వాడిన దేశం రష్యా. 128 పర్యాయాలు వీటో చేసింది. అమెరికా 85 సార్లు ఈ హక్కును వినియోగించుకోగా, వాటిలో 47 ఇజ్రాయెల్‌ను రక్షించడానికే కావడం గమనార్హం. యుకె 29, చైనా, ఫ్రాన్ చెరి 18 పర్యాయాలు ఈ హక్కును వాడుకున్నాయి.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# భోపాల్ గ్యాస్ విషాదానికి 40 ఏళ్లు

భోపాల్‌లో రసాయనిక క్రిమిసంహారక మందు సెవిన్ ఉత్పత్తిచేసే అమెరికా బహుళజాతి కంపెనీ యూనియన్ కార్బయిడ్ భారతీయ సబ్సిడయరీ యూనియన్ కార్బయిడ్ ఇండియా లిమిటెడ్ ఫ్యాక్టరీలో విషపూరిత మిక్ (ఎంఐసి) గ్యాస్ లీక్ అయి మహా పారిశ్రామిక వినాశంగా స్థిరపడిపోయిన భోపాల్ విషాదానికి డిసెంబర్ 2/3 తేదీ 40వ వార్షికోత్సవం. ఆ విపత్తు భారతీయుల స్మృతినుండి దాదాపు మరుగుపడింది. దాని వార్షికోత్సవం సందర్భంలో కొందరు గుర్తుచేసుకుంటున్నారు. కాని ఆ గ్యాస్ లీక్ బాధితుల బాధలు అనంతంగా కొనసాగుతూనే ఉన్నాయి. భవిష్యత్ తరాలు ఆ బాధలకు, వ్యధలకు గురవుతూనే ఉన్నారు. పుట్టేపిల్లలకు అంగవైకల్యం, పునరుత్పత్తి దోషాలు, కేన్సర్, మానసిక అనారోగ్య సమస్యలు వెంటాడుతూ నే ఉన్నాయి. 1984 డిసెంబర్ 2/3 రాత్రి ఫ్యాక్టరీ స్టోరేజి ట్యాంకు నుండి లీక్ అయిన విషవాయువులు శీఘ్రంగా వ్యాప్తి చెందాయి. భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 56లో 36 వార్డులు ఇందుకు గురయినాయి. ఆ వినాశం అదేరోజు రాత్రి 2వేలమందికిపైగా ప్రాణాలు హరించినట్లు అంచనా. తదుపరి సంవత్సరాల్లో 20 వేలమంది చనిపోయారు. 5,50,000 మంది తీవ్రమైన గాయాలపాలైనారు. ఇది నగర జనాభాలో 60శాతంపైమాటే!

విపత్తు జరిగిన నాలుగురోజుల తదుపరి యూనియన్ కార్బయిడ్ కార్పొరేషన్ చైర్మన్, సిఇఒ వారెన్ ఆండర్సన్ భోపాల్ వచ్చారు. పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. అయితే ఢిల్లీ నుండి సీనియర్ రాజకీయ నాయకుని ఆదేశంపై కావచ్చు – అరెస్టు చేసిన కొద్దిగంటలలోనే అతన్ని విడిచిపెట్టారు. ఆయన క్షేమంగా స్వదేశం వెళ్లిపోయారు. యూనియన్ కార్బయిడ్‌పై క్రిమినల్ కేసు నిమిత్తం ఆండర్సన్‌ను భారత్‌కు అప్పగించాలన్న విజ్ఞప్తిని వాషింగ్టన్ 1992లో తిరస్కరించింది. 2011లో చేసిన మరో విజ్ఞప్తి పెండింగ్ లో ఉండగా 2014 సెప్టెంబర్‌లో అతడు చనిపోయాడు. భారత ప్రభుత్వం 1985లో భోపాల్ గ్యాస్‌లీక్ డిజాస్టర్ (ప్రాసెసింగ్ ఆఫ్ క్లెయిమ్స్) చట్టం ఆమోదించింది. యూనియన్ కార్బయిడ్‌పై సివిల్ లిటిగేషన్‌లో బాధితుల తరఫున ప్రాతినిధ్యం వహించే అధికారాన్ని ఆ చట్టం పూర్తిగా ప్రభుత్వానికిచ్చింది. 1989లో భారత ప్రభుత్వం చేసుకున్న పరిష్కారం ప్రకారం యూనియన్ కార్బయిడ్ ప్రభుత్వానికి 47కోట్ల అమెరికన్ డాలర్లు చెల్లించటానికి అంగీకరించింది. బాధితులతో సంప్రదించకుండా, వారి ఆమోదం పొందకుండా భారతప్రభుత్వం ఈ పరిష్కారం చేసుకుంది. అందుకు బదులుగా యూనియన్ కార్బయిడ్ అన్ని లయబిలిటీల నుండి విముక్తి పొందింది.

ప్రజాపక్షం
01-12-2024, ఆదివారం

బాధితులు అమెరికా కోర్టుల్లో పరిహారం కోసం కేసులు వేయటం కష్టసాధ్యం, పరిష్కారం దీర్ఘకాలం పడుతుంది, వ్యయభరితం కాబట్టి వారి తరఫు న ప్రభుత్వమే పరిష్కారం కుదుర్చుకున్నట్లు అప్పట్లో చెప్పబడింది. బాధిత కుటుంబాలకు – వ్యక్తి మరణిస్తే రూ.1లక్ష, జీవితకాల గాయాలైనవారికి రూ.25వేలు ప్రభుత్వం చెల్లించింది. రాష్ట్రప్రభుత్వం 1985లో గ్యాస్ విషాదం బాధితుల పునరావాస డిపార్టుమెంట్ ఏర్పాటు చేసి దీర్ఘకాల వైద్య సహాయ కార్యక్రమం అమలు చేస్తున్నది. భర్తను కోల్పోయిన స్త్రీలకు నెలకు రూ.200 పెన్షన్ ఇస్తున్నది. 1992లో 2486 ఇళ్లతో గ్యాస్ విధవా కాలనీ నిర్మించింది. పరిహారం అంతే. ఫ్యాక్టరీ స్థలంలోని శిథిలాలను కంపెనీ తొలగించలేదు, ప్రవేశాన్ని విషరహితం చేస్తూ శుభ్రం చేయలేదు. కొందరు బాధితులు పోరాడుతూనే ఉన్నారు.

ఒక అమెరికన్ బహుళజాతి కంపెనీని అమెరికా కోర్టుల్లో దోషిగా నిలబెట్టి అమెరికా చట్టాల ప్రకారం భారీ పరిహారం రాబట్టేందుకు ఆనాటి ప్రభుత్వం ప్రయత్నించలేదు. అటువంటి విపత్తులు భవిష్యత్‌లో జరిగితే సంబంధిత కార్పొరేట్‌పై బాధ్యత ఉంచి ముక్కుపిండి భారీ పరిహారం రాబట్టగల విధానాలను, చట్టాలను ఈనాటివరకు ఏ ప్రభుత్వమూ ఆమోదించలేదు.

ఆనాటి నేపథ్యాన్ని స్ఫురణకు తెచ్చుకుంటే, ఆహారోత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించటం, ఆకలి, పౌష్టికాహారలోపాన్ని నివారించటం అప్పటి ప్రభుత్వ ప్రాధాన్యత. వరి, గోధుమల్లో అధిక దిగుమతి వంగడాలతో హరిత విప్లవం ఆరంభమైంది. దీనికి అతిగా భూగర్భ జలాల వినియోగంతోపాటు రసాయనిక ఎరువులు, పురుగుమందులు అవసరం. 1960ల్లో ముందుగా పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ మద్దతుతో గ్రీన్ రివల్యూషన్ ఆరంభమైంది. ఎరువులు, పురుగుమందులు మనదేశంలోనే ఉత్పత్తి చేసేందుకు యూనియన్ కార్బయిడ్ భోపాల్‌లో ఫ్యాక్టరీ నెలకొల్పింది. మన అదృష్టంకొద్దీ గడచిన నాలుగు దశాబ్దాల్లో అటువంటి పెను వినాశం మరొకటి జరగలేదు. అయితే పారిశ్రామిక విపత్తులను పూర్తిగా నివారించలేము. సంభవించినపుడు వైద్యఖర్చులు, పరిహారం, పునరావాసంలో ఆ కంపెనీల బాధ్యత ఏమిటన్నదే ప్రశ్న. అటువంటి వినాశనాలను స్మరించుకున్నప్పుడే సరైన గుణపాఠాలు తీసుకోగలుగుతాం. భోపాల్ గ్యాస్ లీక్ విషాదంలో అసువులు బాసిన వారికి జోహారులర్పించుదాం!

# సర్కార్ స్కూళ్లు, హాస్టళ్లు అంటే సమస్యలేనా?



**కసిరెడ్డి మణికంఠ రెడ్డి**
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో ఇటీవల సర్కార్ స్కూళ్లు, హాస్టళ్లలో నాణ్యతలేని భోజనం తిని విద్యార్థులు అనారోగ్యం బారిన పడడం ఆందోళనకు గురిచేస్తోంది. నిత్యం ఏదో ఒక స్కూల్‌లో, హాస్టల్‌లో ఇలాంటి ఘటనలు జరగడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. సర్కార్ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో కేవలం అత్యంత నిరుపేదలైన విద్యార్థులే చదువుతున్నారు. అందులోనూ 90 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన వారే. వీళ్లకు పెట్టే భోజనంలో నాణ్యత ఉండడం లేదు. ఉడికీ ఉడకని అన్నం, రుచిలేని నీళ్ల చారు, కూరలు తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఇలా అక్టోబర్ 30న కుమ్రభీం అసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాలలో సహచర విద్యార్థులతో భోజనం చేసిన శైలజ(16) అదే రోజు తీవ్ర అస్వస్థతకు గురై నిమ్స్‌లో 21 రోజుల పాటు చికిత్స పొందుతూ చనిపోయింది. గత 11నెలల్లో వందలాది మంది విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలయ్యారు.

హాస్టల్లో ఉంటూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో దవాఖానల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రధాన న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చేవరకు ప్రభుత్వం స్పందించలేదు. అప్పుడు కూడా కేవలం పైపై తనిఖీలు చేసి వస్తారా లేక శాశ్వత సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తారా?. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల పట్ల ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం ఏది? రాష్ట్రంలో ముఖ్యమంత్రివద్దే విద్యాశాఖ ఉన్నా ఫలితం లేకుండా పోయింది. నిత్యం హాస్టళ్లల్లో, పాఠశాలల్లో జరుగుతున్న ఘటనలకు బాధ్యులు ఎవరు?

'ఇదేం వంట, ఇదేం అన్నం, అన్నం ముద్దవ్వడం, నీళ్ల చారు, కుళ్లిపోయిన కోడిగుడ్లు ఇవి ఎట్లా తినమంటారంటూ' విద్యార్థులు మొత్తుకునే ఆకలికేకలు ప్రభుత్వానికి వినిపించడం లేదా? వినిపిస్తే ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారు? రాష్టంలో నిత్యం ఏదో ఒక గురుకులంలో, ఏదో ఒక సంక్షేమ హాస్టల్‌లో, కెజిబివిలల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవడం, పాముకాటు జరగడం, వండిన వంటల్లో బొద్దింకలు రావడం ఇలా నిత్యం ఏదో ఒకటి జరుగుతూనే ఉంది. ఏ గురుకులంలో, ఏ పాఠశాలలో, ఏ హాస్టల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రుల్లో భయాందోళనలు ఉంటున్నాయి. రాష్ట్రంలో గత 11నెలలుగా 38సార్లు ఫుడ్ పాయిజన్‌లు అయి, 886 మంది విద్యార్థులు అస్వస్థతకు గురిఅయిన పరిస్థితి. రాష్ట్రంలో దాదాపు పదిపైగా జిల్లాలో ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అన్ని రకాల హాస్టళ్లు కలిపి దాదాపు 1200పైన ఉంటాయి. ఆహారం కల్తీ కావడానికి నాసిరకం సరుకులే ప్రధాన కారణం.

కొందరు కాంట్రాక్టర్లు నాణ్యతలేని సరుకులను సరఫరా చేయడం వల్ల ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్నాయి అనే విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా ఒక రోజు ఒక మెనూ పాటించడం లేదని మధ్యాహ్నం భోజనంలో సాంబార్‌తో సరిపెడుతున్నారని ఇదేంటి మెనూ ప్రకారం వంట చేయడం లేదని అడిగితే కాంట్రాక్టర్లు ఇవ్వే



సప్లై చేశారు. అదే మేం వండామంటూ వంట కార్మికులు చెప్పే పరిస్థితి. కాంట్రాక్టర్లను అడిగితే బకాయిలు సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్నాయి ఎలా తెమ్మంటారంటారు అని వారు వాపోతున్నారు. ఫుడ్ పాయిజన్ జరిగిన పాఠశాలలోనే వారం పరిధిలో మూడుసార్లు జరగడం అంటే ఎంత నిర్లక్ష్యం అనేది అర్థం చేసుకోవాలి. అన్నం మాడిపోవడం, అన్నంలో రాళ్లు రావడం, అన్నం ముద్దలవ్వడం, కూరగాయలు కుళ్ళిపోవడం, వంటల్లో బొద్దింకలు రావడం వల్ల ఫుడ్ పాయిజన్‌లు జరుగుతూనే ఉన్నాయి.

**అధ్వానంగా కిచెన్లు..** ఇవేకాక వంటగదిలో ఎలుకలు ఆహార వస్తువుల్లో తలదాచడం, వంట గదులు మొత్తం అపరిశుభ్రంగా ఉంటున్న పరిస్థితి. ఫుడ్ పాయిజన్ కావడానికి ఇంకా చాలా రకాల సమస్యలున్నాయి. అద్దె భవనాల్లో ఉన్న వాటికి సరిపడ గదులు, మౌలిక సదుపాయాలు ఉండవు, అపరిశుభ్రమైన బాత్రూంలు ఉంటాయి. అంతేకాకుండా హాస్టళ్లకు పాఠశాలలకు ప్రహరీగోడ లేకపోవడం మూలంగా పాములు, బొద్దింకలు రావడం, పిచ్చి చెట్లు ఉండడం వాటితో అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంటోంది.

రాష్టంలో ఇంటర్నేషనల్ విద్య అందిస్తామంటూ చెప్పడు ఏమో కానీ మీరు సంక్షేమాన్ని మాత్రం విస్మరిస్తున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లి సమస్యను పరిష్కరిస్తాం పునరావృత్తం కాకుండా చూస్తాం అని మాట్లాడకుండా అన్ని రకాల సమస్యలను గుర్తించి అప్పుడే సమస్య పరిష్కరిస్తే సమస్యలు ఉండవు.

**సిఎం సమీక్షించాలి, ప్రజాప్రతినిధులు సందర్శించాలి**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సిఎంగా ఉన్న రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉంది. అలాగే ఎస్‌సి, గిరిజన సంక్షేమ, మైనార్టీ శాఖలను కూడా రేవంత్ రెడ్డి తనవద్దే ఉంచుకున్నారు. అలాంటప్పుడు మార్పు ఉంటుందని భావిస్తే అంతా శూన్యం కనబడుతుంది. చాలా ఏళ్ల తర్వాత విద్యార్థి సంఘాల పోరాటం మేరకు ఆశించినంత స్థాయి లో కాకుండా కొంతమేర మెస్, కాస్మోటిక్ చార్జీ లు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెంచారు. అయినా ఫుడ్ పాయిజన్‌లు ఎందుకు జరుగుతున్నాయో సిఎం తెలుసుకోవాలి. వరుసగా విద్యార్థులకు ఫుడ్ పాయిజన్లు జరుగుతున్నప్పుడు ఆయా శాఖల కార్యదర్శులతో సిఎం సమీక్ష నిర్వహించి ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు కనుక్కొని కింది స్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుంది. ముఖ్యంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి కొత్త భవనాలు నిర్మాణం చేయడం, ప్రతి గురుకులంలో స్వచ్ఛమైన తాగునీటి కొరకు ప్లాంట్ల ఏర్పాటు, హాస్టళ్లకు సరఫరా అవుతున్న వస్తువులను ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో నిత్యం తనిఖీలు చేయించాలి, ప్రభుత్వం ఇచ్చే రోజువారి మెనూ అమలు అయ్యేలా చూడాలి. విద్యార్థుల భోజనశాల, వంటగది, స్నానపు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేలా ఆయా నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలి, విద్యార్థుల్లో భయాందోళనలు, ఆత్మహత్యల నివారణకు మానసిక ఆరోగ్య నిపుణులతో సెమినార్లు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలి. రాష్ట్రంలో సంక్షేమ గురుకులాలు, కెజిబివి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి.

# ప్రజాభిప్రాయమే దిక్సూచిగా...

గడిచిన వారంలో మూడు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అందులో ఒకటి లగచర్లలో ఫార్మా విలేజి కోసం భూ సేకరణ ఉపసంహరణ. రెండవది, స్కిల్స్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100కోట్లను రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించబోమని ప్రకటించటం. అలాగే నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ అనుమతి రద్దు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడం మూడవది. ఈ మూడు కూడా ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు. వాటిలో లగచర్ల భూసేకరణ, ఇథనాల్ కంపెనీ ఏర్పాటు విషయంలో స్థానిక ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రభుత్వ అధికారులపై దాడివరకు వెళ్ళింది. అయితే, ఇదేమి ప్రభుత్వ వ్యతిరేకతగా భావించనక్కర్లేదు. పైగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మనోభావాలను అనుసరించి సరైన నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సమయంలోనే ఇవి చోటు చేసుకోవటం గమనార్హం. రెండు, మూడు వారాల క్రితమే లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఘర్షణ చోటు చేసుకొని వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడి జరిగింది. దీనిపై వాస్తవాలను తెలుసుకునేందుకు వామపక్ష పార్టీల బృందం అక్కడికి వెళ్ళి స్థానికులను అడిగి విషయాలు తెలుసుకున్నారు. వారు ఫార్మా కంపెనీల ఏర్పాటుపై ఏ మాత్రం సుముఖత వ్యక్తం చేయలేదు. పైగా పంట పొలాలు ఇవ్వడంపై కూడా సంశయం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని వామపక్ష నేతలు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం నేతృత్వంలో వామపక్ష పార్టీల ప్రతినిధి బృందం గత శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వివరించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి లగచర్లలో ఫార్మా విలేజిని రద్దు చేస్తామని తొలిసారిగా వామపక్ష నేతలతోనే పంచుకున్నారు. తన స్వంత నియోజకవర్గం అభివృద్ధికోసమే తాను తాపత్రయపడుతున్నానని, వారిని ఇబ్బంది ఎందుకు పెడతానని అన్నారు. ఫార్మా విలేజికి బదులుగా బహుళార్థ సాధక పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి, స్థానికాభివృద్ధి, ఉపాధికి బాటలు వేస్తామని తన మనోగతాన్ని వామపక్షాలతో పంచుకున్నారు. అయితే, పంట భూములు తీసుకోవద్దని, అవసరమైతే తగు పరిహారం, భూమికి భూమి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ పలు సూచనలు చేయగా, సిఎం సానుకూలత వ్యక్తం చేశారు. ఆయన హామీ మేరకు లగచర్ల , పోలేపల్లి గ్రామాలలో ఫార్మా విలేజీని రద్దుచేసి, అందుకు చేపట్టిన భూసేకరణకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. వెన్వెంటనే పోలేపల్లిలో 72 ఎకరాల భూమిని బహుళార్థ సాధక పారిశ్రామికవాడ కోసం సేకరించేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గతానుభవాన్ని దృష్టిలో పెట్టుకొని బహుశా దీనిపై కసరత్తే చేసి ఉంటుంది. గతంలో కంటే మూడింతలు పరిహారం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ వర్గాల నుంచి ఇప్పటికే సంకేతాలు కూడా వెలువడ్డాయి. ఏదైనా ముఖ్యమంత్రి తన స్వంత నియోజకవర్గంలోనే ఈ పని చేస్తున్నారంటే, ఆషామాషీగా ఉండకపోవచ్చు. పారిశ్రామికవాడకు సమీకరించే భూమికి ఎకరాకు రూ.20లక్షల పరిహారం ఇస్తామని, కుటుంబానికి ఒక ఉద్యోగం ఇస్తామని శనివారం మహబూబ్‌నగర్‌లో రైతుపండుగ సభలో రేవంత్‌రెడ్డి ప్రకటించారు కూడా.

ఇక రెండవది, సిఎం రేవంత్ రెడ్డి మానసపుత్రిక స్కిల్స్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్‌కు పారిశ్రామిక వేత్త అదానీ రూ.100కోట్లు ప్రకటించారు. ఒకవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ తీవ్రంగా అదానీని వ్యతిరేకిస్తుండడం, మరోవైపు ఆయనను రాష్ట్రంలో పరిశ్రమలకు ఆహ్వానిస్తుండడం, నిధి స్వీకరించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధి నుంచి ఇస్తుండడం తో వ్యతిరేకత వ్యక్తం కాలేదు. సోలార్ విద్యుత్ కాంట్రాక్టు కోసం అదానీ గ్రూపు భారతదేశంలోలంచాలు ఇచ్చిందని

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

అమెరికా న్యాయ విభాగం కేసు ఫైల్ చేయటంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అదానీ ఇస్తామన్న రూ.వంద కోట్లను స్వీకరించబోమని ప్రకటించడం సానుకూలాంశం. మూడవ అంశం, దిలావర్పూర్‌లో ఇథనాల్ కంపెనీ ఏర్పాటుపై తీవ్రస్థాయిలో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండానే, ఏకప క్షంగా ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు , దాని చుట్టూ ప్రహరీ గోడ కడుతుండడంతో స్థానికులు భగ్గుమన్నారు. ఆ కంపెనీని కట్టేందుకు వీలు లేదని ఆందోళనకు దిగారు. చివరకు మంత్రి సీతక్క జోక్యం చేసుకొని హామీ ఇవ్వటం, కంపెనీని అనుమతించబోమని కలెక్టర్ ప్రకటించడంతో ప్రజలు సద్దుమణిగారు. అటు లగచర్ల, ఇటు దిలావర్పూర్‌లో రెండు కీలకాంశాలు చోటు చేసుకున్నాయి.

లగచర్ల లో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులపై దాడులు జరగగా, దిలావర్పూర్‌లో ఆర్‌డివో వాహనంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ రెండు అంశాలలో బిఆర్‌ఎస్ పాత్ర చర్చనీయాంశంగా వచ్చింది. లగచర్లలో బిఆర్‌ఎస్ నేతలే ప్రజలను రెచ్చగొట్టడంతో ఆ ఘటన జరిగిందని పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. దిలావర్పూర్‌లో మొత్తం వ్యవహారానికి కారణమైన ఇథనాల్ కంపెనీకి ఆగమేఘాల మీద అనుమతినిచ్చిందే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం. ఆ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ, ఇతర మినహాయింపులను కూడా ఇచ్చింది. ఇందుకు సంబంధించి గత ప్రభుత్వంలో సర్క్యులేట్ అయిన పత్రా లు వెలుగులోకి కూడా వచ్చాయి. అలాగే స్వయంగా నాటి మంత్రివర్గ సభ్యుడైన తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారు. తన కుమారుడు కొంత కాలమే డైరెక్టర్‌గా ఉన్నాడని, తరువాత రాజీనామా చేసాడని ఆయన వివరణ ఇచ్చినా, వారి పాత్ర లేదనడానికి అది అంతగా అతకలేదు. డైరెక్టర్‌లలో ఆయన వియ్యంకుడు ఇంకా కొనసాగుతున్నాడు. అంటే ఆయన కుటుంబంతో సంబంధాలు ఉన్న వ్యక్తులు ఆ ఫ్యాక్టరీ వెనుక ఉన్నారనేది వాస్తవం. అదే బిఆర్‌ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై సన్నాయినొక్కులు నొక్కుతుంది. మరోవైపు మాగనూర్‌లో ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు మరోసారి అస్వస్థతకు గురయ్యారనే వార్త ఆందోళన కలిగిస్తున్నది. దీని వెనుక కూడా బిఆర్‌ఎస్ నేతలు ఉన్నారని స్వయంగా మంత్రి కొండా సురేఖ ఆరోపించారు.

రాష్టంలో ఏ అంశం వివాదాస్పదమవుతున్నా, అందులో బిఆర్‌ఎస్ పాత్రపై సందేహాలు ముసురుతున్నాయి. మంత్రులే నేరుగా ఆ విషయాన్ని చెబుతుండడం ఆందోళన కలిగించేదే. ఇదే నిజమైతే వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలే తప్ప రాజకీయ ఆరోపణలుగా మిగిలిపోతే ప్రభుత్వానికే ఇబ్బంది. ఏదేమైనప్పటికీ ప్రజల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం కాస్త తగ్గడం మంచి పరిణామాలే. లగచర్ల కావొచ్చు, దిలావర్పూర్ కావొచ్చు, అదానీ స్కిల్స్ యూనివర్సిటీకి ఇస్తామన్న వంద కోట్ల నిధి విషయం కావొచ్చు. ప్రభుత్వం ప్రాప్తకాలజ్ఞతతో వ్యవహరించి ఉపసంహరించుకుంది. గతంలో హైడ్రా పేదల ఇళ్ళ కూల్చివేతల అంశంలో కూడా ప్రజల అభిప్రాయాన్ని గౌరవించింది. గత ప్రభుత్వం అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టినప్పటికీ, ప్రజాస్వామిక ఆకాంక్షలను గౌరవించకపోవడంతోనే వ్యతిరేకత కొనితెచ్చుకుంది. ఎన్నికలకు ముందు, గెలిచిన తరువాత కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు అదనంగా ఏడవ గ్యారంటీని అమలు చేస్తామన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన పాలన అందిస్తామని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో రాజీపడబోమనే ఏడవ గ్యారంటీని ప్రకటించారు. తాజా నిర్ణయాలు ఆ కోవలోనే ఉన్నాయి. పొరపాటు చేయటం సహజం. దానిని సవరించుకోవడంలోనే గొప్పతనం ఉంది. ప్రజలు కూడా దానిని సానుకూలంగానే తీసుకుంటారని చరిత్ర నిరూపిస్తుంది.



## ఇన్నర్ రింగ్‌రోడ్ పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని ఇన్నర్ రింగ్‌రోడ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని భారీనీటిపారుదల,పౌరసరఫరాల శాఖామాత్యులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్,వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి పలువురు నాయకులు హైదరాబాద్‌లోని మంత్రి ఉత్తమ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుజూర్‌నగర్ పట్టణంలో మిగిలిన ఇన్నర్ రింగ్‌రోడ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, కోర్టు వివాదంలో ఉన్నటువంటి ఇండ్ల యజమానులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు 28 వార్డులల్లో ప్రణాళికలు తయారు చేయాలని,ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎటువంటి బేషజాలకు పోకుండా అభివృద్ధి కొరకు అందరినీ కలుపుకుని ముందుకు వెళ్ళాలని సూచించారు. యావత్ తెలంగాణ రాష్ట్రంలోనే హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వల్లపుదాసు కృష్ణ గౌడ్,సులువ చంద్రశేఖర్, పార సాయి,రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న అధికారుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని హైద్రాబాద్ ఇంజనీరింగ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జీలు పల్లె పిచ్చయ్య, ఆంజనేయులు, రామకృష్ణలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కొమ్ము స్వామి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా హరికృష్ణ, ధరావత్ బాలు నాయక్, సహాయ కార్యదర్శులుగా వెంకట హర్ష, పద్మవతి, కార్యదర్శులుగా రెడ్డిమల్ల నగేష్, కార్యవర్గ సభ్యులుగా తిరుమలేష్, చందన, మహేష్, స్వరూపలను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా పాండు నాయక్, టిఎన్‌జిఓఎస్ నాయకులు మల్సూర్, పిడమర్తి లింగయ్య, రవి కిరణ్, ఉదయ్, స్వప్న, చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్ కారకులను శిక్షించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ప్రభుత్వం సంక్షేమ హాస్టల్‌లు, పాఠశాలల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వారిని శిక్షించాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. శనివారం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా అధికారులను విధుల నుండి తొలగించాలన్నారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఫుడ్ పాయిజన్ జరుగుతుందన్నారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు విజయ్, వినయ్, నగేష్, వివేక్, సాయి, శ్రీకాంత్, రాజు, రెహమాన్ పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబాలకు బాసటగా భద్రత స్కీం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పోలీసుల కుటుంబాలకు భద్రత స్కీం బాసటగా నిలుస్తుందని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ రెడ్డి అకాల మరణంతో ఆయన కుటుంబ సభ్యులకు భద్రత స్కీం రూ. 8లక్షల చెక్కును ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడు పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, ఏఓ మంజు భార్గవి, పోలీసు సంఘం కార్యదర్శి వెంకన్న, సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, సిబ్బంది ఉన్నారు.

## చురుకుగా సభ్యత్వ నమోదు



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో శనివారం జరిగిన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కూనూరు సంజయ్‌దాస్ పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత బిజెపితోనే సాధ్యమవుతుందని, బిజిపి పట్ల యువత ఎక్కువగా ఆకర్షితులు కావడం హర్షనీయమని అన్నారు. ప్రజలు తెలంగాణలో బిజెపిని ఆదరించాలని, పార్టీ సభ్యత్వాలను తీసుకోవాలని కోరారు. ఆయన వెంట లీగల్ సెల్ నకిరేకల్ ఇంఛార్జ్ గుండాల నరేష్, పార్టీ జిల్లా కార్యదర్శి బొడిగె అశోక్, సీనియర్ నాయకులు కన్నెబోయిన మహాలింగం, వెల్దుర్తి రాజు చారి, నారబోయిన నర్సింహ్మాయాదవ్, బాసోజు రాము పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ 'పది'లో ప్రవేశానికి మరోక అవకాశం

**ప్రజాపక్షం/తుర్కపల్లి:** గతంలో ప్రవేశం తీసుకోక అవకాశం చేజార్చుకున్న వారికి మరొకసారి అవకాశం ఇస్తూ డిసెంబర్ 11వ తేదీ వరకు అపరాధ రుసుముతో ప్రవేశం పొందవచ్చునని తుర్కపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సెంటర్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ బిక్షమయ్య తెలిపారు. ఇతర వివరాలు, సమాచారం కొరకు 9985795778 ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# ప్రాధాన్యత రంగాలకు అధిక మొత్తంలో రుణాలు

### పంట రుణాల లక్ష్యాన్ని సాధించినందుకు అభినందనలు

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రాధాన్యత కలిగిన రంగాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి బ్యాంకులు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశమందిరంలో డిసిసి, డిఎల్ఆర్సీ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ చింతల బాపూజీ మాట్లాడారు. వార్షిక ప్రణాళిక సంబంధించిన 2024/25 సంవత్సర లక్ష్యం 8994.16 కాగా రెండవ త్రైమాసానికి 5700.39 కోట్లు, 63.38శాతం లక్ష్యాలను సాధించారని, వ్యవసాయ రుణాలకుగాను గ్రాఫ్ లోన్స్ 84.65 శాతం రెండవ త్రైమార్షికలో లక్ష్యం సాధించారని తెలిపారు. ఈ సంవత్సరానికి 2942.48 కోట్లు లక్ష్యం కాగా రెండవ త్రైమార్షికానికి 2490.73 కోట్లు సాధించడం జరిగిందని దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకుగాను 97.13శాతం సాధించడమైందని, సంవత్సర కాలానికిగాను 1004.8కోట్లు లక్ష్యంగా కాగా 976 కోట్లు వ్యవసాయ రంగాలకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రాధాన్యత రంగాలకు రెండవ త్రైమార్షికంలో 62.17 శాతం పూర్తి చేశారని, ఈ సంవత్సరం లక్ష్యం 7570.66 కోట్లుకుగాను 4706.62 కోట్లు ప్రాథమిక రంగాలకు రుణాలు అందజేశామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలకు బ్యాంకర్లు అధిక రుణాలు ఇవ్వాలని, జిల్లాలోని కొన్ని బ్యాంకులు తమ లక్ష్యాన్ని సాధించడంలో సహకరించడం లేదని వారి సహకారాన్ని పూర్తిగా అందించాలని ఆదేశించారు. డిఆర్‌డిఓ వివి అప్పారావు మాట్లాడుతూ బ్యాంకర్లు మహిళా సంఘాలకు 300 కోట్లు అందించారని పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. 300 మంది లబ్దిదారులకు ఎస్‌సి కార్పొరేషన్ లోన్లు కొరకు దరఖాస్తు చేసుకున్న 269 మందికి రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. డిటిడిఓ శంకర్ మాట్లాడుతూ 54 మంది ఎస్‌టి అభ్యర్థులు రుణం కోసం దరఖాస్తు చేసుకొగా 33 మందికి రుణాలు మంజూరు చేయసినట్లు తెలిపారు. వివిధ కారణాలతో 21 మంది రుణాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బిఐ ఏజిఎం గౌతమి నవార్డు, డిడిఎం సత్యనారాయణ, ఎస్‌బిఐ ఆర్‌ఎం ఉపేంద్ర భాస్కర్, యూబిఐ డిజిఎం హనుమంతరెడ్డి, ఎడిఎస్‌సి కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్ నాయక్, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్, అన్ని బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఆందోళన : పల్లా

**ప్రజాపక్షం నల్లగొండ టౌన్:** గత ఆరు నెలలుగా పెండింగ్ లో ఉన్న మిషన్ భగీరథ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వానికి కోరారు. శనివారం అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ మిషన్ భగీరథ ఎస్ ఈడి వెంకటేశ్వర్లు కు మెమోరాండం ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు గత మూడు నుంచి ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకుండా కార్మికులను తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇల్లు కిరాయి కట్టుకోలేక స్కూల్ ఫీజులు కట్టలేక కుటుంబం బారమై ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ కూడా కాంట్రాక్టర్లు వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయం అని అన్నారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తు ప్రజలకు నీళ్లు తాగు నీళ్లు అందిస్తూన్నప్పటికీ వారి కుటుంబాల గురించి ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమనీ అన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించకపోతే డిసెంబర్ మొదటి వారంలో ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎండి జానీ బత్తుల వెంకటేశం , దయాకర్,నిమ్మనగోటి శీను, పాక శీను విజయ్ కుమార్, నాగరాజు, రామకృష్ణ,రవి, ఆగు సైదులు మల్లేష్ నాగరాజు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తున్న పాలకులు

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంజి వీరస్వామి




**ప్రజాపక్షం/తుర్కపల్లి:** వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంజి వీరస్వామి డిమాండ్ చేశారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని జెఎం ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ కార్మికుల హక్కులు కాలరాయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిగా పెట్టుకున్నయని, పేద ప్రజలు, ఉపాధి కార్మికులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని విడనాడాలని ఆయన అన్నారు. మండలంలో కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి పేద ప్రజలకు భూములు అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పలుకుబడితో భూ కబ్జాలు చేసే వాళ్లపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందించాలని, రుణమాఫీ కానీ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల అభివృద్ధికై ప్రభుత్వాలు పాటుపడాలని కోరారు. అనంతరం మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చేనూరి కైలాష్, ప్రధాన కార్యదర్శిగా పాంగల బాలరాజ్, సహాయ కార్యదర్శిగా సిలువేరు రజిత, చీనూరి పెంటయ్య, ఉపాధ్యక్షులుగా పట్నం అంజయ్య, బానోతు లక్ పతి, సిలువేరు స్వరూప, కోశాధికారిగా కొండ అంజమ్మ, కాశబోయిన పెద్దులులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య, సీనియర్ నాయకులు గుంటుపల్లి సత్తయ్య, బొట్టు భూమయ్య, పాండాల బిక్షపతి, గడ్డమీద రాములు, గుజుక మహిపాల్, భత్తుల కుమార్, నాగారం కిష్టయ్య, నీలం జహంగిర్, భానోత్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పోటీకి సిద్ధం




**ప్రజాపక్షం/మర్రిగూడ:** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం అని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం సిపిఐ మండల కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశము ఎరుకలి యాదయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 2025 సభ్యత్వము పూర్తిచేసి అన్ని గ్రామాలలో గ్రామ శాఖల సమావేశాలు నిర్వహించి డిసెంబర్ 30న నల్లగొండ లోని ఎన్ జి డిగ్రీ కళాశాలలో నిర్వహిచే భారీ బహిరంగ సభ పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను ప్రజలను తరలించాలని కోరారు. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పోటీకి సిద్ధం కావాలన్నారు. కార్యవర్గ సభ్యులు అహర్నిశలు శ్రమించి కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎరుకలి నిరంజన్, కొండ్రెడ్డి గిరి, బుర్ర శేఖర్, ఎరుకలి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ విలువలను బిజెపి ధ్వంసం

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి ధ్వజం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాజ్యంగ విలువలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుమంగళిఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న జిల్లా మహాసభలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మరోపక్క అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని పొగుడుతున్నారన్నారు. రాజ్యాంగంలో మూల సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయంవంటి వాటిని తుంగలో తొక్కుతుందన్నారు. ఒకే దేశం, ఒకే పన్ను, ఓకే మతం, ఓకే ఎన్నిక అంటూ రాజ్యాంగా విలువలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో రాజ్యాంగాన్ని అణలు చేయకుండా ఆర్ఎస్ఎస్ సిద్దాంతాన్ని అమలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని చిత్తశుద్దితో అమలు చేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం వెంటనే కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యాదగిరిరావు తీర్మానం పెట్టగా కోట గోపి బలపర్చారు. ఈ మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, పారేపల్లి శేఖర్ రావు, మేదరమెట్ల వెంకటేశ్వర్ రావు, నాగారపు పాండు, మట్టిపల్లి సైదులు, కో టగోపి, దండా వెంకట్ రెడ్డి, చెరుకు ఏకలక్ష్మి, జ్యోతి, కోట రమేష్, పిట్టల రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రైతు పండుగతో రైతుల్లో ఉత్సాహం

**ప్రజాపక్షం / గద్వాల :** మహబూబ్ నగర్‌లో జరిగే రైతు పండుగకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జోగులాంబ జిల్లా నుండి సుమారు 100 బస్సులు ఏర్పాటు చేశారు. రైతు పండుగలో పాల్గొనడానికి 5000 మంది రైతులు తరలివెళ్లారని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్ నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగ రైతులకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. అలాగే ప్రయాణ సమయాల్లో రైతులకు బోజనం, త్రాగునీరు, అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారి,నోడల్ అధికారి, ఒక కానిస్టేబుల్,నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీ నాయరాయణ, నర్సింగరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్,మండల స్థాయి అధికారులు,ఏపిఎంలు రైతులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

### ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ నిరసిస్తూ విద్యా సంస్థల బంద్... ఎఐఎస్‌ఎఫ్..ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు సక్సెస్




**ప్రజాపక్షం/దేవరకొండ:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి పట్ల ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం దేవరకొండలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం చేశారు. రాష్ట్రంలో ని ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాలలో, ఆశ్రమ పాఠశాలలో, మోడల్ పాఠశాలలో, కేజీబివి హాస్టల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వారిపట్ల ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్‌లు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పరిరక్షిస్తామని ప్రగల్భాలు పలికి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో గురుకుల హాస్టల్లో , కేజిబివిలలో తరుచుగా ఫుడ్ పాయిజన్ జరిగి దాదాపు 52 మంది విద్యార్థులు మరణించడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 942 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వం వారిపట్ల మొండి వైఖరి అవలంభిస్తుందని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వీడాలని జరుగుతున్న సంఘటనలపై స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఫుడ్ పాయిజన్ వలన చనిపోయిన విద్యార్థులకు ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, యూఎస్‌ఎఫ్ఐ నాయకులు సోభన్, కిరణ్, సిద్దార్థ్, అరవింద్, చరణ్, అఖిల్, శ్రీకాంత్, సాయి కుమార్, సంతోష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** విద్యాశాఖను ముఖ్యమంత్రి దగ్గర పెట్టుకొని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం సరికాదని, విద్యార్థుల ప్రాణాలు పోతున్న పట్టించుకోరా విద్యాకామిషన్ ఎక్కడ అని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ విమర్శించారు. శనివారం వామపక్షాలు విద్యార్థి సంఘాల బంద్ పిలుపు మేరకు విద్యాసంస్థలు బంద్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు వంశి, సాయి తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/చింతపల్లి :** రాష్ట్రంలో గురుకుల విద్యాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌తో ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వానికి పట్టింపు లేదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంశొద్దిన్ విమర్శించారు. శనివారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తమ తరగతులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు వల్లవోజు కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరు:** ఫుడ్ పాయిజన్ తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ,అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ మురళికృష్ణ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల బంద్ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ముదిగొండ మురళికృష్ణ మాట్లాడుతూ చండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు లతో పాటు మరుగు దొడ్లు శుభ్రంగా లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎఫ్ జిల్లా సమాయ కార్యదర్శి ఇరిగి ప్రవీణ్ , ఏఐఎస్‌ఎఫ్ చండూరు మండల కార్యదర్శి కురుపాటి పరమేష్ , చరణ్ పల్లె నాగరాజు, సైదులు , నవీన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో, గురుకులాల్లో, ఆశ్రమ పాఠశాలలో, మోడల్ పాఠశాలలో, కేజీబివి హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వారి పట్ల ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ డిండి మండలంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు కంపల్లి భాను, ఎస్‌ఎఫ్ఐ మండల కార్యదర్శి దేవేందర్, వెంకటేష్, బన్ని, మహేష్, శివ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





## చెరువులు నింపితేనే భూగర్భ జలాలు పెరుగుతాయి

### ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సమీక్ష

**ప్రజాపక్షం/ మునుగోడు:** మునుగోడు నియోజకవర్గంలోఉన్న చిన్న పెద్ద చెరువులను నింపితేనే భూగర్భ జలాలు పెరిగి పాడిపంటలు బాగా పండుతాయి అని ప్రతి వర్షపు చినుకును ఒడిసి పట్టి చెరువులకు మళ్లించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు.శనివారం హైదరాబాదులో తన నివాసంలో నీటిపారుదల శాఖ అధికారులతో మునుగోడు నియోజకవర్గం చెరువులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు ఈ భూమి మీదనే అత్యధిక ఫ్లోరైడ్ రక్కసివున్న ప్రాంతం మునుగోడు నియోజకవర్గమని ఇక్కడ కురిసే ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి చెరువులకు మళ్ళించినట్లయితే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయం కొంత మెరుగుపడే అవకాశం ఉందని అన్నారు.నియోజకవర్గంలో ఉన్న 669 చెరువుల్లో గొలుసు కట్టు చెరువులకు నీరు వచ్చే ఫీడర్ ఛానల్ లను పటిష్టం చేయడంతో పాటు ఆయా చెరువులలో పేరుకుపోయిన పూడికను తీయడం, కట్టలను పటిష్టం చేయడం లాంటి పనులను విడతల వారీగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. దాని కోసం డిసెంబర్ నెలలో చెరువులను పటిష్టం చేయడానికి సైట్ సర్వే పూర్తి చేసి అంచనాలు రూపొందించే పని పూర్తి చేయాలన్నారు.జనవరి మాసం నుండి జులై మాసం వరకు ఆరు నెలల్లో ఎంపిక చేసిన చెరువులను పటిష్టం చేయాలన్నారు వర్షాకాలం రావడానికి ముందే చెరువులను పటిష్టపరిచేలా ప్రణాళికలు ఉండాలని కోరారు వెల్మకన్నె , శేషలేటి వాగు ఫీడర్ ఛానల్ పనుల పునరుద్ధరణ, చేయాలన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం



ప్రజాపక్షం/మక్తల్: ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పాయింజన్‌కు కారకులను శిక్షించాలని రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజనంలో అనేక మంది విద్యార్థులు అనారోగ్యాల గురైన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రి నియమించాలని వామపక్ష విద్యార్థి సంఘాల, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మక్తల్ ప్రాంతంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్ నిర్వహించి రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ రాస్తారోకోకు అజయ్ పిడిఎస్ యూ జిల్లా నాయకులు అధ్యక్షత వహించగా పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. భాస్కర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ , ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నయ్యూం, పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్య, ముఖ్యవక్తలుగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యూ నాయకులు వెంకటేష్ , రమేష్ , శివ, భానుచందర్ , అఖిల , సంగీత, అనూష, పౌర్ణమి, అంబేద్కర్ , యువజన సంఘం నాయకులు రమేష్ , తేజ, సురేష్ , రవి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహేందర్ , రమేష్ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**మాగనూరులో .....**

జడ్పీ హైస్కూల్ మాగనూరు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం విద్యాసంస్థలు బంద్ విజయవంతం అయిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహా మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ సంఘటనలపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పిలుపునివ్వడం జరిగింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగానే మాగనూరు మండల కేంద్రంలో బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు సూర్య, ప్రకాశ్ , నాయుడు, మహేష్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో .....**

ప్రభుత్వ పాఠశాలల ఫుడ్ పాయిజన్ పై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ గత నెల కాలంలోనే రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ గురుకులాలలో ఫుడ్ పాయిజన్ జరిగిన విద్యార్థులు అనారోగ్యం పాలై ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వ గురుకులాలపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆశోక్ , కిరణ్ , ఎం. శివ, సైదులు, రంజిత్ , బాలపీర్ తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తిలో ......**

రాష్ట్రంలో రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజాన్ కేసులు వెలుగుచూస్తున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం. ఆది , ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్ , పిడిఎస్‌యూ నాయకులు గణేష్ , వెంకటేష్ మండిపడ్డారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ లో భాగంగా వనపర్తి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న నాయక్ , నీలోత్పల్ , భారత్ , మోహన్ , శ్రీకాంత్ , ఆంజనేయులు, కార్తీక్ , హరీష్ , ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్ , పిడిఎస్‌యూ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

**మదనాపురంలో ....**

ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజవర్ధన్ అన్నారు. శనివార మదనాపురం , అజ్జకోలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి లేకుండా సంవత్సరం పాలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థపై సీక్షా ఏదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల బంద్ విజయవంతం



ప్రజాపక్షం/వెల్దండ : హాస్టల్ విద్యార్థులకు జరుగుతున్న ఫుడ్‌పాయిజన్ సంఘటనపై రాష్ట్రప్రభుత్వం స్పందించాలని రాష్ట్ర విద్యార్థిసంఘాల పిలుపు మేరకు మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల సంఘాల నాయకులు బంద్ విజయవంతం చేశారు. ఈసందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో, గురుకులాలు, హాస్టల్లో జరుగుతున్న ఫుడ్‌పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు బంద్ పిలుపులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు చనిపోయారని, ముఖ్యంగా గురుకుల, కేజీబివి, ఆశ్రమపాఠశాలలు, ప్రభుత్వ స్కూల్స్‌లో తరుచుగా ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఫుడ్‌పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థులకు ఎక్స్‌గ్రేషియో ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ స్కూల్లో గురుకులాలు, హాస్టల్లో నాణ్యమైన బోజనం అందించాలని డిమాండ్‌చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మధు, మల్లేష్, నితిన్, గౌతమ్ పాల్గొన్నారు.

## హెల్త్ ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ఊట్కూర్ : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒకరు హెల్త్ ఇన్స్యూరెన్స్ చేసుకోవాలని సిఎస్‌సి అధికారి అజాస్ సందపురం నరేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లో లేబర్ కార్డ్ ఉన్న వారికి హెల్త్ చెకప్ చేసి రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం కల్పించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎంఐఎఫ్ స్టాఫ్ , అజమ్మ, ఆశ, కార్యకర్త కె.లక్ష్మి , సామాజిక కార్యకర్త కె. నారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించాలి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ : డిసెంబర్ 4న నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో (83) నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఇంచార్జ్ డిఇఓపి రాజశేఖర్‌రావు తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో ఎంపికచేసిన 138ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాప్రమాణాలు తెలుసుకునేందుకు కేంద్రప్రభుత్వం 3,6,9 తప్పనిసరిగా పరీక్ష డిసెంబర్ 4న ఉదయమే ప్రార్థన సమయానికి పాఠశాలకువెళ్లి 3,6,9 తరగతి విద్యార్థులకు ఉదయం 10.30కు స్టార్ట్‌చేసి పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎమ్‌డి షర్ఫుద్దీన్, డిస్ట్రిక్‌నోడల్ ఆఫీసర్ కుర్మయ్య, నవోదయ ప్రిన్సిపాల్ భాస్కర్, డిస్ట్రిక్ట్ మాస్టర్‌ట్రైనర్స్ శోభారాణి, శ్రీనివాసులు, బిఇడి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగ పదవీవిరమణ కార్యక్రమం



ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి మండలంలోని పంజుగుల ప్రభుత్వ పాఠశాల (యుపిఎస్ పాఠశాల)లో 13 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా పనిచేసి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న పుష్పవతి యాదగిరి పదవి విరమణ పొందుతున్న సందర్భంగా శనివారం పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించారు. 13 సంవత్సరాలుగా పుష్పవతి ఉపాధ్యాయురాలిగా పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యకోసం వారు చేసిన కృషిని గ్రామపెద్దలు, విద్యార్థులు కొనియాడారు. పుష్పవతి పాఠశాలనుంచి వెళ్లిపోతున్న సందర్భంగా విద్యార్థులు ఒక్కసారిగా పుష్పవతి హత్తుకొని బోరున విలపించడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్యగౌడ్, బిఆర్‌ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దార మోనిగణేష్, పాఠశాల ఉపాధ్యాయులు రామేశ్వరయ్య, శివకుమార్, ఆంజనేయులు, ఉమాదేవి, వైడూర్య,మురళి పాల్గొన్నారు.

## ఎంపిహెచ్‌ఎ భర్తీ చెల్లవు

**1200 మంది నియామకాలపై హైకోర్టు**

ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఎ) నోటిఫికేషన్–2002కు విరుద్ధంగా 1200 మందిని కాంట్రాక్ట్ విధానంపై నియమించడాన్ని హైకోర్టు రద్దు చేసింది. 2002లో జీవో 1207 ద్వారా 1200 మందిని నియమించడం చెల్లదంది. అప్పటికే వీళ్ల నియామకాలపై ఉమ్మడి ఏపీ హైకోర్టు, సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఇచ్చాయని, వాళ్లను తొలగింపు ఉత్తర్వుల తర్వాత ప్రభుత్వం తిరిగి వాళ్లను కాంట్రాక్ట్ విధానంపై నియమించడం చెల్లదని తీర్పు చెప్పింది. కోర్టు తీర్పుల తర్వాత ప్రభుత్వం 2002లో జీవో 1207 ద్వారా భర్తీ చేయడం చెల్లదంది. వాళ్ల స్థానంలో అర్హులను 90 రోజుల్లోగా నియామకాలు చేయాలంది. అర్హులతో జాబితా సిద్ధం చేసి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుతావలను ఆదేశిస్తూ జస్టిస్ సుజయ్‌పాల్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది.

## దత్తత పిల్లల వివాదాలపై ఉత్తర్వులు

ప్రజాపక్షం/హైదరాబాద్ :పిల్లల దత్తత కోరుతూ తల్లిదండ్రుల అప్లికేషన్లను 4 వారాల్లో పరిష్కరించాలని సంబంధిత శాఖకు హైకోర్టు ఆదేశించింది. అక్రమ దత్తత, పిల్లల అమ్మకాలు జరుగుతున్నాయంటూ పోలీసులు స్వాధీనం చేసుకున్న పిల్లల సంరక్షణ విషయంపై బాలల సంరక్షణ కమిటీ రెండు వారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాంలి. ఈ మేరకు చీఫ్ జస్టిస్ బెంచ్ రెండు రోజుల క్రితం తుది ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ దత్తత చేసుకున్న పిల్లలను చట్టప్రకారం తల్లిదండ్రులకు అప్పగించాలంటూ గతంలో సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. దీనిని రద్దు చేయాలని ప్రభుత్వం అప్పీల్ వచేసింది. అప్పీల్ పిటిషన్లపై విచారణను క్లోజ్ చేసింది.

## ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/కల్వకుర్తి: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంను శనివారం మున్సిపల్ కమీషనర్ మహ్మద్‌షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వసతులు, ఆహారం, వస్తువులు నిల్వచేస్తున్న వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యాలయ ఆవరణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి బోజనం చేశారు. ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని, చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు తగుజాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివ, పురసిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ‘రిమోట్’ ప్రారంభోత్సవాలు

**143.53 కోట్ల నిధులతో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అభివృద్ధి పనులకు, శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసిన రైతు పండగ కార్యక్రమంలో పాల్గొని ఉమ్మడి జిల్లాలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.143.53 కోట్ల నిధులతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఉర్దూ ఘర్, శాదిఖాన, స్మశనా వాటికకు ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.45 కోట్ల నిధులతో శంకుస్థాపన చేశారు. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో 25 బి.టి రోడ్లకు రూ.49.90 కోట్ల నిధులతో శంకుస్థాపన చేశారు. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో 25 టి.టి రోడ్లకు రూ.49.90 కోట్లు, తాండాల నుండి గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లను బి.టి రోడ్డుగా మార్చేందుకు రూ.10.68 కోట్ల నిధులతో చేపట్టే పనులకు శంఖుస్థాపన చేశారు. మిడ్జిల్ నుండి కొత్తపల్లి కి వెళ్ళే బి.టి రోడ్డు ను రెండు వరసల రోడ్డు గా మార్చేందుకు రూ. 25 కోట్ల నిధులతో చేపట్టే పనులకు శంఖుస్థాపన చేశారు. మహబూబ్‌నగర్ పోతులమడుగు వద్ద రూ. 2.65 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన మినీ స్టేడియంక ప్రారంభోత్సవం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మానోపాడ్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అప్గ్రేడ్ కొరకు రూ.3.25 కోట్లు, నందిన్నె కే.జి.బి.వి రూ.2.70 కోట్లు, గట్టు కే జి.బి.వి.కి రూ.2.05 కోట్ల నిధులు పనులకు శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా గద్వాల సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ స్టోర్, ప్రభుత్వ వైద్య కళాశాలను వర్చువల్ గా ప్రారంభోత్సవం చేశారు.

## రైతుల పండుగ సభకు మక్తల్‌లో ప్రభంజనం



ప్రజాపక్షం/మక్తల్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంలో పాలమూరు జిల్లా కేంద్రంలో రైతు పండుగ సభకు పెద్ద ఎత్తున మక్తల్ నియోజకవర్గం నుంచి రైతన్నలు తరలివెల్లగా నియోజకవర్గ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి వాహనాలను ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యి కేవలం ఒక్క ఏడాదిలోనే రైతుల సంక్షేమం కోసం 54 వేల 280 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ కింద దాదాపు 22 లక్షల మందికి పైగా రైతులకు 18వేల కోట్లు వారి ఖాతాలో జమ చేశామని అన్నారు. దీంతో పాటు ఉచిత విద్యుత్ పెట్టుబడి సాయం రైతు బీమా, పంట నష్టం కింద ఎకరానికి రూ. 10వేలు ఆర్థిక సాయం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఇతర వ్యవసాయ సబ్సిడీల రూపంలో కేవలం ఏడాదిలోనే 54000 కోట్లుకు పైగా ఖర్చు చేశామని , ఇంత భారీ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. రైతన్నల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. రైతు పండుగ సభకు తరలిన వారిలో కాంగ్రెస్ పారర్టీ నాయకులు , కార్యకర్తలు, రైతన్నలు తదితరులు ఉన్నారు.

## ప్రజాపండుగకు తరలిన రైతులు



ప్రజాపక్షం/వెల్దండ: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపండుగ ముగింపు సందర్భంగా నిర్వహించే బహిరంగసభకు మండలపరిధిలోని అన్ని గ్రామాల రైతులు, మహిళలు, కాంగ్రెస్‌పార్టీశ్రేణులు, కార్యకర్తలుభారీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా బహిరంగసభకు వెళ్లే బస్సులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి జెండాను ఊపి బస్సుయాత్రను మండల నాయకులతోకలిసి ప్రారంభించారు. పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంచేపట్టిన నాటి నుండి ప్రజాపాలనలతో ప్రతి ఒక్కరికి అభ్యున్నతికోసం అహర్నిశలు పనిచేస్తుందన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో రాష్ట్రంలో ప్రజాపాలన పండుగ సాగించనున్నట్లు తెలిపారు. అనంతరం బస్సుల్లో , ప్రత్యేక వాహనాల్లో మహబూబ్‌నగర్ కేంద్రానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్రపొల్యూషన్‌బోర్డుసభ్యులు ఠాగూర్‌బాలాజిసింగ్, మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండోడైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్, మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రషీద్, కేశమల్లకృష్ణ, కిష్టాలు, ముదికొండ రమేష్, జక్కులచిన్నజంగయ్యయాదవ్, పుల్లయ్య, శంకర్‌నాయక్, భరత్‌గౌడ్, తహసీల్దార్ రవికుమార్, ఎంపిడిఓ సత్యపాల్‌రెడ్డి, ఎపిఎం రాములునాయక్, ఎఈ శోభారాణి, మంజుల, ఆర్.శంకర్‌నాయక్, ఏఈఓలు , కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి సమస్త సమాచారం మీ చేతుల్లోనే.. !

*** సింగరేణి సోషల్ మీడియా మాధ్యమాల క్యూ-ఆర్ కోడ్ విడుదల**

*** సంస్థ సిఎండి బలరామ్ వెల్లడి**



ప్రజాపక్షం/హైదరాబాద్ : సింగరేణికి సంబంధించిన ప్రగతి, సంక్షేమం తదితర సమాచారం ఎప్పటికప్పుడు కార్మికులకు, ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు సింగరేణి ప్రజా సంబంధాల శాఖ వినియోగిస్తున్న అన్ని సోషల్ మీడియా మాధ్యమాల క్యూఆర్ కోడులను సంస్థ సిఎండి ఎన్.బలరామ్ ఆవిష్కరించారు. శనివారం సింగరేణి భవన్ లో జరిగిక కార్యక్రమంలో ఈ క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం ద్వారా సింగరేణి ప్రజా సంబంధాల విభాగం నిర్వహిస్తున్న సోషల్ మీడియా వేదికలైన ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్, ఎక్స్ (గతంలో ట్విట్టర్) లింక్డ్ఇన్‌లలో సింగరేణి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన అన్నారు. రాష్ట్రాభివృద్ధికి బొగ్గు, విద్యుత్ ద్వారా సేవలందిస్తున్న సింగరేణి తన ఉద్యోగుల సంక్షేమం, కొత్త ఉద్యోగాల కల్పన, సామాజిక బాధ్యత కార్యక్రమాలు, నిరుద్యోగులకి ఉపాధి అవకాశ శిక్షణలు, పర్యావరణహిత చర్యలు వంటి అనేక కార్యక్రమాలు చేపడుతోందని ముఖ్యంగా రక్షణ, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. ఈ విషయాలను ప్రతీ ఒక్కరికీ పారదర్శకంగా వివరించాలన్న ఉద్దేశంతో సింగరేణి సామాజిక మాధ్యమాలకు మరింత ప్రచారం వినియోగం కల్పించడానికి క్యూఆర్ కోడ్‌లు రూపొందించి విడుదల చేస్తున్నామన్నారు. వీటిని గనుల్లో, కార్యాలయాల్లో, వివిధ శాఖల్లో ఉంచుతామని కార్మికులు, స్థానికులు వీటిని స్కాన్ చేసి సింగరేణి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లను అనుసరించాలని తద్వారా సింగరేణి గురించి తాజా సమాచారాన్ని పొందవచ్చనని సిఎండి బలరామ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పి అండ్ పి పర్సనల్ జి.వేంకటేశ్వర రెడ్డి, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ జి.ఎం (సిడిఎన్) ఎస్.డి.సుభానీ పాల్గొన్నారు.

## వ్యక్తిగత వివరాలు సేకరించడం సరైనదికాదు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి: ఇటీవల రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో పట్టణాలలో వారి కుటుంబసభ్యుల వ్యక్తిగత వివరాలు ఆధార్‌కార్డులు, పాస్‌బుక్‌నెంబర్, బ్యాంకుఖాతా నెంబర్లు, మొబైల్‌నెంబర్స్ సేకరిస్తున్నారని గోప్యంగా ఉండాల్సిన ఈవివరాలు ఎందువలన ఇస్తున్నారు తక్షణమే వీటిని నిలిపివేయాలని దళితహక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో శనివారం తాడూరు తహసీల్దార్ కిరణ్‌మైకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ మాట్లాడుతూ కులగణన సర్వేదానికే పరిమితం చేయకుండా ఇతర వ్యక్తిగత వివరాలు సేకరించడంవలన ప్రజల్లో తీవ్రమైన ఆందోళన నెలకొందన్నారు. ఇటీవల పక్కజిల్లా సంగారెడ్డిలో సేకరించిన వ్యక్తిగత వివరాల పత్రాలను రోడ్లపైన పడేసినవైనాన్ని పత్రికల్లో మీడియాలో చూశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరాలు పెరిగిపోతున్న ఈసమయంలో ఇలాంటి వ్యక్తిగత వివరాలు సేకరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వారి కూలినాలే కష్టమన్నారు. డబ్బులను ఖాతాలో ఉంటే అపహరించడం జరిగే పరిస్థితి ఉందన్నారు. తక్షణ ఇప్పటికైనా కులగణన సర్వేలో వ్యక్తిగత వివరాలను సేకరించవద్దు అన్నారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ మండలప్రధాన కార్యదర్శి రాము, మండల అధ్యక్షులు బాలు, ఉపాధ్యక్షులు శివుడు, నాయకులు నాగరాజు, రామకృష్ణ, శ్రీకాంత్, శ్రీలత పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించాలని సిఆర్‌పిల నిరసన



ప్రజాపక్షం/వెల్దండ: మండల వనరులకేంద్రం ఎమ్మార్సీ విద్యాశాఖలో పనిచేస్తున్న క్లస్టర్‌రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పిలు) తమ డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర జేఏసి కమిటి పిలుపుమేరకు ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అప్పటి ప్రతిపక్షహోదాలో ఉన్న ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి సిఆర్‌పిలను రెగ్యులర్ చేస్తామని చెప్పి నెలలు గడుస్తున్న నేటికి అమలు చేయలేదన్నారు. 15రోజుల్లో తమ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెలోకి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ ఉద్యోగులు బాలయ్య, ఆంజనేయులు, పెంటయ్య, చంద్రశేఖర్ , కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి రగ్బీజట్టుకు మద్దూరు విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/మద్దూరు : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్కూల్ గేమ్స్ రగ్బీ అండర్ 14 బాలుర జట్టుకు మద్దూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చెందిన శ్రీశైలం, శివ, చింటూ, నందీశ్వర్, అనిల్‌లు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాద్యాయులు వెంకటప్ప తెలిపారు. ఈ విద్యార్థులు మూడు రోజుల పాటు మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాద్యాయురాలు సవిత ఉపాద్యాయులు బాలాజీ, రఘు, వసంత్ కుమార్ , వనజ, రవికుమార్ , సుధాకర్, నాగేందర్, భీమయ్య, ఆంజనేయులు, నవీన్, సత్యం , మల్లేష్, తోటి విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను వెంటనే విడుదల చేయాలి

**గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ కార్యవర్గం తీర్మానం**

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం కార్యవర్గ సమావేశం శనివారం నాంపల్లిలోని గెజిటెడ్ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణ ప్రారంభించిన ఈ సమావేశంలో తెలంగాణ 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సచివాలయ, హైదరాబాద్ సిటి అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ క్రింది తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను వెంటనే విడుల చేయాలని, ప్రభుత్వం ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తిలో చేసి ఉద్యోగుల ఆరోగ్య పథకంను వెంటనే అమలు పరచాలని, ట్రస్ట్‌లో ఉద్యోగులకు సమాన భాగస్వామ్యం ఉండాలని తీర్మానించారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే చెల్లించాలని తీర్మానించారు. జిఓ నెం 317 అమలులో నష్టపోయి ఉద్యోగులు చేసుకొన్న ఫిర్యాదులను దరఖాస్తులను పరిశీలించి క్యాబెనెట్ కమిటి సమర్పించిన నివేదిక ప్రకారం ఉద్యోగ సంఘ ప్రతినిధులతో చర్చించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కొత్తగా ఏర్పడిన జిల్లాలలో పాత జిల్లాల ప్రకారం అన్ని విభాగాలలో అదనపు క్యాడర్ స్ట్రేంత్ ను వెంటనే మంజూరు చేయాలని , ప్రస్తుతం 1వ పిఆర్‌సి ని అమలుకు నోచుకోని ఉద్యోగులకు మరో 6 నెలలలో చివరి అవకాశం కల్పిస్తూ జిల్లా స్థాయి హెచ్‌ఓడిలకు అధికారాలు ఇస్తూ గడువు పెంచాలని తీర్మానించారు. జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి మండల స్థాయి అధికారుల పట్ల అవమానకరంగా అనుచితంగా ప్రవర్తిస్తున్న సంఘ విద్రోహ శక్తులపై తగు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల అద్దె భవనాల చెల్లింపులను వెంటనే మంజూరు చేయాలని తీర్మానించారు. ఇలా మొత్తం 17 తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యవర్గ సమావేశంలో అసోసియేష్ అధ్యక్షులు బి. శ్యామ్, ఉపాధ్యక్షులు జగన్మోహన రావు, కోశాధికారి ఉపేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ పరమేశ్వర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచర్ల రామకృష్ణ గౌడ్, మహిళా ప్రతినిధి బి. దీపారెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు పి.యాదగిరితో పాటు అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా విభాగాల కార్యవర్గం పాల్గొన్నారు.

## పోలీసుశాఖలోమీ సేవలు చిరస్మరణీయం

✻ పోలీసు కమిషనర్ సునీల్‌దత్



ప్రజాపక్షం/క్రైం : విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేసి పోలీసుశాఖకు అందించిన సేవలు మరువలేనివని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన పలువురు ఎస్సైలు, ఏఎస్సైలను స్థానిక పోలీసు కమిషన్ కార్యాలయంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తికి మాత్రమే విరమణ అని వ్యక్తిత్వనికి కాదన్నారు. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతాయుతమైన విధులు నిర్వహించి పోలీసుశాఖకు ఎనలేని సేవలు అందించి మన్ననలు పొందారని కొనియాడారు. విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబసభ్యులను అభినందించారు. ఇకపై కుటుంబ సభ్యులతో బావిజీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీరిజర్వడ్ ఎస్సైలు పి.కృష్ణయ్య, జి.సూర్యారావు, ఖమ్మం త్రీటౌన్ ఏఎస్సై ఎన్ నాగేశ్వరరావు లను సిపి పూలమాలలు, శాలవాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి నరేష్ కుమార్, రిజర్వ్డ్ ఇన్స్పెక్టర్ కామరాజు, అసోషియోషన్ సభ్యులు జానీమియా,పంతులు పాల్గొన్నారు.

## జిసిసి సరఫరా చేసే నిత్యావసరాలు నాణ్యతతో ఉండాలి

- రాష్ట్రగిరిజన సహకార సంస్థ జిఎం

ప్రజాపక్షం/భద్రాచలం:ఐటిడిఎ ద్వారా నిర్వహించబడే హాస్టళ్లకు జిసిసి నుండి సరఫరా చేసే కాస్మోటిక్స్ నిత్యవసరాలు నాణ్యతో కూడినవి మాత్రమే సరఫరా చేయాలని, వాటిని ముందుగానే పరిశీలించి, ఇండెంట్‌లు తయారు చేసిన తర్వాత సరఫరా చేయాలని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ జిఎం సీతారామ్ నాయక్ అన్నారు. శనివారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లాలోని గిరిజన సహకార సంస్థ సొసైటీల మేనేజర్లు, అకౌంటెంట్లతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి కొన్ని సూచనలు చేశారు. నాసిరక ఆహార పదార్థాల వల్ల రాష్ట్రంలోని పలు చోట్ల విద్యార్థులు అస్వస్థతకు గురైయ్యారని, విద్యార్థుల ఆరోగ్యపరంగా ఏ సమస్య వచ్చిన ఆహార పదార్థాల లోపం వల్లే అంటున్నారని, కాబట్టి సరుకులు నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. సరుకులు నిల్వ చేసే గోదాములు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యతలేని వస్తువులు గడుపు తేదీ ముగిసిన వస్తువులు వెంటనే తిరిగి ఇచ్చేయాలన్నారు. హాస్టళ్లకు సన్న బియ్యం మాత్రమే సరఫరా చేయాలని, గిరిజనుల నుండి సేకరించే అటవీఫలాలను డిఆర్ డిపోల ద్వారా నేరుగా తీసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిబంధనలు, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే జిసిసి సిబ్బందిపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు భద్రాచలంలోని గురుకుల పాఠశాలను ఆర్‌సిఓ నాగార్జున రావుతో కలిసి సందర్శించి సరుకుల నాణ్యతను పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కావాల్సిన వస్తువుల జాబితా ఇండెంట్ సకాలంలో చెల్లించి నాణ్యతో కూడిన సరుకులను తెప్పించుకోవాలని సంబంధిత ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిసిసి డిఎం సమ్మయ్య, జిసిసి మేనేజర్లు లక్కోజి, నర్సింహారావు, జయరాజ్, లక్ష్మణరావు, దిప్‌పాల్, భూషయ్య, జిసిసి సిబ్బంది పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

ప్రజాపక్షం/భద్రాచలం:క్రమశిక్షణ, నిజాయితీతో విధులు నిర్వర్తించి ఉన్నత స్థాయికి చేరుకోవడంతో పాటు పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. తొమ్మిది నెలల పాటు ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు కేటాయించబడిన 78 పోలీస్ కానిస్టేబుళ్లతో శనివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అంకిత భావంతో ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత నమ్మకాన్ని పెంపొందించాలని తెలిపారు. ప్రతీ ఒక్కరూ నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. మానసికంగా, శరీరకంగా ధృడంగా ఉంటూ అన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ బాధ్యతగా మెలగాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తినప్పటికీ ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని చెప్పారు. పోలీస్ శాఖలో నిజాయితీగా పనిచేసే వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. పోలీస్ శాఖలో వినియోగిస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని దానికనుగుణంగా పనిచేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్‌పి సత్యనారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ లాల్‌బాబు, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ భవనాన్ని పరిశీలించిన ప్లానింగ్ ప్రణాళిక అధికారి

ప్రజాపక్షం/కల్లూరు:కల్లూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ. 4. 50 లక్షలతో నిర్మిస్తున్న పీఎం శ్రీ భవనాన్ని సిహెచ్ రామకృష్ణ పరిశీలించారు. గత కొద్ది రోజులుగా పాఠశాల ఆవరణలో పీఎం శ్రీ భవనాన్ని భవన నిర్మాణాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంగు ఆర్భాటంతో ప్రత్యేక ల్యాబ్, యువజన క్లబ్బు, పర్యావరణ పరిరక్షణ క్లబ్బు 12 అంశాలతో విద్యార్థుల విద్యార్థులకు అవగాహన కల్పించడం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఈ భవనాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ఎంతోమంది యువతీ యువకులను వృత్తి విద్యలో అనేక మందిని సొంత కాళ్లపై నిలిచే విధంగాఆదర్శవంతంగా తయారు చేసి సమాజానికి అందించే విధంగా ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో యువత విద్య వైద్య క్రీడారంగం యువత అభివృద్ధి పొందే విధంగా కంప్యూటర్ పరిజ్ఞానం సివిల్ వర్కులు ఆన్లైన్ శిక్షణ తరగతులు అన్ని రంగాలలో ఆదర్శంగా నిలవబోతుందని ఆయన వివరించారు. జిల్లాలో కల్లూరులోని ప్రారంభంగా ఈ భవన నిర్మాణాన్ని త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆవరణలో అన్ని మౌలిక వసతులు తోపాటు భవిష్యత్తులో యువత అన్ని రంగాలలో అభివృద్ధి పొందే విధంగా డిజిటల్ శిక్షణ తరగతులు దీనిలో నిర్వహించబోతున్నామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎంఈఓ నివేదిత తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది బాలాజీ, గుత్తేదారు భాగం ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

## బాలమల్లేష్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు : సాబీర్ పాషా

ప్రజాపక్షం/భద్రాచలం : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. శనివారం నాడు బాలమల్లేష్ అకస్మాత్తుగా గుండె పోటుతో మృతి చెందడం అత్యంత బాధా, విషాదకరమని చెప్పారు. చిన్న నాటి నుండి కమ్యూనిస్టు పార్టీపై మక్కువతో విద్యార్థి సంఘంలో పనిచేశారని చెప్పారు. ఏఐఎస్ఎఫ్ నాయకునిగా ఉంటూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించారని చెప్పారు. యువజన సంఘం నాయకునిగా, కార్మిక నాయకునిగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా, సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా పనిచేసిన ఉత్సాహవతుండైన బాలమల్లేష్‌ను కోల్పోవడం దురదృష్ట కరం అన్నారు. ఆయన లేని లోటు తీర్చలేదని, కుటుంబానికి సంతాపం, సానుభూతి వ్యక్త ం చేస్తున్నట్లు చెప్పారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతీ ఒక్కరూ పునరాంకితం అయిన నాడే బాలమల్లేష్‌కు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని చెప్పారు.

# ఎదురు చూపులు.. ఏడాదైనా దక్కని పదవులు!

✻నియామకపు పదవులపై పలువురి ఆశ

✻సుడా, భద్రాద్రి ట్రస్టు బోర్డుపై పెద్దల ఆశలు

✻కార్పోరేషన్ ఛైర్మన్ గిరీపై మరికొందరి కన్ను



ప్రజాపక్షం/ఖమ్మం : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పదవులు దక్కుతాయన్న ఆశలకు ఏడాది కావస్తుంది. నేతల ఎదురు చూపులు ఫలించే సూచనలు ఇప్పట్లో కనిపించడం లేదు. ఖమ్మంజిల్లాకు చెందిన ముగ్గురికి నామినెటెడ్ పదవులు దక్కాయి. ఇరిగేషన్ అభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు, గిడ్డంగుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, హస్త కళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నాయుడు సత్యం నియమితులయ్యారు. ఇంకా చాలా మంది నియామకపు పదవులపై ఆశలు పెంచుకుని హైదరాబాద్ పిలుపు కోసం చూస్తున్నారు. మరో ఇద్దరు ముగ్గురికైనా జిల్లాలో నామినెటెడ్ పదవులు దక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. అవకాశం దక్కిన ప్రతిరోజు ప్రయత్నిస్తూనే ఉన్నారు. స్థంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (సుడా) పరిధి పెంచిన తర్వాత సుడా ఛైర్మన్ పదవిని ఆశించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. పదవిపై కన్నేసిన వారు పైరవీల జోరు పెంచారు. సుడా తర్వాత భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ కోసం పలువురు పోటీపడుతున్నట్లు సమాచారం. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవి దక్కడం అదృష్టంగానే భావిస్తారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పలువురు ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు లాబియింగ్ మొదలు పెట్టారు. డిసిసిబి ఛైర్మన్ కోసం ఇద్దరు మంత్రుల అనుచరులు పోటీపడడంతో ఎవరికి కాకుండానే వైస్ ఛైర్మన్ చేతుల్లోనే పదవి ఉంది. డిసిసిబి ఛైర్మన్‌గా కూరాకుల నాగభూషణం పనిచేస్తుండగా వి. వెంకటాయపాలెం సొసైటీ ఛైర్మన్‌గా ఉన్న ఆయనపై అవిశ్వాసతీర్మానంపెట్టిపదవిచి తున్నిచేశారు.సొసైటీ అధ్యక్ష పదవి పోవడంతో డిసిసిబి అధ్యక్ష పదవికి రాజీనామ చేయక తప్పలేదు. కూరాకుల నాగభూషణం తర్వాత అధ్యక్ష పదవి కోసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనుచరులు తీవ్రంగా పోటీ పడ్డారు. వారి అనుచరుల మధ్య రాజీ కుదరకపోవడంతో డిసిసిబి ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. సుడా, భద్రాచలం ట్రస్టు బోర్డుకు కూడా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సహా మంత్రులు తుమ్మల, పొంగులేటి అనుచరులు కూడా పోటీ పడుతుండడంతో ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవడం లేదన్న ప్రచారం జరుగుతుంది. మొత్తంగా నామినెటెడ్ పదవుల నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తమకు నామినెటెడ్ పదవులు వస్తాయని ఎదురు చూసిన నాయకులు ఏడాది గడిచినా పదవులు దక్కకపోవడంతో పైరవీల జోరు పెంచారు. తాము పార్టీ కోసం ఎలా కష్టపడ్డాం, ఎంత పనిచేశామంటూ నేతల ముందు ఏకరువు పెడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర స్థాయి కార్పోరేషన్ ఛైర్మన్లతో పాటు జిల్లాకు చెందిన ముఖ్య నియామకపు పదవులనుభర్తీచేయాలని కాంగ్రెస్ నేతలు కోరుతునారు.

## శుచి, రుచి, పరిశుభ్రతతో మధ్యాహ్న భోజనం వండాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ప్రజాపక్షం/భద్రాచలం : పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వండిపెట్టే గ్రూపు సభ్యులు రుచి, శుచి, పరిశుభ్రతతో వంటలు వండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు కొత్తగూడెం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనంద ఖనిలో అవగాహన కల్పించారు. డిఇఓ వెంకటేశ్వరా చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వంట గ్రూపు సభ్యులు కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కుని తలకు టోపీ ధరించి పరిశుభ్రమైన వాతావరణ పాఠశాల ఆవరణలో భోజనం వండాలన్నారు. పాఠశాలకు వచ్చిన బియ్యాన్ని ముందుగానే పరిశుభ్రం చేసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పై అధికారులకు తెలియజేయాలన్నారు. వంటకు ఉపయోగించే కూరగాయలు సాధారణంగా మునగాకు, కరివేపాకు, చింతాకు స్వయంగా పండించినదైతే చాలా మేలని, పిల్లలకు బలాన్ని చేకూరుస్తాయని, బయటి షాపుల ద్వారా తీసుకొచ్చే కూరగాయలు శుభ్రమైన నీటితో కడగాలని, అందులో పుచ్చులు, పురుగులను జాగ్రత్తగా పరిశీలించి వండాలని చెప్పారు. పిల్లలకు ఏదైనా అనర్థం జరిగితే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆరోగ్యం సరిగాలేని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి భోజనం అందించాలని, లేదంటే ఉపాధ్యాయులకు చెప్పి ఇంటికి పంపిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎన్ సతీష్‌కుమార్, ఎఫ్ఏఓ శ్రీనివాస్, కొత్తగూడెం విద్యాధికారి యం ప్రభుదయాల్, లక్ష్మీదేవిపల్లి ఎంఇఓ పి.కృష్ణయ్యతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపల్ కాంప్లెక్స్‌ను వినియోగంలోనికి తేవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజాపక్షం/భద్రాచలం: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు గడిచిన రెండేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని తక్షణమే వినియోగంలోనికి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం ఆయన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం పది రోజుల్లో మహిళా సంఘాలతో ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. షాపులను సుందరంగా తీర్చిదిద్ది వాటిని మహిళలు అప్పగించి వివిధ రకాల ఆహార పదార్థాలను అందుబాటులోనికి తేనున్నట్లు చెప్పారు. టిఫిన్స్, స్నాక్స్, భోజనంతో పాటు రుచికరమైన ఆహార పదార్థాలు తయారుచేసుకుని ఇక్కడే వ్యాపారాలు జరిపేలా చూస్తామన్నారు. ఆయన వెంట స్థానిన సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మున్సిపల్ కమీషనర్ శేషాంజన స్వామి, కౌన్సిలర్‌లు రుక్మాంధర్, బండారి, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రవేశ పరీక్ష విజేతలకు సత్కారం

ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఖమ్మంజిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఏఐబిఈ (ఆలిండియా బార్ ఎగ్జామ్) మోడల్ ప్రవేశ పరీక్ష విజేతలను హైకోర్టు న్యాయమూర్తి బీమపాకం నగేష్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. హన్మకొండలో జరుగుతున్న రాష్ట్ర మహాసభలలో హైకోర్టు న్యాయమూర్తి బీమపాకం నగేష్ చేతుల మీదుగా విజేతలను సత్కరించారు. ప్రథమ బహుమతి మామిడి లక్ష్మి ప్రియ, ద్వితీయ బహుమతి వేముల నవీన్, ఈ. శృతి, ఎన్. శ్రీలత, తృతీయ బహుమతి కె. ప్రత్యూష సాధించారు. వారిని శాలువతో సత్కరించి మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ సీనియర్ రాష్ట్ర నాయకులు పెంబసాని పట్టాభి, ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, పారుపల్లి అమర్‌చందర్, మేకల నవీన్, ఎస్‌కె నస్రీన్, దామోదర్‌బాబు, ఇమిడి సతీష్, గాజుల అమర్‌నాథ్, పర్వేజ్, ఐఏఎల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిశీలించాలి : కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాచలం:ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక, పిఎం కూసుమ్ పథకం, సమగ్ర ఇంటింటి సర్వే, డేటా ఎంట్రి తదితర అంశాలపై అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఆర్‌డిఓలు, తహశిల్దార్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధరణి మాడుల్స్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్ని మండలాల తహశిల్దార్లను ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించుకుని పరిష్కారానికి కృషి చేయాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర వివరాలతో సమాచారాన్ని పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. డెటా ఎంట్రి వేగవంతం చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు సూచించారు. పిఎం కుసుమ్ పథకం క్రింద మహిళా సమాఖ్య ద్వారా 1 మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్ స్థాపనకు జిల్లాలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని విద్యుత్ అధికారుల సమన్వయంతో గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థాపనకు స్థలం గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని, కొత్తగూడెం, భద్రాచలం ఆర్‌డిఓలను ఆదేశించారు.

## మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు:మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కేస సందీప్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ బూర్గంపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వాటా, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వాటా పెంచాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కొమరం భీం అసిఫాబాద్ నారాయణపేట జిల్లాలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా చనిపోయిన విద్యార్థిని శైలజ కుటుంబానికి తగు న్యాయం చేయాలని లేదంటే జిల్లాలో మంత్రులను తిరగనివ్వమని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్‌జెడి తనిఖీ



ప్రజాపక్షం/కల్లూరు:కల్లూరు లోని అంబేద్కర్ నగర్ లో ఉన్నఅంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్జెడి ఝాన్సీ లక్ష్మీ బాయి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు పిల్లలకు అందించే పౌష్టికాహారం దినుసులు, పప్పులు, బాలామృతం, కురుకురే, కోడిగుడ్లు లతోపాటు రికార్డులు చిన్న పిల్లల బరువు పౌష్టికాహారం అందిస్తున్న వివరాలు రికార్డులు పరిశీలనతో పాటు ప్రీస్కూలు పిల్లలకు అందిస్తున్న విద్య టిఎల్‌ఎం మేళాలో తయారుచేసిన బొమ్మలు ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని పౌష్టికాహారం పూర్తి స్థాయిలో అందించాలని తల్లులకు పిల్లల పెంపకంపై అవగాహన కల్పించాలని తదితర అంశాలపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉపాధ్యాయులైన ప్రసన్న, రాజకుమారి, సావిత్రిలను అభినందించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నిర్మల జ్యోతి, ఏసిడిపిఓ రత్తమ్మ, పర్యవేక్షకులు సంధ్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

## బాలమల్లేష్ మృతిపట్ల సిపిఐ ఖమ్మం జిల్లా సమితి సంతాపం



ప్రజాపక్షం/ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్ మృతి పట్ల సిపిఐ ఖమ్మంజిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని తెలియజేసింది. బాలమల్లేష్ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమల్లేష్ నాకు విద్యార్థి దశ నుంచి మిత్రుడని కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సిపిఐ జిల్లా కార్యదర్శి, దివంగత పోటు ప్రసాద్ అంత్యక్రియల్లో బాలమల్లేష్ పాల్గొన్నారని సంతాప సభలో మాట్లాడారని హేమంతరావు గుర్తు చేసుకున్నారు. అంతిమ యాత్రలో సిపిఐ కార్యాలయం నుండి మమత ఆసుపత్రి వరకు నడిచారని ఆయన తెలిపారు. గుండె పోటు బాలమల్లేష్ ప్రాణాలను బలిగొన్నదని కమ్యూనిస్టు ఉద్యమం బాలమల్లేష్ మృతితో నిబద్ధత గల నాయకున్ని కోల్పోయిందన్నారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యు లు జమ్ములజితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు,సిద్దినేని కర్ణకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి ఏసు, తాటి వెంకటేశ్వరరావు ఉన్నారు.

## వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాపక్షం/మణుగూరు రూరల్: రీజినల్ పరిధిలో అందిస్తున్న వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయమని వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్వి కుమార్ అన్నారు. శనివారం వేణు ఫంక్షన్ హాల్ లో కడవెండి విశ్వనాథ గుప్తా, పద్మజా అవార్డ్స్ ప్రాంతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన డాక్టర్ అన్నం శ్రీనివాస రావు, పర్యావరణ మిత్ర, సామాజిక వేత్త కడవెండి వేణుగోపాల్, సదస్సు పరిశీలకులు పెండ్యాల రోజా లక్ష్మి, దోసపాటి నాగేశ్వరరావులతో కలిసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వాసవి క్లబ్ అందుతున్న సేవలను వివరిస్తూ పేద ప్రజలకు సేవాభావంతో అనేక సేవా కార్యక్రమంలో పాల్గొంటూ ముందుంటున్న వాసవి క్లబ్ ప్రతినిధులను అభినందించారు. వారికి సలహాలు, సూచనలు ఇస్తూ క్లబ్‌లలను ముందంజలో ఉండేలా చేస్తున్న వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ కడవెండి విశ్వనాథ గుప్త ను అభినందించారు.

## నాల్గవ విడతలో 17,852 మందికి రుణమాఫీ

రూ. 154.03 కోట్లు నిధులు విడుదల

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : నాల్గవ విడత రుణమాఫీలో భాగంగా ఖమ్మంజిల్లాలో 17,852 మంది రైతులకు రూ. 1540320242 లను నిధులు విడుదల చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. రైతు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయడంతో రుణ విముక్తులవుతారన్నారు. రైతులు సంబంధిత బ్యాంకులను సంప్రదించి రైతు రుణమాఫీ వివరాలు పొందవచ్చునని ఆయన తెలిపారు. మండలాల వారీగా బోనకల్ మండలంలో 727 మంది రైతులకు, చింతకాని మండలంలో 601 మంది రైతులకు, ఏన్కూరు మండలంలో 616, కల్లూరు మండలంలో 1055, కామేపల్లి మండలంలో 397, ఖమ్మం రూరల్ మండలంలో 280, ఖమ్మం అర్బన్ మండలంలో 1601, కొణిజర్ల మండలంలో 562, కూసుమంచి మండలంలో 766, మధిర మండలంలో 2055, ముదిగొండ మండలంలో 623, నేలకొండపల్లి మండలంలో 1491, పెనుబల్లి మండలంలో 760, రఘునాథపాలెం మండలంలో 232, సత్తుపల్లి మండలంలో 824, కారేపల్లి మండలంలో 530, తల్లాడ మండలంలో 778, తిరుమలాయపాలెం మండలంలో 464, వేంసూరు మలో 1042, వైరా మండలంలో 949, ఎర్రుపాలెం మండలంలో 1499 మంది రైతులు 17,852 మంది రైతులకు నాల్గవ విడత ప్రభుత్వం విడుదలచేసిన రుణమాఫీలో లబ్ధి పొందినట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

## క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వహించాలి

ట్రైనీ కానిస్టేబుళ్లకు దిశా నిర్దేశం

ప్రజాపక్షం / క్రైం : ప్రజలు, సమాజం పట్ల అవగాహన పెంచుకుని క్రమశిక్షణతో బాధ్యతలు చేపట్టాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో తొమ్మిది నెలలు శిక్షణ పూర్తిచేసుకుని ఖమ్మం కమిషనరేట్‌కు రిపోర్టు చేసిన 195 మంది నూతన సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లతో అయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారికి విధులు పట్ల పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితులలో నేరాల నియంత్రణకు గతానికి భిన్నంగా పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయన్నారు. అందుకు అనుగుణంగా శిక్షణలో నేర్చుకున్న అంశాలతో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలన్నారు. ప్రధానంగా పోలీసుశాఖలో వృత్తిపరంగా, వ్యక్తిగతంగా క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. విధినిర్వహణలో ధైర్యంగా, నీతి నిజాయితీతో వ్యవహరించాలన్నారు. శిక్షణలో అలవరుచుకున్న క్రమశిక్షణ రాబోయే రోజుల్లో అనుసరించాలన్నారు. ఆరోపణలకు తావివ్వకుండా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. ప్రజల రక్షణ, వారి హక్కులు, ఆత్మగౌరవం భంగం కలగకుండా ప్రజాసంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు. పని వత్తిడి, ప్రతికూల పరిస్థితులలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని వాటిని అధిగమించేందుకు మంచి ప్రవర్తనతో ప్రజలకు సేవలు అందించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిబద్ధతతో విధులు నిర్వర్తించి పోలీసుశాఖకు కిర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతు చేపడుతున్న కానిస్టేబుళ్లను అభినందించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపిలు నరేష్ కుమార్, ప్రసాదరావు,ఎసిపిసాంబరాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




## మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని వాటికి బానిస కావద్దని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. రఘునాథపాలెం పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై పోలీసులు వివరించారు. సిఐ ఉస్మాన్ షరీఫ్, టిఎస్ నాబ్ సిఐ బి. రాము మాట్లాడుతూ డ్రగ్స్ అనేది సమాజానికి పట్టిన చీడపురుగులాంటిదని దానిని ఆదిలోనే నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. మత్తుకు బానిసై ఎంతో మంది విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. డ్రగ్స్ మత్తులో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు కూడా పాల్పడుతున్నారన్నారు.ఎవరైనా డ్రగ్స్ వినియోగించినట్లు, విక్రయించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

## ప్రజాపాలన విజయోత్సవాన్ని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/నాగార :** ప్రజాపాలన విజయోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం పుర పాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన ప్రజాపాలన విజయోత్సవ కార్యక్ర మం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి,కౌన్సిలర్లు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నాగారం :** మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు పరిధిలోని ప్రగతి నగర్ కాలనీలో రూ.7.50 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులకు స్థానిక కౌన్సిలర్ గూడురు సబితా అంజనేయులు గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూరుదు అంజనేయులు గౌడ్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే సిఎం ధ్యేయం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ద్యేయమని, సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు పెద్దపీట వేస్తున్నారని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. శనివారం మహాబూబ్‌నగర్ జిల్లా అమిస్తాన్‌పూర్‌లో ప్రభుత్వం తలపెట్టిన రైతు పండగకు ఉమ్మడి శామీర్‌పేట మండలం రైతులు పెద్ద ఎత్తున బయల్దేరారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సింహాయాదవ్ రైతు పండగకు వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దుక్కుతుందన్నారు. సిఎం రేవంత్ పాలనపై రైతులు నమ్మకం పెట్టుకున్నారని ఈ సంతోష సమయంలో అన్నదాతలతో కలిసి ఉమ్మడి పాలమూరుకు వెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్, వ్యవసాయాధికారులు , రైతులు పాల్గొన్నారు.

## వాజ్‌పేయి నగర్ రైల్వే గేట్ వద్ద ఆర్‌యుబి నిర్మాణం చేపట్టాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రయాణీకుల రాకపోకలకే కాకుండా అత్యవసరంగా వెళ్లే అంబులెన్స్, అగ్నిమాపకదళ వాహనాలకు సైతం తలెత్తుతున్న ఇబ్బందుల నివారణలో భాగంగా చిరకాలంగా వాంచిస్తున్న వాజ్‌పేయి నగర్ రైల్వే గేట్‌కు ప్రత్యామ్నాయంగా రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబి) పనులు వెంటనే చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. శనివారం రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్‌ఛీఫ్ పి. మధుసుధనరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నిత్యం పలు పాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకల సమయంలో గేట్ మూసి వేయటం, ఇరు వైపులా నిలిచి పోయే వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గం లేక పోవటం వల్ల పలువురు తమ గమ్యస్థానాలకు చేరుకోవటానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ కాలంలో పదేళ్ల క్రితమే ప్రత్యామ్నాయంగా ఆర్‌యుబి కోసం నిధులు కేటాయించటమే కాక శంకుస్థాపన జరిగినా నేటికీ నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా ఆర్‌యుబి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని ఆయన కోరారు. మాజీ ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, సీనియర్ నేతలు పరశురాంరెడ్డి, రాముయాదవ్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## విధులను సేవా భావంతో కొనసాగించాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** పదవీ విరమణ అయిన అనంతరం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొనేలా తమ విధులను సేవా భావంతో కొనసాగించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.రఘునాథస్వామి అన్నారు. మూడ్చింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భారత సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శాఖలో సత్యనారాయణ చేసిన సేవలు కొనియాడ దగినిపేర్కొంటూ పదవీ విరమణ పత్రాన్ని అందించి సన్మానం చేసారు. పదవీ విరమణ చేసిన ఆయన అనుభవాలను వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కీసర డివిజన్ డిప్యూటి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.సత్యవతి, మూడ్చింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా.దమయంతి, అబ్రహం, కాశీరాం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతులకు పలు పథకాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రైతాంగానికి వివిధ కార్యక్రమాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలను కొనసాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం మేడ్చల్ ప్రాంతం నుండి మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న రైతు పండుగ కార్యక్రమానికి తరలి వెళ్లిన జిల్లా రైతుల ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మేడ్చల్ జిల్లాలో 5189 మంది రైతులకు రూ. 23 కోట్ల మేరకు రుణమాఫీకి అర్హులుగా గుర్తించగా వీరిలో ఇప్పటి వరకు 1378 మందికి రుణమాఫీ లభించిందని, మిగిలిన వారికి రైతు పండుగలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రుణమాఫీ లభించనుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై. శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారులను ఆదుకోవడమే లక్ష్యం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కబడ్డీ క్రీడాకారులను అన్ని విధాలుగా ఆదుకోవడమే తమ లక్ష్యమని అమేచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షులు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. బాచుపల్లిలోని కబడ్డీ అకాడమిలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన కబడ్డీ క్రీడాకారులకు కాసాని వీరేశ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరేశ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కబడ్డీ క్రీడను తీసుకువెళ్లడంతో పాటు గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను పోత్సహించడమే తమ బాధ్యత అన్నారు. కబడ్డీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఎదిగితే తమ వంతు సహాయ సహకారాలను అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చంద్రహాస్, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.




# త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్

## ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎవరినీ వదలం : రంగనాథ్

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిలో పేదల కంటే ధనవంతులు, సంపన్నులే ఎక్కువగా కనిపిస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యాఖ్యానించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు కూడా ఆక్రమణదారుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎవరిని ఉపేక్షించేదని లేదని రంగనాథ్ హెచ్చరించారు. బేగంపేటలోని ఓ హోటల్‌లో జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్మెంటల్ ఇనీషియేటివ్ ఆధ్వర్యంలో అర్బన్ బయోడైవర్సిటీ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలపై ఎక్కువగా దృష్టి పెట్టామన్న రంగనాథ్, లోటస్ పాండ్‌లో ఏకంగా ఓ వ్యక్తి ఎకరం స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే హైడ్రా అడ్డుకుందన్నారు. త్వరలోనే హైడ్రాకు పోలీస్ స్టేషన్ రాబోతుందని, హైడ్రాకు వచ్చే ఫిర్యాదులను వెనువెంటనే పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు రంగనాథ్ వివరించారు. హైడ్రా చర్యలకు ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తుందని, అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో



కోర్టు తీర్పులు కూడా స్పష్టంగా ఉన్నాయని రంగనాథ్ వెల్లడించారు. 'ఎక్కువగా సంపన్నులే సర్కార్ స్థలాలను ఆక్రమిస్తున్నారు. ఆక్రమణలకు గురైన స్థలాల్లో పేదల కంటే ధనికులే అధిక శాతంగా ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీలవారు ఈ ఆక్రమణల్లో భాగంగా ఉన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎవరినీ వదలిపెట్టే ప్రశక్తేలేదు. హైడ్రాకు వచ్చే కంప్లైంట్‌లను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

### అక్రమనిర్మాణల కూల్చివేతపై కోర్టు తీర్పులు స్పష్టంగా ఉన్నాయి

చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ.. అక్కడ నిర్మాణాలు చేపట్టరాదని, చేపడితే వాటిని కూల్చి వేయవచ్చనని కోర్టు తీర్పులు ఎంతో స్పష్టంగా ఉన్నాయన్నారు. అలాగే రహదారులు, పార్కులు, ప్రజావసరాలకోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణలు కాకూండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా కోర్టులు చక్కటి దిశానిర్దేశం చేశాయని తెలిపారు. ఇందుకు ఇటీవల హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులే నిదర్శనమని వ్యాఖ్యానించారు. జీవవైవిధ్యానికి ఊతమిచ్చేలా చెరువుల పరిరక్షణలో హైడ్రా చేస్తున్న కృషిని నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఛైర్మన్ అచలేందర్ రెడ్డి అభినందించారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా

### వికారాబాద్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు ప్రమాదా ల నివారణకు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వికారాబాద్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి వెల్లడించారు. ప్రతి యేడాది నిర్వహించే పోలీసు స్టేషన్‌ల తనిఖీలో భాగంగా శనివారం తాండూరు పట్టణ పోలీసు స్టషన్‌ను ఎస్‌పి తనిఖీ చేశారు. అనంతరం జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నేరా నియంత్రణపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాండూరులో అక్రమంగా సాగుతున్న వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని తాండూరు డిఎస్‌పి బాలకృష్ణారెడ్డిని ఎస్‌పి ఆదేశించారు. తాండూరు పట్టణంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలువనున్నట్లు వెల్లడించారు. పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సాదిస్తామని తెలిపారు. తాండూరు పోలీసు స్టేషన్‌కు 97మంది కానిస్టేబుల్ సిబ్బంది కెటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు డిఎస్‌పి బాలకృష్ణారెడ్డి,టౌన్ సిఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐలు ఉన్నారు.

## తాండూరుకు రూ.12 కోట్ల నిధులు

### ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :** 2024–25ఆర్థిక సంవత్సరానికి గాను మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తాండూరు నియోజకవర్గానికి రూ.12కోట్ల నిధులు మంజూరైనట్లు తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులను గ్రామాలలో ప్రజల అవసరాలను బట్టి నాణ్యమైన సిసి రోడ్ల నిర్మాణానికి ఉపయోగించాలని తెలిపారు. నియోజవర్గంలోని యాలాల మండలానికి రూ. 2.75 కోట్లు, తాండూరు మండలానికి రూ. 2.75కోట్లు, బషీరాబాద్ మండలానికి రూ. 2.75కోట్లు, పెద్దేముల్ మండలానికి రూ. 2.75కోట్ల నిధులు, కోట్‌పల్లి మండలానికి రూ. 80లక్షల నిధులను కెటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నిధులను నాణ్యమైన పనులను చేపట్టాలని సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాలలో భాగంగా నియోజకవర్గంలో డిసెంబర్ 1 నుండి 8 వరకు గ్రామాలలో పర్యాంటి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1,5న యాలాల మండలంలో, ఈ నెల 2,7న తాండూరు మండలంలో, ఈనెల 3న బషీరాబాద్ మండలంలో, ఈ నెల 4,8న పెద్దేముల్ మండలంలో, ఈ నెల 6న తాండూరు టౌన్‌లో ఎంఎల్‌ఎ పర్యాటిస్తారని పేర్కొన్నారు.

## ఘనంగా ట్రెడీషనల్ డే

**ప్రజాపక్షం/దుండిగల్ :** మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్, ఫార్మసీ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ట్రెడిషనల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు రంగు రంగుల సంప్రదాయ దుస్తులు ధరించి ట్రెడిషనల్ డే సంబరాలలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పే ప్రకృతి పండుగగా విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో, సాంప్రదాయిక దుస్తులు ధరించి, ముఖ్యంగా బతుకమ్మ ఆట పాటలతో,కోలాటాలతో, నృత్యాలతో, అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మర్రి రాజశేఖర్ రెడ్డి మర్రి మమత రెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి పాల్గొన్నారు. కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అనుశ్రేయ రెడ్డి మాట్లాడుతూ, ఇది ప్రతి



ఒక్కరూ తమ సాంప్రదాయ దుస్తులలో లేదా వారు ఎంచుకున్న నిర్దిష్ట సంస్కృతిలో రావడానికి నియమించబడిన రోజని ఇన్‌స్టిట్యూట్‌లోని ప్రతి ఒక్కరూ తమ అత్యుత్తమ దుస్తులను ధరించి వచ్చారని విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ఎంతో ఆనందోత్సాహాలతో పాల్గొన్నందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ యొక్క సంబరాలను ఘనంగా నిర్వహించిన విద్యారథులందరి కీ అభినందలు తెలియజేశారు. ఈ యొక్క సంబరాలలో కళాశాల డైరెక్టర్ డా. పి శ్రీధర్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా.అర్ణబ్ మాలిక్ డాగ్రవంతి, విజయ సింహ తదితరులు పాల్గొన్నారు.

## పౌరులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని ఎంఆర్‌ఒ జయరాం అన్నారు. శనివారం నవాబుపేట్ మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముందు పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. రాజ్యాంగ బద్ధంగా దక్కాల్సిన హక్కులను వినియోగించుకోవడంతోపాటు ఎస్‌పి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాల ని సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు. ప్రతి నెలకొక గ్రామంలో సివిల్స్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించ డం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అనురాధ, పోలీస్ అధికారులు, ఆర్‌ఐ రాజు, ఎంఇఒ అబ్దుల్ రహేమాన్, శుక్లవర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ మాజీ సర్పంచ్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటీ హాకింపేట డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ రవీందర్ బ్రేయిన్ స్ట్రోక్‌తో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి ముగ్గురు సంతానం ఉండటంతో పిల్లల చదువులకు తోటి ఆర్‌టిసి ఉద్యోగులు అందరు కలిసి రూ.87,500 బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సీనియర్ ఎడిసి బాలరాజుగౌడ్, గోపు శ్రీనివాస్, పవన్‌కుమార్, రాంచెందర్, సుజిత్‌కుమార్, కన్యాకుమారి, వినోద, సులోచన, తులసిరామ్, కేపి రావు, వినోద్, ఎడిసి శ్రీనివాస్, జెఎస్ రెడ్డి, కెఎస్ రెడ్డి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందిస్తాయి

### ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందిస్తాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని మాణిక్యనగర్‌లోని పల్లవి స్కూల్‌లో ఐక్యం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కెపి వివేక్ విద్యార్థులు రూపొందించిన పలు పరికరాలను వీక్షించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు కష్టపడి విద్యనభ్యసించినప్పుడే అనుకున్న ఆశయాలను సాధించగలుగుతారని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కెఎం గౌరీష్, డైరెక్టర్ విద్యాదర్, ప్రిన్సిపల్ ధన లక్ష్మి, హరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.




### శ్రీనిధి స్కూల్‌లో 'జైకిసాన్ జై జవాన్' కార్యక్రమం...

కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మాణిక్యనగర్‌లో శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌లో జైకిసాన్ జై జవాన్ థీమ్‌తో రైతు బజార్ ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ పాల్గొని ప్రారంభించారు. వివేక్ మాట్లాడుతూ దేశానికి రైతు, సైనికుల త్యాగం అంతులేనిదని, రైతు, సైనికుడి ఆవశ్యకతను పిల్లలకు వివరించారు. పాఠశాలల్లో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సోమేశ్ కుమార్, సంపత్ గౌడ్, నల్లపాటి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

### నిరుద్యోగులకు జాబ్ మేళాలు అవసరం

నిరుద్యోగులకు జాబ్ మేళాలు ఎంతగానో దోహదపడతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని షాపూర్‌నగర్ ఎంజె గార్డెన్స్‌లో ఆల్ ఇండియా పయం ఈ ఇన్సానియత్ ఫోరం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో జాబ్ మేళాలు ఎంతో ఉపయోగపడతాయని, ఇలాంటి జాబ్ మేళాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళా ద్వారా ఉపాధి పొందిన యువతి, యువకులకు నియామక పత్రాలను వివేక్ అందజేశారు. కార్యక్రమంలో సిద్ధిక్, అమీర్ ఖాన్, ఫెరోజ్, మోయిజ్, మహమ్మద్ ఆజం, అర్షద్, సాజిద్, ఇస్మాయిల్, మౌలానా, హనీఫ్, బ్రహ్మానంద రెడ్డి, ప్రసాద రావు, షౌకత్, ఇర్ఫాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభించిన స్పీకర్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరంను స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాజకీయల కంటే ముందు స్వతంగా సేవా కార్యక్రమాలు చేపట్టేవారన్నారు. మా కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం గ్యాక్ పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు అవసరమైన సహాయం అందిస్తున్నామన్నారు. వికారాబాద్ వైద్యకళాశాల పనులు వేగంగా జరుతున్నాయి . ఆసుపత్రి విస్తరణ పనులు జరుగుతుంది వీటిలో పేదలకు మెరుగైన వైద్య సేలు అందతాయి అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా వైద్యఅధికారివెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ,మహవీర్ వైద్యకళాశాల బృందం , పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## సమగ్ర సర్వే డేటా ఎంట్రీని వేగవంతం చేయాలి

### వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



**ప్రజాపక్షం/తాండూరు :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా నమోదను వేగవంతంగా చేపట్టాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. శనివారం తాండూరు ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాలను జిల్లా అధనపు కలెక్టర్ అకస్మీకంగా సందర్శించి డేటా ఎంట్రీ ప్రక్రియను తనిఖీ చేశారు. డేటా ఎంట్రిలో కుటుంబ వివరాల్లో ఏలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆపరేటర్లకు సూచించారు. అంతకు ముందు తాండూరులో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అధనపు కలెక్టర్ వెంట ఎంపిడిఒ విశ్వప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, కమీషనర్ విక్రమ్‌సింహారెడ్డి, ఆర్‌అండ్‌బి డిఈ శ్రవణ్ ఉన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి :** విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్‌కు ఆదివారం ఏర్పడుతుందని ఏఇ బాబురావు తెలిపారు.చర్లపల్లి సబ్ స్టేషన్ 2 పరిధిలోని ఫీడర్‌ను 10 గంటల నుండి 1 గంటల వరకు నిలిపివేయడంతో ఫేస్1లోని కొద్ది ప్రాంతాలు, బిఎన్ రెడ్డి నగర్ కాలనీ ఫేస్5,నవోదయ కాలనీ ప్రాంతాలు,సబ్ స్టేషన్3లోని ఫీడర్ 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు నిలిపివేయడంతో ఫేస్3, భరత్ నగర్,గాంధీనగర్(చెంగిచెర్ల) ప్రాంతాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

### పారిశ్రామిక వాడలో.....

చర్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫేస్2 ఫీడర్‌ను 8 గంటల 12 గంటల వరకు నిలిపివేయడంతో యావిని ఇండస్ట్రీస్,జూడియక్,లింక్‌వెల్, వివిఎల్‌ఆర్ ఆటో మెషిన్ ప్రాంతాలు,మధ్యాహ్నం 1గంటల నుండి 4.30 గంటల వరకు 11 కెవి డైన టెక్ ఫీడర్‌ను నిలిపివేయడంతో సన్‌రక్, లక్స్‌వెల్,వైఎస్‌ఆర్ ఆక్సిమ్,ఎన్ఎస్ఎల్,మనోజ్‌కృష్ణ కంపెనీలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ2 బాల్‌రాజ్ తెలిపారు.

## పాఠశాల గదులు పరిశీలన



**ప్రజాపక్షం/పెద్దేముల్ :** మండల కేంద్రమైన పెద్దేముల్‌లో శిథిలావస్థకు చెరిన ప్రాథమిక పాఠశాల, గదులను,జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో టాయిలెట్లు, కౌంపౌండ్ వాల్‌ను పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సత్యనాయణరెడ్డి పరిశీలించారు. శనివారం మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదులను పంచాయతి రాజ్ ఇఇ సత్యనారాయణరెడ్డితో పాటు తాండూరు డివిజన్ డిఇ నాగభూషణం, ఎంఈఒ నర్సింగ్‌రావు, టిపిసిసి మైనార్టీ విభాగం రాష్ట్ర కన్వీర్ రియాజ్ పరిశీలించిన వారిలో ఉన్నారు. శిథిలావస్థలో చేరిన పాఠశాల గదులు, మరుగుదోడ్లు, ప్రహరి గోడ నిర్మాణాని ప్రభుత్వానికి ప్రపోజల్ పంపుతామని తెలిపారు. శిథిలావస్థలో చేరిన తరగతి గది స్లాబ్‌ను తొలగించి పున్నర్ నిర్మాణం చేపడుతామని తెలిపారు.

## వైద్యారోగ్య శాఖలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబద్ జిల్లా వైద్యరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు , పర్యవేక్షకులకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం , కొత్తగా చేర్చబోయే వాక్సిన్‌లను గురించి ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమలను గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఅధికారి వెంకటరమణ హజరై మాట్లాడుతూ సంవత్సరంలోపు చిన్నారులకు టీకాలు వేయడంతో పాటు 5,10,16 సంవత్సరాల వయస్సు పిల్లలకు వేయల్సిన బూస్టర్ డోసులు కూడా ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరికి టీకా వేయాలని తెలిపారు. టీకా వేసిన అనంతరం అన్‌లైన్‌లో నమోదు చేయాలని అశాకార్యకర్తకు సూచించారు. వీటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసలు , వైద్యఅధికాకరులు పాల్గోన్నారు.



## ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికు జన్మదిన శుభాకాంక్షలు

చొక్యంపేట్ అంజనేయులు

**ప్రజాపక్షం/షాబాద్ :** చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామికి జన్మదినం సందర్భంగా శనివారం మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్యంపేట్ అంజనేయులు ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాలల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న వెంకట్ స్వామి అన్న అడుగు జాడలో నడిచి మాలల హక్కులను సాధించుకుంటామని అంజనేయులు తెలిపారు.

# మహానగరి

## ఎంపి అసదుద్దీన్ ఇంట్లో కుటుంబ సర్వే

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమీషనర్ వెంకన్న, రాజేంద్ర నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ డాక్టర్ కె.రవికుమార్ ఎన్యుమరేటర్లు, ఎన్యుమరేషన్ సూపర్‌వైజర్లతో కలిసి హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసి ఇంట్లో కుటుంబ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీ పురం డివిజన్‌లోని అసదుద్దీన్ ఓవైసీ నివాసానికి జిహెచ్ఎంసి సర్వే అధికారులు చేరుకొని పూర్తి వివరాలు సేకరించారు. ఈసర్వే కార్యక్రమంలో ఎన్యుమరేటర్ మాధవి,ఎన్యుమరేటర్ సూపర్‌వైజర్ ఉపేందర్,వార్డు ఇన్‌చార్జి సయీద్‌లు పాల్గొన్నారు.

## బల్దియా బడ్జెట్ సమావేశం వాయిదా

వాస్తవరూపంలో ప్రతిపాదనలు రూపొందించలేదన్న సభ్యులు

వచ్చేనెల 9వ తేదీకి సమావేశం వాయిదా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహా నగర పాలక సంస్థ (జిహెచ్ఎంసి) 2025–26 వార్షిక బడ్జెట్‌పై భేటీ అయిన స్థాయిసంఘం కేటాయింపులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బడ్జెట్ ప్రతిపాదనలు వాస్తవరూపంలో లేవని, ఎస్టేట్, అడ్వర్టైజ్‌మెంట్ ఆదాయం తక్కువచూపించారని సభ్యులు ఆక్షేపించారు. ప్రతిపాదనలు వాస్తవ రూపంలో రూపొందించిన అనంతరమే చర్చిస్తామని సభ్యులు చెప్పడంతో సమావేశం వచ్చేనెల 9వ తేదీకి వాయిదా పడింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బడ్జెట్‌పై ప్రత్యేక స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో అదనపు కమిషనర్(రెవెన్యూ) గీతా రాధిక ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రతిపాదనలు వాస్తవ రూపంలో లేనందున, ప్రతిపాదనలలో మార్పులు, చేర్పులు అనంతరం సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో బడ్జెట్‌పై చర్చ జరగకుండానే వాయిదా పడింది. సమావేశంలో కమిషనర్ ఇలంబర్తి, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పదవీవిరమణ పొందిన 15 మంది జిహెచ్ఎంసి ఉద్యోగులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడ్మిన్ జాయింట్ కమిషనర్ ఎస్. వి. జానకి రామ్ సాగర్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 15 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం పదవీవిరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వి జానకి రామ్ సాగర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన వారు తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సంస్థకు సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఉద్యోగ విరమణ అనేది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసిలు జీవన్ కుమార్, శారద, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బంధు, మిత్రులు పాల్గొన్నారు.

## ‘సుంకిశాల’ ఘటన బాధ్యులను తొలగించాలి

హైకోర్టు న్యాయవాది ఫజల్ రహమాన్



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** నాగార్జున సాగర్ సుంకిశాల రిటైనింగ్ వాల్ కుంగిన ఘటనలో ప్రాజెక్టు బాధ్యులు సిజిఎం డి.సుదర్శన్‌ను, డైరెక్టర్ రవికుమార్‌ను సస్పెన్షన్ చేయకుండా ఇతర అధికారులను తొలగించడం ఎంతవరకు సమంజసమని హైకోర్టు న్యాయవాది ఫజల్ రహమాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎంఎయుడి సెక్రటరీకి లీగల్ నోటీసులు పంపించినా ఫలితం లేదన్నారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 2న సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలగా, వారం రోజుల ఆలస్యం తర్వాత జలమండలి ఎండి అశోక్‌రెడ్డి నివేదిక ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సుంకిశాల ప్రాజెక్టు డిజైన్, టెంపరింగ్, అంచనా అంతా మేఘా కాంట్రాక్టే నిర్వహిస్తున్నదన్నారు. ప్రమాద ఘటనలో అసలైన సూత్రధారులను కాకుండా వేరే అధికారులను తొలగించడం మేఘా కుట్ర దాగి ఉన్నదని ఆరోపించారు. సుంకిశాల రిటైనింగ్ వాల్‌ను మళ్లీ అదే ప్రాంతంలో పునఃనిర్మించొద్దని కోరారు.

## సుప్రీం ‘తీర్పు’పై పార్లమెంట్‌లో చర్చించాలి

డిబిపి అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** ఎస్‌సి వర్గీకరణ, క్రీమీలేయర్‌కు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని దళిత బహుజన పార్టీ(డిబిపి) వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్‌లో ప్రొఫెసర్ వి.ఎల్.రాజు అధ్యక్షతన జరిగిన మాల మహనాడు రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ వేసి, మాలలకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో వర్గీకరణ వేగవంతంగా జరుగుతున్నా మాల సామాజికి వర్గానికి చెందిన ఎంఎల్‌ఎ వివేక్ మంత్రి పదవి కోసమే మౌనంగా ఉన్నారని ఆరోపించారు. మాల మంత్రులు, ఎంఎల్‌ఎలంతా కలిసి వర్గీకరణను అడ్డుకోవాలన్నారు. లేనిపక్షంలో7 నుంచి జనవరి 26 వరకు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు, ఎంపిల ఇళ్ల ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. సదస్సులో మాలమహానాడు మహిళా విభాగం అధ్యక్షురాలు సిహెచ్ రోజాలీల, తెలంగాణ నేతకాని కులసంఘాల అధ్యక్షుడు గవ్వలశ్రీకాంత్, నేతలు పబ్బతిశీకృష్ణ పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక ప్రశాంతత

వనస్థలిపురం సిఐ శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** క్రీడాల తోనే మానసిక ప్రశాంత లభిస్తుం దని వనస్థలిపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్. శ్రీనివాస్ అన్నారు. శనివారం వనస్థలిపురంలోని జిఎంఆర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెంది న ప్లయర్స్‌లు దాదాపు 50 మంది పాల్గొన్నారు. ఈ ఆయన మా ట్లాడుతూ ఆటల ద్వారా శరీరకంగా, ధృడంగా ఉత్సవంగా ఉం డడానికి ఎంతో ఉపయోగప డుతా యనిన్నారు. ఫైనలిస్ట్స్‌గా నిలిచిన వారికి బహుమతలు అందిం చారు. క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కారానికి కృషి

ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** నియోజకవర్గంలోని కాలనీల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఎల్‌బి నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినా పు రం డివిజన్ పరిధిలోని అగ్రికల్చ ర్ కాలనీ, ఖాద్రి కాలనీ సంక్షేమ వాసులు ఎంఎల్‌ఎ శనివారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎను కలిసి పలు సమస్యలు వివరించారు. ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యాటించి కాలనీ సమస్యలు తెలుసుకుంటామని కాలనీ సంక్షేమ వాసులకు ఈ సందర్భంగా తెలిపారు.

## కరువు తీర్చడంలో గత పాలకులు విఫలం

రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దక్షిణ తెలంగాణ ప్రాంతంలో నెలకొన్న కరువును నియంత్రించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని బిసి బాలికల ఉన్నత పాఠశాలలో రూ.1.50లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభించారు. విద్యార్థినీలకు తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలి ంచారు. అక్కడి నుండి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో పాలమూరు జిల్లాకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించే వారు కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో భారీ ఎత్తున నిధులు కేటాయించడం జరుగుతుందని వివరించారు. లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టుతోపాటు పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సైతం పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటితోపాటు నాణ్యమైన పౌష్టికాహారం ఇచ్చేందుకు పాఠశాల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**30.5మీటర్ల జాతీయ జెండాకు రూ.35లక్షల అమోదంపై చర్చ**

డిసెంబర్1వ తేదీ నుండి 9వ తేదీ వరకు ప్రజాపాలన కాంగ్రెస్ విజయోత్సవాల సంబరాలను నిర్వహిం చేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపల్ పాలక వర్గం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. రూ. 20.50లక్షలతో విజయోత్సవ సంబ రాలు నిర్వహించేందుకు మున్సిపల్ పాలకవర్గం తీర్మాణం చేసినట్లు తెలిపారు. విజయోత్సవ ర్యాలీ మున్సిపల్ ఆఫీసు నుండి బస్టాండ్ వరకు తాగునీరు, స్నాక్స్ ఇచ్చేందుకు రూ.50వేలు, మహి ళా సంఘాల ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువులతో స్టాల్స్ ఏర్పాటు చేయుట, పారిశుద్ధ కార్మికులకు పిపి కిట్లు, ఫ్లెక్సీలు, బొకేలు, శాలువాలు వంటి అనేక అంశాలపై కౌన్సిల్ అమోదం పొందిందన్నారు. భారీ జెండా ఏర్పా టు చేసేందుకు రూ.35లక్షల ఖర్చు అవుతుందని, కోసం వ్యయం చేసేందుకు సభలో తీర్మానం కోసం ప్రవేశ పెట్టారు. మున్సిపల్ చైర్మెన్ న రేందర్, కమీషనర్ చీమ వెంకన్న, మార్కెట్ కమి టీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పిటిసిలు వెంకట్ రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

-బిఎస్‌పి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** అంగన్‌వాడీలకు మౌలికసౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని బిఎస్‌పి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీని వాస్ ఆరోపించారు. శని వారం షాద్‌నగర్ మున్సి ప ల్ పరిధిలోని ఎంపిడిఓ కార్యాలయం అవరణలో చెట్ల కింద ఉన్న అంగన్‌వాడీల వద్దకు వెళ్ళి వివరా లు అడిగి తెలుసుకున్నారు. దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఉపాధి కల్పించలేదని,వారు సమావేశాలు నిర్వహించుకోవా లంటే చెట్ల కింద ఉండి సమావేశాలు నిర్వహించు కుంటున్నామని వివ రించారు. డివిజన్ స్థాయి సమావేశం ఉంటే 300నుండి 400మంది వర కు అంగన్‌వాడీ టీచర్లు వస్తారని, అందరికి ఒకేవాష్‌రూం ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారుల తోపాటు స్థానిక శాసన సభ్యులు తక్షణమే స్పందించి అంగన్ వాడీలకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందో ళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. నియోజకవర్గ అధ్యక్షులు సొంటె శ్రీనివాస్, అసెంబ్లీ కోశాధికారి గాదెపాక మోజస్, మున్సిపల్ అధ్యక్షుడు నేరేటి రాజు, ఫరూ క్‌నగర్ మండల ఉపాధ్యక్షులు కోస్గి రాజు, సీనియర్ నేత గుండేటి నర్సింలు ఉన్నారు.

## విఎంహోంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కోరిన పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** వి.ఎం.హోంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని హోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు భీమగాని మహేశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ అనాథ పిల్లలకు పదవతరగతి తర్వాత చదవడానికి హాస్టల్‌తో కూడిన ఇంటర్, డిగ్రీ రెసిడెన్షి యల్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ఇటీవల విఎంహోం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వ ర్యంలో ఎమ్మెల్సీ ప్రొఫసర్ కోదండరామ్‌ని కలసి వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు పదవతరగతి వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వి.ఎం.హోం లో చదువు తున్నా, హోం నుంచి అర్థాంతరంగా బయటకు పంపడంతో అనాథ పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇంటర్ కళాశాల లేక చదువులు మధ్యలో ఆపేసి కార్మికులుగా మారడం,ఆలనాపాలనా లేకుండా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కోదండరాం, ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్లి పరిష్కారించాలని కోరినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా కాంట్రాక్టు టీచర్ల నియమాకాలలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. విఎంహోంలో వృత్తి విద్యా కోర్సులు వెంటనే ప్రారం భించేలా చుడాలని ఎమ్మెల్సీ ప్రొఫసర్ కోదండరామ్‌ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎం హోం పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు కేతావత్ సాగర్, భాస్కర్, గణేష్, విఠల్, మల్లేష్, అశోక్ తోపాటు టిజెఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లె వినయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.వి.రంగారెడ్డి,కొత్త రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న కీచక లెక్చరర్

వెంటనే సస్పెండ్ చేయాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/చందానగర్ :** విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న శ్రీచైతన్య కళాశాల లెక్చరర్‌ను వెం టనే సస్పెండ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. చందానగర్‌లోని మదినగూడలో ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువు చెప్పే కెమిస్ట్రీ ఫ్యాకల్టీ అధ్యాపకుడు హరీష్ స్టూడెంట్స్ తో అమర్యాదగా ప్రవర్తిస్తూ, అమ్మాయిలతో డబల్ మీనింగ్ మాటలు మాట్లాడుతూ కొడుతూ ఫస్ట్ బెంచ్ లో కూర్చోబెట్టుకొని అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, స్టూడెంట్స్, అమ్మాయిలతో అసభ్యంగా మాట్లా డు తున్నా డన్నారు. ఎదురు చెప్తే ప్రాక్టికల్ మార్క్స్ తీసివేస్తానని అమ్మాయిలను బెదిరిస్తున్నాడని ఉపాధ్యునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మాట్లాడుతూ అమ్మా యిలతో ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యంగా చాట్ చేస్తున్నాడని, ఏమన్నా అంటే ల్యాబ్ ఫ్లాష్ లో ఆసిడ్ పోసేస్తా అని బెదిరిస్తాడని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అమ్మాయిల పట్ల అసభ్యకరంగా మాటలు మాట్లాడతూ విద్యార్థులను ఇబ్బం దులకు గురి చేస్తున్న లెక్చరర్ పైఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా మేనేజ్మెంట్ హరీష్ మీద ఎలాంటి యాక్షన్ తీసుకోలేదని, పేరెంట్స్ తో కలిసి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అతనిపై కేసులు నమోదు చేసి యాజమాన్యం అతనిని సస్పెండ్ చేయాలని కోరుచున్నారు. ఏఐఎస్ఎఫ్ తరపున



ఎవరికి ఇలాంటి అన్యాయం జరగకూడదని ఎక్కడ అన్యాయం జరిగినా ఎఐఎస్ఎఫ్ ముందుంటుందని తెలిపారు కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ శేర్లింగంపల్లి నియోజక వర్గ ప్రెసిడెంట్ టి.నితీష్ కార్యదర్శి ధర్మతేజ, టి.గణేష్ సహాయ సెక్రెటరీ, చింటూ, కిరణ్ సంతు తదితరులు పాల్గొన్నారు.

## కష్టజీవులకు అండ ఎర్ర జెండా

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** కష్టజీవులకు ఎర్ర జెండా పార్టీ అండగా ఉంటుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి అన్నారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి సుధీర్ అధ్యక్షతన రావులపల్లి కలాన్ గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి హాజరై సిపిఐ జెండావిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ శంకర్‌పల్లి మండలానికి కూతవేటు దూరంలో ఉన్న రావులపల్లి గ్రామంలో



కొన్ని నెలలుగా గ్రామ కార్యదర్శి కనిపించకపోవటంతో అభివృద్ధి కుంటు పడిందన్నారు. గ్రామంలో ఎక్కడ చూసిన డ్రైనేజీ సమస్య ఘోరంగా ఉందని, ఊరంతా పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తున్నయని మండి పడ్డారు. గ్రామానికి రావటానికి రోడ్డు గుంతల మయంగా మారి ప్రమాదాలు జరుగుతున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నరని ఆయన అధికారులు నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడ్డారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని,రైల్వే అధికారులు చొరవ చూపి ట్రైన్ నిపిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం 2025 సంవత్సర సభ్యత్వాన్ని పార్టీ సభ్యులకు సభ్యత్వ కార్డులను ఆయన అందజేశారు.

**నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నిక :** రావులపల్లి గ్రామ శాఖ నూతన కమిటీ శనివారం ఎన్నిక జరిగింది. గ్రామ శాఖ కార్యదర్శిగా జై శేఖర్, సభ్యులుగా శివరాజ్, మహేందర్, పాతిమా, పంతయ్య, ఆరీఫ్, జంగయ్య, సత్తయ్య, ప్రవీణ్‌లు తదితరులు ఎన్నికైయ్యారు.

## మధ్యాహ్న భోజనంతో విద్యార్థులకు అవస్థలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నాణ్యతలేని మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టడంతోనే తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్ వివరించారు. శనివారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. పవన్ చౌహాన్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి పదవి ఎవరికి ఇవ్వకుండా కేవలం ముఖ్యమంత్రి వద్దనే పెట్టుకోవడంతోనే విద్యావ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలం నుండి విద్యావ్యవస్థపై ఎలాంటి సమీక్ష నిర్వహించకపోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగానే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవుతుందని వివరించారు. ఇప్పటికైన ప్రభు త్వం స్పందించి విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేసి సమీ క్ష నిర్వహించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంతో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్, షాద్‌నగర్ అధ్యక్షులు నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సుమేర్ శివ శంకర్, రాహుల్, సాయిలు ఉన్నారు.

## గురుకులాల విద్యార్థులకు అవస్థలు..

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే గురుకులాల విద్యార్థులు ఆహారం తీని తీవ్ర అనారోగ్యానికి గురైతున్నారని ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి ఆరోపిం చారు. శనివారం గురుకుల విద్యార్థులపట్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల బంద్‌ను పిలుపుని చ్చారు. ఈ మేరకు ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో హయత్ నగర్ మండల కేంద్రంలో విద్యా సంస్థలు బంద్ నిర్వహించారు. గురుకులల్లో కనీస మౌలిక సదుపాయలు లేక అనేక సమస్యలతో ఉన్నారని వాటిని తక్షణమే పరిష్కారం చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బ్లొ అరుణ్ కుమార్ గౌడ్, వినోద్, వెంకటేష్, ఉపేందర్, భాను ప్రకాష్, శివ, వంశీ, పాల్గొన్నారు.

### బంద్ విజయవంతం: ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** ప్రభుత్వ విద్యాలయాల్లో బడుగు బలహీన వర్గాల, ఆర్థికంగా వెనుక పడిన వారి కుటుంబాల విద్యార్థులు ఉంటారని వారి పట్ల ప్రభుత్వం బాధ్యత రహితంగా ఉండటం సిగ్గు చేటని ఎఐఎస్ఎఫ్ సరూర్ నగర్ మండల కార్యదర్శి వినోద్ అన్నారు. శనివారం సరూర్ నగర్ లో వామపక్ష విద్యార్థి సంఘాలు ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్ యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేయించారు.

## 1నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామిరెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయాంజల్:** ఈనెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతున్న ప్రజాపాలన విజ యోత్సవాలను జయప్రదం చేయాలని పురపాలక చైర్‌పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాగన్నగూడ వార్డు కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన సమా వేశంలో, పాలకమండలి 9 రోజులు నిర్వహించవలసిన కార్యక్రమాలపై చర్చించి సూచనలు చేశారు. ప్రజా సౌచాలయాలను శుభ్రపరచుట, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం, ప్రజా పాలన విజయోత్సవ ర్యాలీ, హెల్త్ క్యాంప్, నీటి వనరులను శుభ్రపరచుట, సాంస్కృతిక కార్యక్రమాలు, రక్షక పరికరాల పంపిణీ, పారిశుద్ధ్య సిబ్బందికి సన్మానం వంటి కార్యక్రమాలు ఉన్నట్లు పుర కమిషనర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ హరిత ధనరాజ్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పుర అధికారులు పాల్గొన్నారు

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమే

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** పదవీ విరమణ తర్వాత హైదర్ అలీ శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలని, ప్రతి ఉద్యోగి పదవీ విరమణ సమాజమే అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శనివారం పదవి విరమణ పొందిన రెవెన్యూ డిపార్ట్మెంట్ ఉద్యోగి హైదర్ అలీ కి తన ఛాంబర్ లో శాలువా కప్పి,జ్ఞాపికను అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో నాలుగో తరగతి ఉద్యోగిగా 24 సంవత్సరాలు ఎంతో నిబద్దతతో పని చేసిన హైదర్ అలీ సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చెప్పారు. తోటి ఉద్యోగులతో ఎప్పుడు కలివిడిగా ఉంటూ సేవలందించిన హైదర్ ఆలీని ఉన్నతాధికారులు, తోటి ఉద్యోగులు శాలువాళ్లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ అడ్మి నిస్ట్రేషన్ అధికారి(ఎ.ఒ)సునీల్,నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సి.సుధాకర్,నాయకులు పకీర్ చంద్, రఘు, నాగభూషణం, జయమ్మ, స్వరూప, దుర్గమ్మ,నాగరాజు,రవీంద్ర,అశోక్ కుమార్, పాల్గొన్నారు.

## బాలమల్లేష్ ఆకస్మిక మృతి బాధాకరం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** పేద ప్రజల ఆశాజ్యోతి, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు బాల మల్లేష్ అకస్మాత్తుగా మరణించడం చాలా బాధాకరం సిపి ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆం దోజు రవీంద్ర చారి అన్నారు. చిన్నతనం నుండి ఎఐఎస్ఎఫ్,ఎఐ వైఎఫ్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బాధ్య తాల్లో నిర్వహిస్తున్న బాల మల్లేష్ అనేక బాధ్యతలు నిర్వహించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అనేక మంది పేదల ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటా లు నిర్వహించి, వేలాది మందికి పట్టాలు,ఇండ్లు ఇప్పిచ్చిన ఘన చరిత్ర కలిగిన నాయకుడన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు రవీంద్ర చారి విప్లవజోహార్లు అర్పిస్తూ వారి సానుభూతి తెలియజేశారు.

## రూ.34లక్షల వ్యయంతో కొత్త డ్రైనేజీ లైన్లు

**ప్రజాపక్షం/చంపాపేట:** లింగోజి గూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు బస్తీల్లో కొత్తగా రూ.34 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ లైన్లు, అనుసం ధానం పనులను చేపట్టనున్నట్లు జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం జలమండలి ఎం.డి. అశోక్‌రెడ్డిని కలిసి డివిజన్‌లో పలు సమస్యలను విన్నవించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి ఆయన సాను కూలంగా స్పందించి నిధులు మం జూరు చేశారని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ప్రభుత్వం

**ప్రజాపక్షలం/చంపాపేట:** రైతు లకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తు ందని, బిఆర్ఎస్ పార్టీ నాయకుల కుట్రకుతాంత్రాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజ శేఖర్‌రెడ్డిఅన్నారు. చలో మహబూబ్‌నగర్ రైతు పండుగ సభా కార్యక్ర మానికి శనివారం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్య కర్తలు తరలివెళ్లారు. లింగోజిగూడలో ఆయన మాట్లాడు తూ రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్ప డిన వెంటనే ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసింద న్నారు. కార్యక్రమంలో నాయ కులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, యస్వంత్‌రాజ్, గోవర్ధన్, సుధీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** అయ్యప్ప స్వామిపై నమ్మకంతో అయ్యప్ప మాల ధరించి నిష్టతో 41 రోజుల పాటు దీక్షను చేసి శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకునే ముందు అయ్య ప్ప భక్తులు నిర్వహించే మహా పడిపూజ ను కన్నె స్వామి డాక్టర్ కృష్ణ తులసి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ దిల్ షుక్ నగర్ లోని వివేకానందనగర్ కాలనీలో ఉన్న తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు అయ్యప్ప స్వామి18 మెట్ల పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు డాక్టర్ కృష్ణ తులసి,డాక్టర్ మౌనిక రెడ్డి దంపతులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అయ్య ప్ప స్వాములతో పాటు పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడ

# దారికొచ్చిన పాకిస్థాన్..!

## 2 షరతులతో హైబ్రిడ్ మోడల్‌కు ఓకే!



ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై సందిగ్ధత తొలగింది. పాకిస్థాన్ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో హైబ్రిడ్ మోడల్‌లోనే ఈ టోర్నీని నిర్వహించనున్నారు. పాకిస్థాన్‌కు ఎట్టిపరిస్థితుల్లో టీమిండియాను పంపించమని బీసీసీఐ స్పష్టం చేయడం, మరోవైపు హైబ్రిడ్ మోడల్‌లోనే టోర్నీ నిర్వహించడానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పట్టుబట్టడంతో.. గత కొంత కాలంగా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై అనిశ్చితి నెలకొన్న విషయం తెలిసిందే.కానీ శనివారం జరిగిన సమావేశంలో ఐసీసీ చేసిన ఒత్తిడికి పాకిస్థాన్ దారికొచ్చింది. హైబ్రిడ్ మోడల్‌ను అంగీకరించకపోతే పాక్ లేకుండానే టోర్నీని నిర్వహిస్తామని ఐసీసీ స్పష్టం చేయడంతో.. వేరే దారిలేక పాక్ బోర్డు తలవంచింది. అయితే ఐసీసీ ముందు రెండు షరతులు ఉంచింది. హైబ్రిడ్ మోడల్‌తో తమ ఆదాయానికి గండి పడుతుందని, కాబట్టి ఐసీసీ నుంచి వచ్చే రెవెన్యూను పెంచాలని తెలిపింది. నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఇండియాకు తమ జట్టును పంపించమని పరోక్షంగా పేర్కొంది. ఈ రెండింటిని అంగీకరించాలని ఐసీసీ కోరింది. 2008 ముంబయి దాడుల అనంతరం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించని విషయం తెలిసిందే. ద్వైపాక్షిక సిరీస్‌లతో పాటు ఆసియా కప్ వంటి టోర్నీల కోసం టీమిండియా తమ దేశానికి రావాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎన్నిసార్లు విన్నవించినా బీసీసీఐ అంగీకరించలేదు.



# రెండో టెస్టులో ఆ ముగ్గురూ... స్థానాలు కోల్పోతారు

డిసెంబర్ 6 నుంచి అడిలైడ్ వేదికగా రెండో టెస్టు ప్రారంభం కానుంది. పింక్ బాల్‌తో జరగనున్న ఈ డే/నైట్ టెస్టు భారత కాలమాన ప్రకారం ఉదయం 9.30 గంటలకు మొదలవుతుంది. అయితే ఈ మ్యాచ్‌లో భారత తుదిజట్టులో మూడు మార్పులు చోటు చేసుకుంటాయని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు. వ్యక్తిగత, గాయాల కారణాలతో దూరమైన రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ తిరిగి రెండో టెస్టుకు అందుబాటులోకి రావడంతో ప్లేయింగ్ 11లో మార్పులు ఉండనున్నాయని తెలిపాడు. రోహిత్ శర్మ, గిల్ రాకతో ధ్రువ్ జురెల్, దేవదత్ పడిక్కల్ తమ స్థానాలు కోల్పోతారని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. అయితే పెర్త్ టెస్టులో ఆడిన ఏకైక భారత స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ కూడా బెంచ్‌కే పరిమితం అయ్యే అవకాశాలున్నాయని తెలిపాడు. సుందర్ స్థానంలో రవీంద్ర జడేజా తుదిజట్టులోకి వస్తాడని అన్నాడు. ''రెండు మార్పులు అయితే కచ్చితంగా చోటు చేసుకుంటాయి. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ప్లేయింగ్ 11లో ఉంటారు. ఈ క్రమంలో బ్యాటింగ్ ఆర్డర్ ఛేంజ్ అవుతుంది. కేఎల్ రాహుల్ స్థానంలో రోహిత్ ఓపెనర్‌గా వస్తాడు. దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ జట్టులో చోటు కోల్పోతారు. కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. ఇక వాషింగ్టన్ సుందర్ స్థానంలో జడేజా తుదిజట్టులోకి వచ్చే అవకాశం ఉంది'' అని సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు.

# కేన్ విలియమ్సన్ అరుదైన ఘనత



గాయం నుంచి కోలుకుని తిరిగొచ్చిన న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ సత్తాచాటుతున్నాడు. స్వదేశంలో హాగ్లీ ఓవల్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో జట్టు టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 197 బంతుల్లో పది ఫోర్లతో 93 పరుగులు చేసిన కేన్ మామ.. రెండో ఇన్నింగ్స్లో 86 బంతుల్లో 61 పరుగులు చేశాడు. ఏడు బౌండరీలు బాదాడు. ఈ క్రమంలో టెస్టుల్లో 9వేల పరుగుల మైలురాయిని అందుకున్న విలియమ్సన్ అరుదైన ఘనత సాధించాడు. టెస్టుల్లో 9వేల పరుగులు సాధించిన తొలి న్యూజిలాండ్ బ్యాటర్‌గా కేన్ విలియమ్సన్ చరిత్ర సృష్టించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన 19వ బ్యాటర్ విలియమ్సన్. ఇక టెస్టుల పరంగా వేగంగా 9వేల పరుగుల మార్క్‌ను అందుకున్న మూడో బ్యాటర్‌గా కుమార్ సంగక్కర (శ్రీలంక), యునిస్ ఖాన్ (పాకిస్థాన్) సరసన కేన్ మామ నిలిచాడు. 103వ టెస్టులో ఈ ఘనత సాధించాడు. ఈ జాబితాలో విలియమ్సన్ కంటే ముందు స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా 99 టెస్టులు), బ్రియాన్ లారా (వెస్టిండీస్ 101 టెస్టులు) ఉన్నారు.

రీల్



# ఓటిటిలోకి 'అమరన్'

మన తెలుగులో కూడా మంచి ఆదరణ ఉన్న తమిళ హీరోస్‌లో యంగ్ హీరో శివ కార్తికేయన్ కూడా ఒకరు. మరి తాను నటించిన లేటెస్ట్ చిత్రమే అమరన్. సాయి పల్లవి హీరోయిన్‌గా దర్శకుడు పెరియసామి తెరకెక్కించిన ఈ చిత్రం దీపావళి కానుకగా వచ్చి తమిళ్ సహా తెలుగులో కూడా భారీ విజయాన్ని సాధించింది. అయితే ఈ సినిమా థియేటర్స్ లో బ్లాస్టింగ్ రన్ ని కొనసాగించగా మేకర్స్ ఓటిటి రిలీజ్ ని అయితే వాయిదా వేశారు. దీనితో ఈ సినిమా ఓటిటి రిలీజ్ పట్ల మరింత ఆసక్తి నెలకొనగా ఇపుడు ఫైనల్ గా మేకర్స్ సినిమా అఫీషియల్ ఓటిటి రిలీజ్ డేట్ ని అయితే ఇచ్చేసారు. ఈ చిత్రాన్ని ఈ డిసెంబర్ 5 నుంచి తమిళ్, తెలుగు, సహా హిందీ, కన్నడ మరియు మళయాళ భాషల్లో స్ట్రీమింగ్ కి తెస్తున్నట్టుగా మేకర్స్ సహా నెట్ ఫ్లిక్స్ వారు అఫీషియల్ గా డేట్ ని ఇచ్చేసారు. మరి థియేటర్స్ లో ఎంతో ఆదరణ అందుకున్న ఈ ఎమోషనల్ బయోపిక్ ఓటిటిలో వచ్చాక ఎలాంటి ఆదరణ అందుకుంటుందో చూడాలి.



# షూటింగ్ ముగించుకున్న అనుష్క 'ఘాటి'

టాలీవుడ్ స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఘాటి' ప్రేక్షకుల్లో సాలిడ అంచనాలను క్రియేట్ చేసింది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్స్, వీడియో గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఈ సినిమాలో అనుష్క పాత్ర మాస్ షేడ్స్‌తో ఉండబోతున్నట్లు ఈ వీడియో గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. ఇక ఈ సినిను ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, తాజాగా ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించి ఓ అప్డేట్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్‌ను మేకర్స్ తాజాగా పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. షూటింగ్ పూర్తి కావడంతో ఇక పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వీలైనంత త్వరగా ముగించాలని చిత్ర యూనిట్ భావిస్తోందట.ఈ సినిమాను దర్శకుడు క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేస్తుండటంతో ఈ చిత్రంలో ఎలాంటి కంటెంట్ ఉండబోతుందా అనే ఆసక్తి నెలకొంది. పాన్ ఇండియా మూవీగా రాబోతున్న ఈ సినిమాను వేసవి కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.



# చరణ్ 16లో మున్నా భయ్యా..

చరణ్ కెరీర్ లో 16వ సినిమాగా తెరకెక్కిస్తున్న సినిమా నుంచి మేకర్స్ సాలిడ్ అప్డేట్ అందించారు. దర్శకుడు తనకి ఎంతో ఇష్టమైన ఎడిషన్ అంటూ దీనిని ఇపుడు రివీల్ చేశారు. మరి రీసెంట్ గానే ఈ చిత్రంలో మీర్జాపూర్ సిరీస్ ఫేమ్ సాలిడ నటుడు దివ్యేందు శర్మ ఉన్నట్టుగా పలు రూమర్స్ వచ్చిన సంగతి తెలిసిందే. మరి తనపై ఇపుడు మేకర్స్ అదిరే పోస్టర్‌తో అప్డేట్ ఇచ్చేసారు. తన లుక్ ని కంప్లీట్ గా మాస్ లెవెల్లో రివీల్ చేస్తూ ఇచ్చిన పోస్టర్ ఇపుడు పాన్ ఇండియా ఆడియెన్స్ కి ఎగ్జైట్మెంట్ ని తీసుకొచ్చింది. మరి తాను ఈ సినిమాలో ఎలాంటి రోల్ లో కనిపిస్తాడో చూడాల్సిందే. ఇక ఈ చిత్రానికి వృద్ధి సినిమాస్, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న సంగతి తెలిసిందే.

# పక్కా ప్లానింగ్ తో రామ్‌తో కొత్త సినిమా..



మన టాలీవుడ్ యంగ్ హీరో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా టాలెంటెడ్ దర్శకుడు మహేష్ తో అనౌన్స్ చేసిన సినిమా మంచి బజ్ ని అయితే అందుకుంది.మరి ఈ సినిమా రామ్ కెరీర్లో 22వ సినిమాగా రాబోతుండగా ఇపుడు మేకర్స్ మాత్రం ఈ చిత్రాన్ని పక్కా ప్లానింగ్ తో క్లారిటీగా తీసుకెళ్తున్నారు అని చెప్పాలి. ఇలా మొత్తానికి అయితే రామ్ సినిమా మాత్రం ఒక పక్కా ప్లానింగ్ అండ్ క్లారిటీతో తీసుకెళుతున్నారని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా భాగ్యశ్రీ బోర్స్ హీరోయిన్ గా నటిస్తుంది.

# ఆకస్మిక మృతి

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 4 గంటలకు జరుగుతాయి.

**ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో..**

మేడ్చల్ జిల్లా యాప్రాల్‌లోని నివాసంలో బాలమల్లేశ్‌కు శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గుండె నొప్పి రావటంతో కుటుంబసభ్యులు హుటాహుటిన సమీపంలోని కందిగూడలో శ్రీనివాస ఆస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏఎస్ రావునగర్‌లోని పాలోమి ఆస్పత్రికి తరలించారు. మార్గ మధ్యంలోనే ఆయన తుది శ్వాస విడిచినట్లు ఆస్పత్రి వైద్యులు ధృవీకరించారు. బాలమల్లేష్ మరణవార్త తెలియటంతో సిపిఐ శ్రేణులు, వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బాలమల్లేష్ ఇక లేరన్న విషయాన్ని తెలియటంతో పెద్ద సంఖ్యలో మహిళలతో పాటు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాలోమి ఆస్పత్రికి చేరుకున్నారు. ఇంత కాలం తమ కష్టాల్లో తోడూ ఉంటూ తమను విడిచి పెట్టి వెళితే ఇక తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యుల మాదిరి రోదించటం పలువురిని కదిలించింది. యాప్రాల్ ప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలమల్లేష్ మరణించిన విషయం తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్, రాష్ట్ర నాయకులు జి.దామోదర్‌రెడ్డి, దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి శంకర్, మండల కార్యదర్శులు కిషన్,నర్సింహులు పాలోమి ఆస్పత్రి చేరుకొని భౌతికకాయానికి నివాళులర్పించారు. బాలమల్లేష్ పార్థివదేహాన్ని ఆస్పత్రి నుండి యాప్రాల్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు.

**విద్యార్థి నేత నుంచి జాతీయ సమితి దాకా...**





## సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సంతాపం

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఎన్. బాలమల్లేష్ మృతి పట్ల సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు సయ్య ద్ అజీజ్ పాషా, రామకృష్ణ పాండా, సిపిఐ ఎంపి పి.సందోష్ కుమార్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో వారు ఫోన్‌లో మాట్లాడి బాలమల్లేష్ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. పార్టీ పట్ల అంకితభావంతో బాల మల్లేష్ పని చేసేవారని గుర్తు చేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా యాప్రాల్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో 1966 జూన్ 15వ తేదీన బాలమల్లేష్ జన్మించారు. ఐదేళ్ల ప్రాయంలోనే తండ్రి సాయిలు మరణించడంతో తల్లి మల్లమ్మ అన్ని తానై పెంచారు. బాలమల్లేష్ విద్యార్థి దశలో తన ఉద్యమ సహచరి, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఎ.ఆర్.దేవరాజ్ కుమార్తె వందనను వివాహం చేసుకున్నారు.1984లో దశలో సికింద్రాబాద్‌లోని న్యూ గవర్నమెంట్ కాలేజీలో పదవ తరగతి చదువుకునే సమయంలోనే విద్యార్థి ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులైన బాలమల్లేష్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్)లో చేరారు. తరువాత 1987లో లక్డీకాపుల్‌లోని బాబూ జగజీవన్‌రాం జూనియర్ కాలేజిలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎఐఎస్ఎఫ్ తరుపున బాలమల్లేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. మగ్దూంభవన్‌లోనే చదువుకుంటూ, ఎఐఎస్ఎఫ్ బాధ్యతలు నిర్వహిస్తూ, రెడ్‌గార్డ్‌గా కూడా ఉన్నారు. అనంతరం పడాల రాంరెడ్డి లా కాలేజి నుండి 1992లో న్యాయవాద పట్టా పుచ్చుకొన్నారు. కొంత కాలం ఆయన వివిధ పత్రికలలో జర్నలిస్టుగా కూడా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990 దశకంలో క్యాపిటేషన్ ఫీజుకు వ్యతిరేకంగా, ఇతర విద్యార్థి సమస్యలపై ఉవ్వెత్తున జరిగిన ఉద్యమాల్లో బాలమల్లేష్ క్రియాశీలక పాత్ర పోషించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. అనేక మంది విద్యార్థులను నాయకులుగా తీర్చిదిద్దారు. , ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడిగా, రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీ క్లిష్ట పరిస్థితులలో ఉన్న సమయంలో రాష్ట్ర పార్టీ నాయకత్వం ఆదేశాల మేరకు చిన్న వయసులోనే బాలమల్లేశ్ 2004లో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆ సందర్భంగా అనేక భూపోరాటాలు నిర్వహించి, పేదలకు ఇళ్ళు ఇప్పించారు. చెంగిచెర్ల ప్రాంతంలో 3000 మందికి ఇళ్ల స్థలాలను ఇప్పించేందుకు ఆయన ఉద్యమించారు. అనేక ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించిన బాలమల్లేష్ స్వస్థల ప్రాంతమైన యాప్రాల్‌లో పలువురికి ఆపదలో అవసరం ఉన్న వారికి ఆర్థిక సాయం సైతం అందించారు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ సందర్భంగా ఆయన పలువురికి బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులు, మాస్కులు, సానిటైజర్లను అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇటీవలే సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇటీవల హనుమకొండలో జరిగిన సిపిఐ రాష్ట్ర నిర్మాణ సమితి సమావేశాలలో బాలమల్లేష్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. బికెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, బిసి హక్కుల సాధన సమితికి ప్రధాన కార్యదర్శిగా, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలకు పార్టీ నుండి నిర్మాణ బాధ్యుడిగా బాలమల్లేష్ వివిధ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారు. అన్ని వామపక్ష పార్టీలను, మేధావులను, సామాజిక కార్యకర్తలను సమన్వయం చేసే విషయంలో అలుపెరగకుండా కృషి చేశారు

# క్రీడారంగంలో సమూల మార్పులు

✻ తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ కె.శివసేనారెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిసెంబర్‌తో ఏడాది పూర్తి చేసుకుంటోందని, ఈ ఏడాది పాలనలోనే క్రీడారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చామని తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ కె.శివసేనారెడ్డి అన్నారు. గేమ్స్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా క్రీడా పోటీల వివరాల సేకరణతో పాటు ప్యారా క్రీడా పోటీల నిర్వహణకు పలు సబ్ కమిటీల ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్‌తో ఏడాది పాలన పూర్తి కావస్తున్న సదర్భంగా శనివారం ఎల్‌బి స్టేడియంలోని తన కార్యాలయంలో శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ క్రీడాకారులు బంగారు బతకాలు సాధించి రాష్ట్రానికి పేరుతెస్తున్నారని, ఈ క్రమంలో గత బిఆర్ఎస్ పాలన మాదిరి కాకుండా క్రీడాకారుల సమాచారాన్ని సమగ్రంగా ఒక చోట చేర్పించి వారికి ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందిస్తామని శివసేనా రెడ్డి అన్నారు. ముఖ్యంగా గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించిక క్రమంలో మట్టిలో మాణిక్యాలయిన గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సాహం అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు పలు అంతర్జాతీయ పోటీలతో పాటు గ్రామీణ క్రీడారంగానికి ఊతమిచ్చేలా సిఎం కప్ 2024 ను శాట్స్ సంస్థ నిర్వహించనుందన్నారు. ఈసారి సిఎం కప్ క్రీడా పోటీల నిర్వహణలో గేమ్స్ మేనేజ్మెంట్ సిస్టం ( జి ఎం ఎస్ ) ద్వారా క్రీడా పోటీల సమాచార సమాహారాన్ని అందులో పొందుపరుస్తామన్నారు. ఇది ప్రస్తుత క్రీడా పోటీల నిర్వహణ మాత్రమే కాకుండా భవిష్యత్తు అవసరాలకు ఈ క్రీడాకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేలా నూతన క్రీడా విధానాన్ని రూపొందిస్తున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించినట్లే మొట్టమొదటి సారిగా ప్యారా క్రీడాంశాలకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ క్రీడాకారులు, మేధావుల కలబోతగా పారదర్శకంగా ప్రతిభకు పట్టం కడతామన్నారు. ఇప్పటికే ప్యారా క్రీడా పోటీల నిర్వహణకు అధికారులు క్రీడా సంఘాలతో కూడిన పలు సబ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ విషయమై ఒలంపిక్ అసోసియేషన్ పలు క్రీడా సంఘాలతో పలు దపాలుగా చర్చించామని శాట్స్ ఛైర్మన్ ఎన్. శివసేనారెడ్డి అన్నారు.

# మాయలోపడి... మోసపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులపై దాడులు చేసి ఉంటే నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు పూర్తయ్యేవా, అభివృద్ధి జరగాలంటే కొందరు నష్టపోక తప్పదు. వారికి కావాల్సిన నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుంది. వాళ్లకు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. ఇప్పుడు వాళ్లు వస్తారు. పోతారు.. కానీమన ప్రాంతానికి పరిశ్రమలు మళ్లీ వస్తాయా? ఇంట్లో ఒకరికి ఉద్యోగం వస్తే ఒక తరం పరిస్థితే మారుతుంది. అలాంటి అవకాశం మీరు కోల్పోవద్దు. కెసిఆర్.. నీ మొసలి కన్నీరు పాలమూరు జిల్లా పై కాదన్నారు. నేను ఇక్కడ పుట్టినొన్ని.. ఇక్కడి మట్టిలో కలిసే వాణ్ణి ఈ ప్రాంతంపై నాకంటే ఎక్కువ ప్రేమ ఎవరికి ఉంటుందని, పారిశ్రామిక వాడ తెచ్చి 25 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే జిమ్మేదారి నాది. మీ కుట్రలు, కుతంత్రాలకు నేను బెదిరేవాణ్ణి కాదు. తోడేళ్లు, పులులు ఎన్నో చూశా మానవ మృగాలు . మాకు ఏ బ్రాండ్ అంబాసిడర్లు అవసరం లేదు. మీరే మా బ్రాండ్ అంబాసిడర్స్. ఒక్కొక్క యువకుడు ఒక రేవంత్‌రెడ్డిగా మారి అభివృద్ధిని ప్రజలకు చేర్చండి' అంటూ సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాలమూరులో 20 లక్షలు ఎకరాలకు నీళ్లు తెచ్చే బాధ్యత తనదని ప్రజలకు భరోసాని ఇచ్చారు. నవంబర్ 30,2023కు దేశ రాజకీయాల్లోనే ఒక గొప్ప ప్రాధాన్యత ఉందన్నారు. పోలింగ్ బూత్ లలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అండగా నిలబడి ఇవాళ్టికి సరిగ్గ ఏడాది పూర్తయిందని ప్రజలు హర్షద్వారాల మధ్య తెలిపారు. రైతు బిడ్డగా కొండారెడ్డి పల్లి గ్రామ నుంచి బయలుదేరి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఇక్కడికి హి బిఆర్ఎస్, బిజెపి నాయకులు ఎలాంటి విమర్శలు చేస్తున్నారో గమనించాలన్నారు. పదేళ్లలో వాళ్ళు ఏం చేశారో నాకంటే మీకే ఎక్కువ తెలుసు నని రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్ల పాలనలో రైతు రుణమాఫీ జరిగిందా? రైతుకు గిట్టుబాటు ధర లభించిందా? అంటూ ప్రశ్నించారు. వరి వేస్తే ఉరే అని చెప్పిన ఆనాటి పెద్దమనిషి కెఆర్...



రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతుంటే, బిఆర్ఎస్ గుండెల్లో పిడుగులు పడుతున్నట్లయింది. రేవంత్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం లేకపోయినా, చుక్క నీరు రాకపోయినా కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల ద్వారా నీళ్లిచ్చి 66 లక్షల ఎకరాల్లో 1 కోటి 50 లక్షల వరిధాన్యం తెలంగాణ రైతులు పండించారని సిఎం చెప్పారు. వరికి బోనస్ అందించి గర్వంగా పాలమూరు గడ్డపై రైతు పండుగ చేసుకుంటున్నామని ప్రతి ఏటా రైతు పండుగ జరుపుకుందాం అన్నారు. ఆనాడు ఔటర్ రింగ్ రోడ్డు ను రూ.7500 కోట్లకు తెగనమ్మి ఐదేళ్లలో వాళ్లు రుణమాఫీకి ఖర్చు చేసింది. 11 వేల కోట్లేనని ఈ 11 వేల కోట్లలో రూ.8596 కోట్లు మిత్తికే పోయినాము. రైతులకు మీరు చెల్లించింది కేవలం రూ.2500 కోట్లే నని ఆయన వివరించారు. మిస్టర్ హరీష్ రావు ఇది విను లెక్కలు కావాలంటే మళ్లీ చెబుతామన్నారు. కెసిఆర్‌కు ఈ వేదికగా సవాల్ విసురుతున్నా 25 రోజుల్లో రూ.17,869 కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర దేశంలో ఎక్కడైనా ఉందా నిరూపించండి అని డిమాండు చేశారు. మోదీ వస్తారో కెసిఆర్ వస్తారో రండి చర్చిద్దాం. మొదటి ఏడాదిలోనే 25 లక్షల మది రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ప్రభుత్వం తమదన్నారు. ఒక్కొక్కరుగా వస్తారో అందరూ కలిసి వస్తారో రండి అసెంబ్లీలో చర్చిద్దాం అని అన్నారు.

# అమెరికాలో కాల్పులు.. తెలుగు విద్యార్థి మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అమెరికా నడిబొడ్డు చికాగో నగరంలో దుండగులు జరిపిన కాల్పుల్లో తెలుగు విద్యార్థి మృతిచెందారు. ఖమ్మం నగరంలోని రమణగుట్ట ప్రాంతానికి చెందిన నూకారపు కోటేశ్వరరావు కుమారుడు సాయితేజ నాలుగు నెలల క్రితం ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. చదువుతూ ఓ స్టోర్‌లో సాయితేజ స్టోర్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. భారత కాలమానం ప్రకారం ఈనెల 29న రాత్రి 1గంటకు దుండగులు స్టోర్‌లో జోరబడి సాయితేజపై కాల్పులు జరిపారు. సాయితేజ అక్కడికక్కడే మృతిచెందగా దుండగులు కౌంటర్‌లోని క్యాష్‌తో పరారయ్యారు. నూకారపు కోటేశ్వరరావు, వాణి దంపతులకు కూతురు, కుమారుడు ఉండగా కూతురు నాలుగేళ్ల క్రితమే అమెరికా వెళ్లింది. కుమారుడు ఈ ఏడాది జూన్ 15న ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన నాలుగు నెలల్లోనే కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎంఎల్‌సి తాతా మధు తానా ప్రతినిధులతో మాట్లాడుతున్నారు. శనివారం కోటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు.

**ఎంపిలు సంతాపం :** అమెరికాలో జరిగిన కాల్పుల్లో ఖమ్మం విద్యార్థి సాయితేజ మృతిపట్ల ఖమ్మం లోక్‌సభ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలు సంతాపం తెలిపారు. ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి మృతుని తండ్రి కోటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. సాయితేజ మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి సాయితేజ అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఎంపిలు తెలిపారు.

# ఉపాధి క్యాలెండర్ ప్రకారం రైల్వే నియమకాలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఉపాధి క్యాలెండర్ ప్రకారమే ఉద్యోగ నియమకాలను భారతీయ రైల్వే చేపడుతువస్తోంది. భారతీయ రైల్వేలు 2014—24 మధ్య కాలంలో 5 లక్షల మంది ఉద్యోగులను నియామకం చేసుకోగా, 2004—2014 మధ్య కాలంలోనే కేవలం 4 లక్షల మంది ఉద్యోగులు మాత్రమే నియమించబడ్డారు. ఇది 2004—2014 కంటే 25 శాతం ఎక్కువ కావడం గమనార్హం. కాగా భారతీయ రైల్వే చరిత్రలో తొలిసారిగా ఉపాధి క్యాలెండర్‌ను ప్రచురించారు. షెడ్యూల్ ప్రకారం అన్ని ఖాళీల నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. ఫిబ్రవరి 2024లో క్యాలెండర్ ప్రణాళికా ప్రకారం 18,799 అసిస్టెంట్ లోకో పైలట్ (ఏ.ఎల్.పి.) ఖాళీ పోస్టుల కోసం నియామక ప్రకటన జారీ చేశారు. రాష్ట్రాలలో నవంబర్ 2024 నెలలో ఏఎల్‌పి నియామకం కోసం మొత్తం 29 రాష్ట్రాలలోని 156 నగరాలలో 346 కేంద్రాలలో 5 రోజులు పరీక్షలు నిర్వహించారు. 2024 నవంబర్ 25వ తేదీన 2 లక్షల 22 వేల 498 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 2024 నవంబర్ 26 న 2లక్షల 26 వేల 920 మంది అభ్యర్థులు, 27 న 2లక్షల 30 వేల 273 మంది, 28వ తేదీన 2లక్షల 30 వేల 518 మంది, 29న 2 లక్షల 30వేల 722 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 18.4 లక్షల మంది యువకులు 18,700 ఖాళీలకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 11.4 లక్షల మంది ( 62 శాతం ) అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com